


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 3-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 289 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 9.20 తదుపరి దశమి; నక్షత్రం: కృత్తిక రా. 12.53 తదుపరి రోహిణి; వర్జ్యం: మ. 12.02-1.45; దుర్ముహూర్తం: మ. 12.52-1.37, మ. 3.07-3.53; అమృతఘడియలు: రా. 10.18-12.01; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore






## కోహ్లీసేన కొత్త చరిత్ర

### చివరి టీ20లోనూ కివీస్‌పై విజయం

### 5–0 క్లీన్‌స్వీప్‌తో భారత్ రికార్డు

*అదే జోరు.. అదే ఊపు.. మనోళ్ల జైత్రయాత్రకు బ్రేక్‌లేదు.. కివీస్ కథ మారలేదు. ఆధిపత్యాన్ని చాటుకుంటూ ఆఖరి టీ20లోనూ గెలుపొందిన భారత్ 5-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయంతో న్యూజిలాండ్ గడ్డపై తొలిసారి పొట్టి ఫార్మాట్ సిరీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత జట్టుగా కోహ్లీసేన కొత్త చరిత్ర లిఖించింది.*

12



## జయహో జొకోవిచ్

ఎనిమిదో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో రికార్డు

ఫైనల్లో డొమినిక్ థీమ్‌పై విజయం



ఆయనేం తాగుబోతు కాదు! అప్పుడప్పుడు ఒక పెగ్గేయడం అలవాటు! అలా తాను తాగే విస్కీ బ్రాండ్ కోసం ఐదారు షాపులు తిరిగాడు. ప్రతిచోటా.. లేదు, లేదు అనే సమాధానమే! దాని బదులు ఇంకేదో తీసుకోవాలంటూ ఉచిత సలహాలు! చివరికి... ఒకానొక షాపులో కావాల్సిన బ్రాండ్ దొరికింది! దానిపైనా... ఎమ్మార్పీపై రూ.30 అదనంగా వసూలు చేశారు!

బీర్లలో ఐదారు బ్రాండ్లు చాలా ఫేమస్!కానీ... చాలావరకు మద్యం షాపుల్లో అవేవీ దొరకవు! ఎప్పుడూ వినని, కనని, వింత పేర్లున్న బీర్లే దర్శనమిస్తున్నాయి. 'ఉన్నవి ఇవే! తీసుకుంటే తీసుకోండి! లేదంటే పోండి' అని షాపులో సూటిగా, ముఖాన్నే చెప్పేస్తారు!

మంచి బ్రాండ్ల మద్యం అంతో ఇంతో వచ్చినా...చాలా షాపుల్లో వాటిని బయట అమ్మేస్తున్నారు. అనధికారికంగా బార్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు

# కిక్కులోనూ నొక్కుడే!

## రేటుపెట్టినా నచ్చింది దొరకదు.. ఇచ్చిందే తాగాలనేలా ఎక్సైజ్ తీరు

- సర్కారీ మద్యంలో నయా ట్రెండ్
- బ్రాండ్లకు ఆర్డర్లలో భారీ కమీషన్
- 10% ఇచ్చిన బ్రాండ్లే దుకాణాల్లో
- ఎక్సైజ్ తీరుపై డిస్టిలరీల ఆగ్రహం
- డిస్టిలరీలే సరఫరా చేయట్లేదు: ఎక్సైజ్
- ధర పెంచేసి ఇవేనా ఇచ్చేదంటూ
- షాపుల వద్ద వినియోగదారుల ఘర్షణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఎవరో వస్తారు. మీ బ్రాండ్‌కు ఆర్డర్ రావాలంటే కేసుకు 10శాతం కమీషన్ ఇచ్చేలా డీల్ కుదుర్చుకోవాలని అడుగుతారు. వారు అడిగినట్లుగా డీల్ చేసుకుంటే ఓకే. లేదంటే అప్పటినుంచి మాకు ఎక్సైజ్ నుంచి ఆర్డర్లు రావు. ఆ వచ్చిన వ్యక్తులెవరో మాకు తెలియదు. అధికారులు కూడా వారెవరో తెలియదనే అంటారు. కానీ చిత్రంగా వారు వచ్చి వెళ్లాక మాకు ఆర్డర్లు మాత్రం రావట్లేదు'.. ఇదీ రాష్ట్రంలో మద్యం ఉత్పత్తిదారులు చేస్తున్న ఆరోపణ. ఎవరో అజ్ఞాత వ్యక్తులతో డీల్స్ కుదుర్చుకుంటేనే తమ కంపెనీలు ముందుకు సాగే దుస్థితి వచ్చిందని, అవి ఇచ్చుకోలేని వారికి ఏదో తూతూ మంత్రంగా ఆర్డర్లు ఇచ్చి సరిపెడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రస్తుతం ఎక్సైజ్‌తో ఉన్న ఒప్పందాలు ముగియగానే మొత్తం రద్దు చేసుకుని వెళ్లిపోవడం తప్ప వేరే మార్గం లేదనేది ఉత్పత్తిదారుల మాట! చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయన్న కారణంతో డిస్టిలరీలే తమ మద్యం

మిగతా 2వ పేజీలో...

# సిట్ సీక్రెట్



- ధర్మాన పాత్రపై పాత నివేదికలో ఆరోపణలు
- 14 ఎన్‌వోసీ కేసుల్లో ఆయన ప్రమేయం
- ఆ భూములన్నీ చేతులు మారాయి
- బంధువులు, సన్నిహిత కంపెనీలకే దక్కాయి
- సమగ్ర దర్యాప్తునకు పాత సిట్ సిఫారసు
- కొత్త సిట్ మధ్యంతర నివేదికలో ఏముందో?
- పాత నివేదికను పరిశీలిస్తున్నామన్న చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ భూ బాగోతంపై కొత్తగా జరుగుతున్న దర్యాప్తు ఎటు పోతోంది? పాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికకు పాతరేనా? అప్పటి రెవెన్యూ మంత్రి, ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావుపై సమగ్ర దర్యాప్తు జరపాలన్న సిఫారసును అటకెక్కించినట్లేనా? అనేక మంది రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన పాత సిట్ ఇచ్చిన రిపోర్టు పక్కకుపోయి కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయా? ధర్మాన ప్రసాదరావు, ఆయన బంధువులు, సన్నిహితుల వ్యవహారంలో కొత్త సిట్ ఏం చేయబోతోందన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొత్త సిట్ కొద్దిరోజుల కిందటే తన మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. దాని వివరాలేమిటో తెలియరాలేదు. అయితే... పాత సిట్ చెప్పినంత స్పష్టంగా ధర్మాన వ్యవహారంపై కొత్త సిట్ తన రిపోర్టులో ప్రస్తావించిందా.. దారి మళ్లిందా? అన్న అంశాలపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం నియమించిన సిట్.. విశాఖ భూ కుంభకోణంలో

మిగతా 11వ పేజీలో...

## మారాలి జగన్

### మారకుంటే భారీ మూల్యమే



- కక్షసాధింపు మంచిది కాదు.. దేశానికే ఎంతో నష్టం
- మదుపరులకు తప్పుడు సంకేతాలు
- జగన్ రీతిపై జాతీయ పత్రికల సంపాదకీయాలు
- తండ్రి నుంచి నేర్చుకోవాలని హితవు

8



3

## గ్యాస్ గుప్పిట ఉప్పూడి!

- డ్రిల్‌సైట్‌లో భారీ శబ్దాలతో గ్యాస్ లీక్
- ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని హెచ్చరిక
- ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు
- పునరావాస కేంద్రాలకు తరలింపు



11

## కేరళలో మరొకరికి కరోనా

- మరో 324 మంది వూహాన్ నుంచి ఢిల్లీకి
- చైనీయులకు ఈ-వీసా తాత్కాలిక రద్దు
- 305కు చేరిన మృతులు
- చైనా బయట మొదటి కరోనా మరణం
- ఫిలిప్పీన్స్‌లో ఒకరి మృతి








సభ ప్రారంభమైన అరగంటకే, నేతలు వేదికపై ఉండగానే ఖాళీ అయిన సభా ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న అజేయ కల్లం, పక్కన చెవిరెడ్డి భాస్కరరెడ్డి

# 'సుప్రీం' జడ్జిల చేతుల్లో అమరావతి భూములు?

- ఆ 29 గ్రామాల రైతులు బాగుపడితే చాలా?
- విశాఖ, కర్నూలు జిల్లాల్లో రైతులు లేరా?
- సీమలో పొట్టకూటికి జనం ఏడుస్తున్నారు
- అమరావతిలో కోట్లు పోయాయని ఏడుపు
- సీఎం ముఖ్య సలహాదారు కల్లం ఆరోపణ
- నారావారిపల్లెలో వైసీపీ బహిరంగ సభ

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో పెద్దఎత్తున ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరళ్లు(ఏజీలు), పత్రికాధిపతుల చేతుల్లో అమరావతి భూములున్నాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో మాజీ సీఎం

మిగతా 8వ పేజీలో...

### సభ వెలవెల

- జగన్ మెప్పు కోసం చెవిరెడ్డి ప్లాన్
- బాబు స్వగ్రామంలో భారీ సభ
- 25 వేల మంది వస్తారని అంచనా
- వందల మంది కూడా రాని వైనం
- అరగంటలోనే ప్రాంగణం ఖాళీ

# భూసమీకరణమే

## ల్యాండ్ పూలింగ్‌కు విశాఖ రైతులు ససేమిరా

- నగరం చుట్టుపక్కల పేదల గృహ నిర్మాణం
- 6,115 ఎకరాల సమీకరణకు ఏర్పాట్లు
- వాటిలో అత్యధికం అసైన్డ్ భూములే
- భూములు ఇచ్చిన రైతులకు కల్పించే.. ప్రయోజనాల ఊసెత్తని అధికారులు
- పూలింగ్‌కు గ్రామ సభల్లో తీవ్ర వ్యతిరేకత
- విశాఖలో రెండుసార్లు పూలింగ్ విఫలం



అనకాపల్లి మండలం కుంచంగి గ్రామంలో శనివారం నిర్వహించిన సభలో పూలింగ్‌కు వ్యతిరేకంగా నినదిస్తున్న భూ యజమానులు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల క్రితం రాష్ట్రం విడిపోయి.. రాజధాని లేనిదిగా నిలిచినపుడు గందరగోళ పరిస్థితి. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేయాలి.. నిర్మాణానికి భూములు ఎలా.. అని భావిస్తున్న తరుణంలో నాడు ప్రభుత్వం భూసమీకరణకు వెళ్లింది. రైతులు 33 వేల ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారు. భూములిచ్చిన రైతులకు కల్పించే ప్రయోజనాలు, కౌలు, పరిహారం, రిటర్నబుల్ ప్లాట్లపై స్పష్టమైన వైఖరితో ప్రభుత్వం ముందుకెళ్లింది. అందుకే వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా తమ భూములు ప్రభుత్వం చేతుల్లో పెట్టారు. సీన్ కట్ చేస్తే...

మిగతా 2వ పేజీలో...

## 'నిర్భయ' వాదనల్లో 'దిశ'

11

- ఢిల్లీ హైకోర్టులో ప్రస్తావించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా
- దేశ సహనాన్ని దోషులు పరీక్షిస్తున్నారు.. కావాలనే ఆలస్యం చేస్తున్నారని వాదన
- కోర్టుకు ఎందుకు తొందర?: ఏపీ సింగ్.. తీర్పును వాయిదా వేసిన న్యాయస్థానం

**సోనియా గాంధీకి అస్వస్థత.. ఢిల్లీ ఆస్పత్రిలో చేరిక**





## పరంజ్యోతి



## కేవలం కామపురుషార్థం.. శిక్షార్హం

*అర్థ ధర్మౌ పరిత్యజ్య యః కామమనువర్త తే*
*ఏవ మాపద్యతే క్షిప్రం రాజా దశరథో యథా*

..అరణ్యవాసం చేస్తున్న శ్రీరాముని నోట వాల్మీకి మహర్షి పలికించిన మాట ఇది. శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుడితో తమ తండ్రియైన దశరథుడి గురించి ప్రస్తావించిన సందర్భంలో చెప్పిన మాట. ఎవరైనా సరే చతుర్విధ పురుషార్థాల్లో ధర్మార్థాలను వదిలి కేవలం కామాన్నే ఆశ్రయించినప్పుడు ఆ వ్యక్తి దశరథుని వలె ఆపదల్లో చిక్కుకుని ప్రాణం పోగొట్టుకుంటాడని దీని అర్థం. శ్రీరాముడంటే దశరథునికి వల్లమాలిన ప్రేమ. రాముడు దూరమైన పక్షంలో తాను జీవించి ఉండలేనని తెలుసు. కానీ రామ వనవాసానికి కారణం కైకేయికి ఇచ్చిన వరమే. అది దశరథునిలోని కాముకతకు పర్యవసానం. రామచంద్రుడు తన తండ్రికి దూరం కావడం ఒక రకంగా దశరథునికి శిక్ష వేయడంగానే కనిపిస్తుంది. లక్ష్మణునితో ప్రస్తావించిన మాటల్లోని పరమార్థం కూడా ఇదే అయి ఉండవచ్చు. రామాయణ మహాకావ్యంలో ఇలా కేవల కాముకతకు శిక్షననుభవించిన వారు చాలా మంది కనిపిస్తారు. ఉదాహరణకు.. శ్రీరాముని ఏకపత్నీవ్రతాన్ని భంగపరచాలన్న శూర్పణఖ ప్రయత్నంలోని కాముకత ఆమె ముక్కు చెవుల కోత రూపంలో శిక్షకు కారణమైంది. ధర్మ ధ్వంసానికి పాల్పడ్డవారికి శిక్ష తప్పదని.. దానికి మూలం కాముకత అయితే మరింత కఠిన శిక్ష పడుతుందని తెలిపే ఘట్టమిది. అలాగే.. కిష్కింధలో సుగ్రీవుని మైత్రి పొందిన రామచంద్రుడు అతని అన్నయైన వాలిని వధించాడు. దానికి కారణం వాలి.. తన సోదరుడి భార్యను చెరపట్టడమే. వాలి వధ జరిగిన తీరును గురించి నేటి వరకు చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. రామాయణంలోనే వాలి స్వయంగా శ్రీరామునికి అనేక ప్రశ్నలు సంధిస్తాడు. ఆ ప్రశ్నలకు రామచంద్రుడు సమాధానాలు చెబుతూ "వాలీ! ధర్మతత్త్వం చాలా సూక్ష్మమైనది. నీవు చపలుడివి, కాముకుడివి. సనాతన ధర్మానుసారం తమ్ముడు, కొడుకు, శిష్యుడు - ముగ్గురూ పుత్రసమానులు. నీ తమ్ముడైన సుగ్రీవుని భార్య రుమను నీవు ధర్మవిరుద్ధంగా అనుభవిస్తున్నావు. నీకు శిక్ష తప్పదు" అంటూ మరణ శిక్ష వేశాడు. తన తప్పులను శ్రీరాముని ఎదుట వాలి కూడా అంగీకరించాడు.

ఇక రామాయణంలో.. కేవల కాముకతకు ఘోరమైన శిక్షను అనుభవించిన ప్రధాన పాత్ర.. లంకాధిపతియైన రాక్షస రాజు రావణాసురుడు. వేదవేదాంగవేత్త, షట్శాస్త్ర పాండితీ మండితుడు, చతుర్దశ భువనాలనూ తన పరాక్రమంచే గడగడలాడించి భయభ్రాంతులకు గురిచేసిన వీరాగ్రగణ్యుడు రావణుడు. అంతటివాడూ శ్రీరాముని చేతిలో మరణాన్ని పొంది శిక్షననుభవించాడు. దానికి ప్రధాన కారణం అతనిలోని కాముకతే. రావణాసురుడు పులస్త్య బ్రహ్మ కుమారుడు. అందుకే వాల్మీకి మహర్షి ఈ మహాకావ్యాన్ని "రామాయణం", "సీతాచరితమ్" అనే నామాలతో పాటు.. "పౌలస్త్యవధ"గా కూడా వ్యవహరించాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు పురుషార్థాలను సాధించడం మానవ జీవన విధానంలో ఒక ముఖ్యమైన అంశం. కానీ, ధర్మార్థాలను వదలి కేవలం 'కామాన్నే' ఆశ్రయిస్తే ఫలితం దారుణంగా ఉంటుందన్న మహత్సందేశాన్ని రామాయణ మహాకావ్యం ఈ పాత్రల ద్వారా ప్రపంచానికి అందించింది.

- గన్నమరాజు గిరిజామనోహరబాబు

## లోకం తీరు




# భూసమీకరణమే

(మొదటి పేజీ తరువాయి)

ఐదేళ్ల తర్వాత కొత్తగా వచ్చిన ప్రభుత్వం 'పేదల గృహ నిర్మాణం' పేరిట విశాఖపట్నం చుట్టుపక్కల భారీగా భూ సమీకరణ చేపట్టాలని నిర్ణయించింది. పది మండలాల పరిధిలో 6వేల ఎకరాలకుపైగా సమీకరించేందుకు జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. అయితే ఇక్కడ ప్రభుత్వ అవసరాల గురించి చెబుతున్నారే తప్ప భూములిచ్చే వారికి కలిగే ప్రయోజనం ఏమిటో స్పష్టం చేయడంలేదు. దీనివలన రైతులకు చేకూరే లాభం ఏమిటో ఒక్క అధికారీ వివరించడం లేదు. దీంతో.. భూ సమీకరణ కోసం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. స్వయంగా కలెక్టర్ వచ్చి ఏ రకమైన ప్రయోజనాలు కల్పిస్తారో వివరిస్తే తప్ప భూములు ఇవ్వబోమని రైతులు పట్టు పడుతున్నారు.

గృహ నిర్మాణం కోసం ఒక్కో లబ్ధిదారునికి సెంటు చొప్పున భూమి పంపిణీ చేయాలనే లక్ష్యంతో పది మండలాల్లోని 55 గ్రామాల్లో 6,116.5 ఎకరాలు సమీకరించడానికి అధికారులు నడుం బిగించారు. ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములు, అసైన్డ్ చేసిన భూములను టార్గెట్ చేశారు. వాటిలో సింహభాగం అసైన్డ్ భూములే ఉన్నాయి. సుమారు 2,552.33 ఎకరాలు గతంలో వివిధ సందర్భాల్లో రైతులకు సాగు చేసుకోవడానికి అప్పగించారు. వాటిని ఇప్పుడు వెనక్కి తీసుకుంటున్నారు. అసైన్డ్ చేసిన భూమిని వెనక్కి ఇస్తే ఎకరానికి 900 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇస్తామని అధికారులు పత్రికాప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లకు పైబడిన ఆక్రమిత ప్రభుత్వ భూమి అయితే 450 గజాలు, ఐదేళ్లకుపైబడి పదేళ్లలోపు ఆక్రమిత భూమి అయితే 250 గజాలు ఇస్తామని పేర్కొన్నారు. ఏ రైతు అయినా తనకు తగిన గ్యారంటీ ఇస్తేనే వ్యవసాయ భూమి ఇస్తాడు. రాష్ట్ర రాజధాని అమరావతి కోసం రైతులను ఒప్పించి 33 వేల ఎకరాలు సేకరించారు. అయితే ఇప్పుడు రాజధానిని అక్కడి నుంచి తరలిస్తామనడంతో... ఆందోళన చేస్తున్నారు. అక్కడ భూములిచ్చిన రైతులకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున పదేళ్లపాటు చెల్లించేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. అదేవిధంగా రైతు కూలీలకు నెలకు రూ.2,500 చొప్పున పింఛను ఇచ్చింది. కానీ ఇక్కడ ఎటువంటి లబ్ధి చేకూరుతుందో అధికారులు విస్పష్టంగా చెప్పడం లేదు.

### లబ్ధిదారులు అంత దూరం వెళతారా?

ఇప్పుడు రైతుల నుంచి సమీకరిస్తున్న అసైన్డ్ భూములన్నీ నగరానికి దూరంగా ఉన్న గ్రామాల్లోనే ఉన్నాయి. అక్కడ పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తే తప్ప లబ్ధిదారులు అక్కడికి వెళ్లి గృహాలు నిర్మించుకోలేరు. విశాఖపట్నంలో గృహ లబ్ధిదారులకు సంబంధించి కొంత చరిత్ర ఉంది. గత ప్రభుత్వాలు పేదల కోసం నగరాన్ని ఆనుకొని కొమ్మాది, పరదేశిపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, మారికవలస, అగనంపూడి, చినముషిడివాడ తదితర ప్రాంతాల్లో గృహాలు నిర్మించి ఇచ్చారు. లబ్ధిదారుల్లో అత్యధికులు అక్కడికి వెళ్లలేదు. నగరంలో ఏదో ఒక పని చేసుకుని జీవనం సాగిస్తున్నామని, దూరంగా పంపించేస్తే.. రోజూ నగరంలోకి రాకపోకలు సాగించడానికే తమ కూలి డబ్బులు సరిపోతాయని చాలామంది వెళ్లలేదు. కొంతమంది వాటిని అమ్మేసుకున్నారు. వాటిలో కొన్ని ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం అంతకంటే దూరంగా భూములు సమీకరిస్తోంది. పైగా అక్కడ స్థలం మాత్రమే ఇస్తామని చెబుతోంది. గృహాలు పేదలే నిర్మించుకోవాలని స్పష్టం చేసింది. ఇదే విధానంతో ముందుకెళితే లబ్ధిదారుల్లో అత్యధికులు అక్కడికి వెళ్లి ఇళ్లు నిర్మించుకునే అవకాశం లేదు. వారికి అంత ఆర్థిక స్థోమత లేకపోవడం ఒక కారణమైతే, అవి నగరానికి దూరంగా ఉండడం మరో కారణం. ఇది మళ్లీ దుర్వినియోగానికి దారితీసే అవకాశం ఉంది. దళారులు రంగ ప్రవేశం చేసి వాటిని తక్కువ ధరకు ఎత్తుకుపోతారు.

### రేటు ఉంటుందని చెబుతారా?

ప్రభుత్వం ఇప్పుడు సమీకరిస్తున్న భూములన్నీ ఒకే దగ్గర లేవు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. సుమారు 400 నుంచి 500 ఎకరాలు ఒక దగ్గర ఉంటే, వాటిని టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తే అక్కడికి వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్ వచ్చి భూములకు ధర పెరుగుతుంది. అంతే తప్ప 20-30 ఎకరాల్లో లేఅవుట్ వేసి పేదలకు సెంటు చొప్పున పంపిణీ చేస్తే... ఆ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశాలు చాలా తక్కువ. అలాంటప్పుడు అక్కడ భూములకు ధర పెరగదు. దానివల్ల భూములిచ్చిన రైతులకు ప్రయోజనం ఉండదు. వారి పొట్ట కొట్టినట్టే. దీనిని కూడా దృష్టిలో ఉంచుకొని చాలా మంది తమకు పరిహారం ఇంకా పెంచాలని, తమ భూముల్లో చెట్లు, ఫలసాయం, వ్యవసాయ పంపుసెట్లు అన్నింటికీ పరిహారం ఇవ్వాలని అడుగుతున్నారు. అభివృద్ధి చేసిన భూమి కూడా ఇంకా ఎక్కువ కావాలని డిమాండ్ చేస్తున్నారు.

### రెండు సార్లూ ముంచారు

విశాఖలో అధికారులు రెండుసార్లు భూ సమీకరణ చేశారు. 2012లో అప్పటి వుడా విశాఖ గ్రామీణ మండలం పరదేశిపాలెంలో భూ సమీకరణ చేసింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో బినామీల పేర్లు రాసేసి, రెవెన్యూ అధికారుల నిర్ధారణ లేకుండానే వారికి అభివృద్ధి చేసిన భూమి కేటాయించారు. ఆ వెంటనే వాటిని థర్డ్ పార్టీ పేరిట బదిలీ చేయించుకొని అధికారులు, దళారులు లబ్ధిపొందారు. ఇలా రూ.570 కోట్ల విలువైన భూములు కాజేశారు. మూడేళ్ల తర్వాత పెందుర్తి మండలం ముదపాకలో పేదల నుంచి అసైన్డ్ భూములను వుడా సమీకరించింది. విషయం తెలిసి కొందరు పెద్దలు ముందుగానే వారితో ఒప్పందాలు చేసుకున్నారు. దీనిపై అప్పట్లో రాజకీయ వివాదాలు చెలరేగడం, నిజమైన రైతులు అధికారుల ముందుకు రావడంతో అర్థంతరంగా నిలిపివేశారు. ల్యాండ్ పూలింగ్ పూర్తిగా చట్ట విరుద్ధమైన ప్రక్రియ అని, పేదల భూములు తీసుకోవడం ఏమిటని అప్పట్లో వైసీపీ నేతలు ప్రశ్నించారు. ఇప్పుడు వారే పూలింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు.

### బారెడు ఇస్తే చారెడు చేతికా?

సబ్బవరం మండలం గొల్లలపాలెంలో 260 ఎకరాలు భూ సమీకరణ చేస్తున్నారు. ఈ గ్రామం జీవీఎంసీ పరిధిలో ఉంది. రహదారి పక్కన ఉండడంతో ఎకరా రూ.4 కోట్లు పలుకుతోంది. లోపల భూములైతే ఎకరా రూ.3 కోట్లు పలుకుతోంది. వీటిని అధికారులు తీసుకుంటున్నారు. ఎకరా రూ.4 కోట్ల విలువైన భూమి తీసుకొని వారికి 900 గజాలు ఇస్తామని చెబుతున్నారు. అభివృద్ధి చేసిన తరువాత అక్కడ గజం రూ.20 వేలకు మించి ధర పలికే అవకాశం లేదు. అంటే 900 గజాలకు రూ.1.8 కోట్లు వస్తుంది. అంటే రూ.4 కోట్లు భూమి ఇచ్చి.. రూ.1.8 కోట్ల స్థలం తీసుకునేందుకు ఏ రైతు అయినా ముందుకు వస్తాడా?

### దెబ్బతినేది దళితులే



"రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ జరిగాయని అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు జీవో నంబరు 72 ప్రకారం 2,552 ఎకరాల డీపట్టా భూములు సేకరిస్తున్నామని పేర్కొంటున్నారు. నాడు తీసుకున్న రైతులు, వారి వారసులు ఇప్పుడు అక్కడ ఉన్నారా? రెవెన్యూ రికార్డులు గత పదిహేనేళ్లవి తీస్తే బయటపడుతుంది. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నది చిన్న, సన్నకారు రైతులే. అందులో చాలా మంది దళితులు. వారి పేర్లు ఎక్కడా నమోదు కాలేదు. ఇప్పుడు భూ సమీకరణ వల్ల వారంతా నష్టపోతారు."

- ఈఏఎస్ శర్మ, ఐఏఎస్, కేంద్ర ఇంధన శాఖ మాజీ సెక్రటరీ

### భూసమీకరణపై మాకు నమ్మకం లేదు



సబ్బవరం మండలం పైడివాడలో నాకు 4.7 ఎకరాలకు డి.పట్టా ఉంది. భూ సమీకరణ గురించి సమాచారం ఇవ్వలేదు. రైతులతో మాట్లాడలేదు. నోటీసులూ ఇవ్వలేదు. భూ సమీకరణపై మాకు నమ్మకం లేదు. కలెక్టర్ సమావేశం ఏర్పాటుచేసి, రైతులకు ఏమిస్తారో స్పష్టంగా చెబితే అప్పుడు ఆలోచిస్తాం. అంతవరకు మా భూముల్లోకి వస్తే ఊరుకోం.

- ఎం.అప్పలరాజు, పైడివాడ

### మా జీవితాలతో మళ్లీ ఆడుకోవద్దు?



నేను విశాఖ స్టీల్‌ప్లాంటు నిర్వాసితుడిని. ప్లాంటు కోసం సాగు చేసుకుంటున్న భూములు ఇస్తే.. పరిహారంగా పైడివాడలో 4.45 ఎకరాల డి.పట్టా భూమి ఇచ్చారు. ఇప్పుడు దాన్ని కూడా తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఇలాగైతే మేము ఎలా బతకాలి. ఇలా ఎన్నిసార్లు మా జీవితాలతో ఆడుకుంటారు.

- అమరపిన్ని రామునాయుడు, రైతు, గాజువాక

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 19.0 | 33.0 |
| హైదరాబాద్ | 20.7 | 29.7 |
| గుంటూరు | 21.4 | 31.6 |
| విశాఖపట్నం | 22.0 | 28.4 |
| విజయవాడ | 22.1 | 31.4 |
| ఒంగోలు | 23.4 | 31.0 |
| నెల్లూరు | 23.6 | 31.0 |
| కడప | 30.0 | 34.1 |

### కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోస్తాపైకి ఆగ్నేయ, దక్షిణ దిశ నుంచి గాలులు వీస్తుండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. ఈ ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. కొన్నిచోట్ల ఉరుములతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం వరకు మద్దూరులో మూడు, అచ్యుతాపురం, అనకాపల్లిలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. మేఘాలు ఆవరించడంతో కోస్తాలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా ఒకటి రెండు డిగ్రీలు తక్కువగా, రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.



### బుల్లెట్ భాషే..

షాహీన్‌బాగ్ నిరసన కార్యక్రమం సమాజానికి హానికరం. దీనివల్ల శాంతికి, సాధారణ జనజీవనానికి విఘాతం కలుగుతోంది. దేనికైనా ఒక హద్దూపద్దూ ఉంటుంది. మంచిమాటలు చెబితే చెవికెక్కించుకోని వారికి బుల్లెట్ భాషే అర్థమవుతుంది.

- యోగి ఆదిత్యనాథ్, యూపీ ముఖ్యమంత్రి



### ప్రభుత్వాన్ని కూలదోద్దాం

మత ప్రాతిపదికన ప్రజల్లో, దేశంలో విభజన తెచ్చేందుకే పౌరసత్వ చట్టం తీసుకువచ్చారు. ఇదంతా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్ర. నరేంద్ర మోదీ, అమిత్‌షా ఫాసిజానికి పాల్పడుతున్నారు. ఇది అమానవీయం. అందుకే బీజేపీ ప్రభుత్వాన్ని కూలదోయడానికి సెక్యులర్, ప్రజాస్వామ్య శక్తులన్నీ చేతులు కలపాలి.

- డి.రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శి



ప్రసంగిస్తున్న ఏపీఎన్జీవో అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి

## ఏపీఎన్జీవో అధ్యక్షునిగా చంద్రశేఖరరెడ్డి ఏకగ్రీవం

- ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నిక
- 3 రాజధానులను స్వాగతించిన సంఘం

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా మరోమారు ఎన్.చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వీరి నేతృత్వంలోని ప్యానెల్ మాత్రమే నామినేషన్ వేసింది. ఒకే ప్యానెల్ నుంచి నామినేషన్ రావటంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేషన్ల ఘట్టాన్ని పురస్కరించుకుని ప్యానెల్ తరపున బరిలో నిలిచిన చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరావు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఎన్నిక ఏకగ్రీవం కావటంతో గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వారిద్దరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించటంతో పాటు మూడు రాజధానులను స్వాగతిస్తున్నట్టు ప్రకటించారు. డీఏ బకాయిలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, నాల్గవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంపు వంటి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా అసోసియేషన్ కట్టుబడి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులను అభివృద్ధి చేయాలనుకోవటాన్ని తాము స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఎక్కడికి వెళ్లి పనిచేయమన్నా సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదే సందర్భంలో ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు.

## 2021 నాటికి పోలవరం పూర్తి: మంత్రి అనిల్



పోలవరంలో పర్యటిస్తున్న మంత్రి అనిల్

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేసి తీరుతామని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. అధికారులతో సమీక్ష జరిపారు. డ్యామ్ నిర్మాణంలో భాగంగా గ్యాప్-1, గ్యాప్-3 పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ, గత ప్రభుత్వం పని తక్కువ, ప్రచార ఆర్భాటం ఎక్కువ చేసిందని విమర్శించారు. ప్రాజెక్ట్ విలువ రూ.55 వేల కోట్లు అయితే, కేవలం రూ.17 వేల కోట్ల విలువైన పనులు మాత్రమే ఇప్పటికి పూర్తయ్యాయన్నారు. అలాంటిది 75% నిర్మాణం చేపట్టినట్టు టీడీపీ ఎలా చెబుతుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పూర్తిగా విస్మరించారన్నారు. తండ్రి చేపట్టిన ప్రాజెక్టును తనయుడు జగన్ పూర్తి చేయాలనేది దైవ సంకల్పమని, దానిని ఎవరూ ఆపలేరన్నారు. నిర్మాణ పనులు మందగించాయని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వచ్చే జూన్ నాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో 18 వేల ఇళ్లు నిర్మిస్తామన్నారు. స్పిల్ ఛానల్, స్పిల్ వే, డ్యామ్, టన్నెల్స్ పనులు పూర్తి చేసి 2021 నాటికి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా నాబార్డు ద్వారా నిధులు తెచ్చుకునే వెసులుబాటు ఉందన్నారు. నిధులు కేంద్రం నుంచి అందుబాటులో లేకున్నా సరే రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసి తర్వాత రీయింబర్స్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



## రఘువీరా.. ఈత సరదా!

ఎస్కే వర్సిటీ విద్యార్థి సంఘ నాయకుడిగా.. నీలకంఠాపురం ఆలయాల చైర్మన్‌గా.. కాంగ్రెస్ నాయకుడిగా.. రాష్ట్ర మంత్రిగా.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా.. ఎన్నింటినో అవలీలగా ఈదేసిన రఘువీరారెడ్డి... చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ.. ఆదివారం హాస్టల్ విద్యార్థులతో కలసి తన తోటలోని బావిలో ఇలా ఈత కొట్టారు.

- మడకశిర

# కిక్కులోనూ నొక్కుడే!

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా చేయటం లేదని, ఇందులో తాము చేసేదేం లేదనేది ఎక్సైజ్ వర్గాల వాదన! వెరసి రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి, అమ్మకాల్లో కొత్త కమీషన్ ట్రెండ్ తెరపైకి వచ్చింది. వినియోగదారులు తాగే పాపులర్ బ్రాండ్లు షాపుల్లో కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొత్త కంపెనీలకు చెందిన ఎప్పుడూ వినని బ్రాండ్లు వెలిశాయి. ఎక్సైజ్‌శాఖ కూడా 'తాగితే వాటినే తాగాలి. లేదంటే మానేయాలి' అనే పద్ధతుల్లో వినియోగదారులకు వేరే దారి లేకుండా చేసింది. దీనిపై పలుచోట్ల వినియోగదారులకు, షాపుల సిబ్బందికి ఘర్షణలు జరుగుతున్నాయి.

### ప్రభుత్వ షాపులే కానీ..

డిస్టిలరీలు తమ బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవడానికి కమీషన్లు ఇవ్వడం కొత్త కాదు. గతంలో ఆర్డర్లు పెట్టే ప్రైవేటు లైసెన్సీలకు అవి కమీషన్లు ఇచ్చేవి. అయితే గుర్తింపులేని, ఊరుపేరు లేని బ్రాండ్లు మాత్రమే కమీషన్లు ఇచ్చేవి. ఇప్పటికే పాపులర్‌గా మారిన కంపెనీలేవీ 'హపాయి కూడా ఎవరికీ ఇచ్చేవి కావు. కానీ కొత్త మద్యం షాపుల పాలసీ అమల్లోకి వచ్చాక కొత్త ట్రెండ్ వచ్చింది. పాపులర్, నాన్‌పాపులర్ అనే తేడా లేకుండా ఎవరైనా కచ్చితంగా 10శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని కొందరు వ్యక్తులు కంపెనీల వద్ద బేరసారాలకు దిగుతున్నారు. ఇప్పటికే పాపులర్‌గా ఎక్కువ మద్యం అమ్ముతున్న ఎంఎన్‌సీ కంపెనీలు వారి ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నాయి. దీంతో వారికి అప్పటివరకు వచ్చిన ఆర్డర్లు పాతిక శాతానికి పడిపోయాయి. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని ఓ బ్రూవరీ మొత్తం ఉత్పత్తిని ఆపేసి దుకాణం కట్టేసింది. వినియోగదారులు ఎక్కువగా అడిగే ఇంపీరియల్ బ్లూ, రాయల్ స్టాగ్, మెక్డోల్ నంబర్ వన్, రాయల్ చాలెంజ్ లాంటి బ్రాండ్లకు ఆర్డర్లు దాదాపుగా పడిపోయాయి. గతంలో రాష్ట్రంలోని మొత్తం అమ్మకాల్లో 50శాతం వరకు ఈ బ్రాండ్లే ఉండేవి. ఇప్పుడు ఇవన్నీ కనిపించకుండా పోయే పరిస్థితి.

### నవంబరు నుంచి డీల్స్

గత నవంబరు నుంచే ఈ కమీషన్ డీల్స్ వ్యవహారం ప్రారంభమైనట్లు డిస్టిలరీలు వెల్లడించారు. ప్రస్తుతం డిస్టిలరీలకు ప్రభుత్వం రూ. 2 వేల కోట్ల వరకు బకాయిఉంది. సెప్టెంబరు వరకు ఇటీవల చెల్లించారు. అయితే నవంబరు చెల్లింపులు ఎప్పుడు చేతికొస్తే అప్పుడు కమీషన్ తమకు ఇవ్వాలని షరతుతో కొందరు డీల్స్ చేసుకున్నట్లు చెబుతున్నారు. అందువల్ల ఇంతవరకూ కమీషన్లు ఇవ్వలేదని, తర్వాతి చెల్లింపులు రాగానే వారికి ఇవ్వాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. అయితే కొన్ని బ్రాండ్లు ఈ వ్యవహారం మా వల్ల కాదని చేతులెత్తేయగా, కొందరు వేరే దారి లేక కమీషన్లకు ఒప్పుకొంటున్నారని డిస్టిలరీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా కొత్తగా వచ్చినవారు, పెద్దగా పాపులర్ కాని బ్రాండ్లు మాత్రం కమీషన్ల ఇచ్చేందుకు స్వచ్ఛందంగానే ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది.




'మీరు కోరిన బ్రాండ్ ఇవ్వలేం. మా వద్ద ఉన్నవే తీసుకోండి' అంటూ పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ మద్యం దుకాణం ముందు ఏర్పాటు చేసిన బోర్డు.

### ఉన్నవి ఇవే.. షాపుల వద్ద బోర్డులు

బ్రాండ్ల విషయంలో అనేక చోట్ల వినియోగదారులకు, షాపుల సిబ్బందికి మధ్య ఘర్షణలు తలెత్తుతున్న నేపథ్యంలో... తమ వద్ద ఉన్న బ్రాండ్లు మాత్రమే ఇవ్వగలమని, లేనివి అడగొద్దని కొన్ని ప్రాంతాల్లో షాపుల వద్ద బోర్డులు ఏర్పాటుచేశారు. ఒకవైపు భారీగా ధరలు పెంచి.. మరోవైపు అడిగిన బ్రాండ్లు ఇవ్వకుండా ఏవేవో అంటగడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో అమ్ముతున్న మద్యం విలువ అంత లేదని, అయినా ఊరుపేరు లేని రకాలకు అంత రేటు పెట్టి దోచేస్తున్నారని వాపోతున్నారు.



## సొర@84

ఈ సొర చేప బరువు 84 కిలోలు. ధర రూ.పది వేలపైనే. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం కొత్తపాలెం సముద్రంలో ఈ చేప మత్స్యకారుల వలకు చిక్కింది. వేలం పాట వేయగా, ఓ మత్స్యకారుడు రూ.10,080కి దక్కించుకున్నాడు. ఈ సొరచేపలను ఎక్కువగా వైజాగ్, చెన్నై, ముంబైలతో పాటు ఇతర దేశాలకు రవాణా చేస్తుంటారని మత్స్యకారులు తెలిపారు.

- కవిటి

### వాట్సాప్ ద్వారా
## 'జేఈఈ' మోడల్‌పేపర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగకరంగా గ్రాండ్ టెస్ట్ మోడల్ పేపర్లను రూపొందించారు. ఈ ప్రశ్నపత్రాలను వాట్సాప్ ద్వారా విద్యార్థులకు పంపుతామని ఐఐటీ-జేఈఈ ఫోరం కన్వీనర్ లలిత్ కుమార్ తెలిపారు. ప్రశ్నపత్రాలు కావాలనుకునే వారు 9849016661 నంబరుకు 'గ్రాండ్ టెస్ట్' అని టైప్ చేసి వాట్సాప్‌లో మెసేజ్ చేయాలని సూచించారు.

## కాలిన గాయాలకు నీళ్లధారే మందు

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 2 : చిన్నపిల్లల లేత చర్మానికి చిన్నపాటి కాలిన గాయాలైనా తల్లిదండ్రులు గాబరాపడిపోతారు. ఐస్, కలబంద, వెన్న, టూత్‌పేస్ట్ ఇలా ఏది పడితే దాన్ని గాయాలపై లేపనంగా అద్దుతుంటారు. కాలిన గాయంపై వెంటనే కనీసం 20 నిమిషాలపాటు నీటిధారను ప్రవహింపజేయడానికి మించిన ప్రథమ చికిత్సా పద్ధతి మరొకటి లేదని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇలా చేయడం వల్ల కాలిన ప్రదేశం చల్లబడి, అక్కడి చర్మ కణజాలం రక్షణ పొందుతుందని అధ్యయనంలో గుర్తించారు. ఇలా చేస్తే.. కాలిన చర్మాన్ని తొలగించి ఆ ప్రదేశాన్ని ఆరోగ్యకర చర్మంతో భర్తీ(గ్రాఫ్టింగ్) చేయాల్సిన అవసరం 40 శాతం దాకా తగ్గుతుందన్నారు.

## తక్కువ బరువుతో పుట్టే పిల్లల్లో శారీరక పటుత్వం అంతంతే

లండన్, ఫిబ్రవరి 2 : తక్కువ బరువుతో పుట్టే పిల్లలు వయసు పెరిగే కొద్దీ శారీరక పటుత్వంలో ఇతరుల కంటే బలహీనంగా ఉండొచ్చని స్వీడన్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు అంటున్నారు. శారీరకంగా శ్రమ లేదా వ్యాయామం చేసిన సందర్భాల్లో వారి ఊపిరితిత్తుల నుంచి కండరాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లే 'కార్డియో రెస్పిరేటరీ' ప్రక్రియ చాలా తక్కువ వేగంతో జరుగుతుందని అధ్యయనంలో గుర్తించారు. తగిన బరువుతో పుట్టిన వారిలో ఈ లోపం ఉండకపోవడంతో వారి శారీరక పటుత్వంలో ఎలాంటి లోటూ ఏర్పడదన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్డియో రెస్పిరేటరీ రేటు తక్కువగా ఉన్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.



జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్

## శ్రీవారి సేవలో సుప్రీం న్యాయమూర్తి

తిరుమల, ఫిబ్రవరి 2: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

### అందుబాటులో 259 ఆర్జిత సేవాటిక్కెట్లు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆర్జిత సేవలకు సంబంధించి ఈనెల 4 నుంచి లక్కీడిప్ ద్వారా జారీ చేసేందుకు 259 టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని సేవ జరిగే ముందు రోజు తిరుమలలోని విజయా బ్యాంకు కౌంటర్‌లో పేరు నమోదు చేసుకుని లాటరీ విధానంలో పొందవచ్చు.

### నేడు శారదాపీఠానికి ముఖ్యమంత్రి

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల మూడో తేదీన శారదా పీఠం వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడి నుంచి నేరుగా చినముషిడివాడలోని శారదా పీఠానికి వెళతారు. కాగా.. శారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పరిరక్షణ ధ్యేయంగా శ్రౌత మహాసభలకు శ్రీకారం చుట్టారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో హైందవ ధర్మశాస్త్రాలపై శ్రౌత పండితులు విశ్లేషణాత్మకంగా చర్చించారు.

### బడ్జెట్ ఆశాజనకంగా లేదు: మంత్రి కన్నబాబు

తిరుమల/తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదని వ్యవసాయమంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేదిలా కనిపించలేదన్నారు. విభజన తర్వాత నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక నిధులు, ప్రాజెక్టుల ఊసేలేదని, రైతులు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన కేంద్రం అలాంటి నిర్ణయాలేవీ ప్రకటించలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

### స్వార్థానికే రాజధాని మార్పు: వీరయ్య మాదిగ

మార్కాపురం, ఫిబ్రవరి 2: రాజధానిని అమరావతి నుంచి విశాఖపట్నంకు మార్చడం కేవలం ముఖ్యమంత్రి జగన్ స్వార్థం కోసమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ విమర్శించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## కమ్మజన సేవాసమితికి 20కోట్ల విరాళం

**ఎన్నారై నూతక్కి రామకృష్ణ ప్రసాద్ ప్రకటన**



గుంటూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 2: కమ్మజన సేవా సమితికి అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ నూతక్కి రామకృష్ణ ప్రసాద్ రూ.20కోట్ల భారీ విరాళం ప్రకటించారు. కృష్ణాజిల్లా పెద్దమద్దాలికి చెందిన ఆయన ఆదివారం జరిగిన కమ్మజన సేవాసమితి 17వ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సమితి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. వారి అభివృద్ధి కోసం సమితి కృషి చేస్తుందన్న నమ్మకంతోనే ఈ విరాళం ప్రకటిస్తున్నామన్నారు. ఇంత భారీ విరాళాన్ని ప్రకటించిన నూతక్కి దంపతులు అభినందనీయులని సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు కొనియాడారు. గౌరవ అతిథి వై.లక్ష్మణ స్వామి, మంగళగిరి రాయల్ గ్యాస్ కంపెనీ అధినేత నన్నపనేని నాగేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# గ్యాస్ గుప్పిట ఉప్పూడి!

**డ్రిల్‌సైట్‌లో భారీ శబ్ధాలతో గ్యాస్ లీక్**

**ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు**

**పునరావాస కేంద్రాలకు తరలింపు**





ఉప్పూడి వద్ద గ్యాస్ లీకేజీని అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పునరావాస కేంద్రాలకు తరలిపోతున్న ప్రజలు

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోనసీమలో గ్యాస్ కలకలం రేగింది. తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామం గ్యాస్ గుప్పిట్లో చిక్కుకుంది. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో డ్రిల్లింగ్ సైట్ నుంచి అకస్మాత్తుగా భారీ శబ్ధంతో గ్యాస్ లీక్ కావడంతో ఆ ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు. లీకేజీ కారణంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బందితోపాటు ఓఎన్‌జీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉప్పూడితో పాటు పరిసర ప్రాంతాలను ఖాళీ చేయించారు. ఫైర్ ఇంజన్లను తెప్పించి తీవ్రఒత్తిడితో లీక్ అవుతున్న గ్యాస్‌ను అదుపుచేసేందుకు కృషిచేస్తున్నారు. ముందు జాగ్రత్తగా ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గ్యాస్ లీకేజీని అదుపు చేసేందుకు నరసాపురం, రాజమహేంద్రవరం, తాటిపాక, విశాఖపట్నం నుంచి ప్రత్యేక నిపుణుల బృందాలను రప్పిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

### ప్రమాదం జరిగిందిలా..

మహిపాలచెరువు-పల్లంకుర్రు వెళ్లే ప్రధాన రహదారికి సమీపంలోని ఉప్పూడి వద్ద అపార గ్యాస్ నిక్షేపాలున్నట్టు ఓన్‌జీసీ అధికారులు 2006లో గుర్తించారు. రెండేళ్లక్రితం ఈ బావిని పీహెచ్‌ఎల్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీకి అప్పగించారు. మూడు రోజుల నుంచి ఈ గ్యాస్‌బావికి సంబంధించి వెల్‌క్యాప్ ఓపెన్ చేసి పేరుకుపోయిన మురికిని హైప్రెజర్ ద్వారా పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గ్యాస్ ప్రెజర్ తీవ్రమై ఉవ్వెత్తున భారీ శబ్ధాలతో ఎగసిపడింది. దీంతో అక్కడ పనిచేస్తున్న సాంకేతిక సిబ్బంది భయంతో పరుగులుతీశారు.

కొన్ని గంటలపాటు గ్యాస్ భారీ ప్రెజర్‌తో ఎగదన్నడం వల్ల ఉప్పూడి పరిసర ప్రాంతాలన్నీ గ్యాస్‌తో కలుషితమయ్యాయి. ముందుజాగ్రత్తగా కాట్రేనికోన మండలానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. డ్రిల్‌సైట్‌కు దగ్గరగా ఉన్న 70 కుటుంబాలతోపాటు సుమారు 2వేలకి పైగా జనాభా ఉన్న ఉప్పూడి గ్రామం మొత్తం ఖాళీ చేయించారు. లీకేజీ సమాచారం తెలియగానే ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీశ్‌కుమార్, ఆర్డీవో భవానీశంకర్, డీఎస్పీ మాసూమ్‌బాషా అక్కడకు చేరుకున్నారు. బాధితులను ప్రత్యేక బస్సుల్లో చెయ్యేరు, మహిపాల చెరువులలోని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

### నిర్లక్ష్యం ఫలితమే..

ఓఎన్జీసీ, పీహెచ్‌ఎల్ ఆయిల్ అండ్ గ్యాస్ అధికారుల నిర్లక్ష్య ఫలితమే గ్యాస్ లీకేజీకి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఘటనతో ఓఎన్జీసీకి సంబంధం లేదని, 2016-17లో ఈ బావిని పీహెచ్‌ఎల్ యాజమాన్యానికి అప్పగించామని అధికారులు చెబుతున్నారు. భారీ ఎత్తున ఎగసిపడుతున్న గ్యాస్ వల్ల కళ్లు మంటలు, దద్దుర్లు వస్తున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ఆకట్టుకొన్న 'మోడ్రన్' సర్జీ లైవ్

**రాష్ట్రంలో మొట్టమొదటిసారి నిర్వహణ**



సర్జీలైవ్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పీఎల్‌రావు దంపతులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 2: నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం మోడరన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసిన సర్జీ లైవ్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకొంది. ఆ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ పీఎల్‌రావు, డాక్టర్ భారతి ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికతను, ప్రపంచ శ్రేణి మెళకువలను వైద్యులకు, వైద్య విద్యార్థులకు పరిచయం చేసే క్రమంలో సర్జీ లైవ్ పేరుతో ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి నిర్వహించారు. అన్ని రకాల శస్త్రచికిత్సలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశం కల్పిస్తూ, కేవలం ఆపరేషన్లతో కూడిన కంటిన్యూడ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మోడరన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ వైద్యులు పీఎల్ రావు, హెచ్.భారతి, ఒ.గోపాలకృష్ణ, కె.చంద్రమోహన్, బి.సతీష్, సి.వినోద్‌కుమార్‌రెడ్డి, పి.రాజశేఖర్, ఈఎల్ఎస్.జ్యోతి, జి.రాజశేఖర్, జి.అనిల్‌కుమార్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన జగదీష్ కుమార్‌రెడ్డి, పి.శశికుమార్, వై.సుజాత, ఎన్‌సి.లక్ష్మయ్య కాటరాక్టు, రెటీనా, లాసిక్, స్క్వింట్, లోసెస్, టెరీజయమ్ ఆపరేషన్లను ప్రత్యక్షంగా నిర్వహించారు.

## ఉసురుతీసిన 'అమ్మఒడి' వెయ్యి

**తల్లిదండ్రులు వెనక్కిచ్చిన సొమ్ము ఖర్చు**

**మందలించారని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య**



హరితేజకుమార్ (ఫైల్)

పొన్నలూరు, ఫిబ్రవరి 2: అమ్మఒడి పథకం నుంచి పాఠశాలకు ఇవ్వాల్సిన రూ.వెయ్యి తల్లిదండ్రుల నుంచి తీసుకొన్న ఓ విద్యార్థి ఆ డబ్బును ఖర్చు చేశాడు. వారు మందలించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఉండ్రాళ్ల హరితేజ కుమార్(15) పొన్నలూరులోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ కోసం అమ్మఒడి పథకం నుంచి రూ.వెయ్యి స్వచ్ఛందంగా చెల్లించాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి అతని తల్లిదండ్రులు స్పందించారు. గతనెల 29న ఆ మొత్తాన్ని కుమారుడికి ఇచ్చి పంపారు. ఆ డబ్బులు హెచ్ఎంకు ఇవ్వకుండా అతను ఖర్చు చేసేశాడు. విషయం తెలియడంతో శనివారం సాయంత్రం హరితేజను తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు రాత్రి మిద్దెపైకి వెళ్లి దుస్తులు ఆరేసుకునేందుకు ఏర్పాటు చేసిన వైరుతో ఉరేసుకొని ఆత్మహత్య వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు వైద్యశాలకు తరలించారు.

## అమ్మా.. నన్ను రప్పించుకో..

**చైనా నుంచి యువతి వీడియో సందేశం**

**ఉద్యోగ శిక్షణ కోసం వెళ్లి వూహాన్‌లో చిక్కుకున్న వైనం**



జ్యోతి (ఫైల్)

నంద్యాల, ఫిబ్రవరి 2: నేను ఆరోగ్యంగానే ఉన్నాను. ఒత్తిడి కారణంగా శరీర ఉష్ణోగ్రత కొంచెం పెరిగింది. దీంతో నన్ను భారత్ రాకుండా చైనా అధికారులు అడ్డుకున్నారు. నన్ను ఎలాగైనా స్వదేశానికి రప్పించండి అంటూ ఉద్యోగ శిక్షణ కోసం చైనా వెళ్లిన ఓ యువతి కుటుంబసభ్యులకు వాట్సప్ సందేశాన్ని పంపించింది. దీంతో ఆమె తల్లి, బంధువులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే...ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ కలవరం రేపుతున్న నేపథ్యంలో చైనాలోని వూహాన్ నగరంలో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 58 మంది విద్యార్థులు తిరిగి రావాల్సి ఉంది. వారిలో కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువతి కూడా ఉంది. విమానం ఎక్కే సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించగా ఈమె శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే ఒక డిగ్రీ ఎక్కువగా ఉండటంతో కరోనా వైరస్ అనుమానిత కేసుగా భావించి ప్రయాణాన్ని అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన యువతి తనను ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని తన తల్లికి శనివారం వాట్సప్ ద్వారా వీడియో సందేశం పంపించింది. కర్నూలు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఈ యువతి తిరుపతిలో తయారీ కేంద్రాన్ని నిర్మిస్తున్న చైనా కంపెనీ ఆప్టో-డిస్ప్లే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, టీసీఎల్ ద్వారా నిర్వహించిన ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించింది. ఆగస్టులో ఆరు నెలల శిక్షణ కోసం చైనా వెళ్లిన ఈమె ఈ నెల 15వ తేదీ తరువాత స్వదేశానికి తిరిగి రావాల్సి ఉంది. యువతి తల్లితో కర్నూలు కలెక్టర్ వీరపాండియన్ ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. యువతిని త్వరగా రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION IMITED**
HEAD OFFICE:10-152/1,SRISAI TOWERS, BANDAR ROAD KANURU, VIJAYAWADA-520007.

Lr.No.PDS.3/32/PU (PPP)/2019 DATED: 02.02.2020.

TENDER NOTICE FOR APPOINTMENT OF STORAGE AND PACKING AGENCY FOR STORAGE AND PACKING OF RICE

*****

APSCSCL desires to appoint Agency for packing of rice with their own packing machine in their own/lease godown. Rice shall be repacked from 50kg Jute bags into PP bags of 5kg, 10kg, 15kg and 20kg to be utilized for Public Distribution System.

Applications are invited to participate in the tender process for appointment of Storage and packing Agency. For details, please visit www.apscsc.gov.in and www.apeprocurement.gov.in (or) contact on 7702003515, 08645-246370/ 71/ 72/ 73/74. Last date for receiving applications along with EMD would be 10th February 2020, 5.00 pm. The EMD shall be transferred through Direct Debit Facility utilizing Debit or Credit Card/ Net Banking / Deposit through system generated challan in e-procurement website.

The date of online reverse auction will be conducted on https://konugolu.ap.gov.in platform as per the time schedule mentioned in the tender document.

Sd/- A Surya Kumari, IAS, VC & Managing Director



**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

'e' Procurement Notice No. Rc. E11-102340/2020, Dt. 03-02-2020

| Sl. No. | Name of the Work | Estimate Amount Rs. in Lakhs |
|---|---|---|
| 1 | Rising of Compound wall and providing pathways to burial grounds (3 works), Providing CC roads (1 work), Repairs, painting and construction of Compound wall to ELSR (15 works), Rennovation and paintings to School (1 work), Construction of Additional Class rooms (3 works), Specialized work of structural repairs and water proofing treatment (1 work), Repairs and paintings, yard lighting, hand railing, compound wall, ladders to DP stations (9 works), providing paintings, toilet, water supply, yard lighing, repairs to shutters, Provide new mechanical screens (1 work) in Circle-2 Area (34 works) (under 14th F.C. Finance Grant) | 636.26 |

*Note : Only online Payment towards EMD will be allowed, DDs / POs / BCs / BGs will not be allowed.*

Contact for details of works at Office of the Executive Engineer-II, Satyanarayanapuram, Vijayawada, Mobile No. 98665 14179

Further details can be seen@ 'e'procurement market place @ www.apeprocurement.gov.in

Download of bid documents starts 05-02-2020 @ 10.30 A.M.

Last date / time for receipt of tenders 18-02-2020 @ 5-00 P.M.

for Commissioner





1335.2019

# అమర భాషలో ఆధునికుడు

**సంస్కృతమే తన భాషగా, వ్యక్తీకరణగా నిర్దేశించుకొని, నూటయాభైకి పైగా గ్రంథాలు రాసి, తన 'మందాకినీ' సంస్కృత గేయ కావ్యంతో దేశవ్యాప్తంగా మన్ననలు అందుకున్న శ్రీభాష్యం విజయ సారథి గారికి ఈ ఏడు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. ఆ సందర్భంగా ఆయనతో జరిపిన సంభాషణ ఇది.**



*శ్రీభాష్యం విజయ సారథి 1937లో మార్చ్ 10న కరీంనగర్ జిల్లా చేగుర్తి గ్రామంలో జన్మించారు. అమ్మ నుండి సంస్కృత భాష, సంగీతాలని నేర్చుకున్న శ్రీభాష్యం విజయ సారథి తొలి రోజుల్లోనే అన్ని విషయాలను ప్రశ్నించడం మొదలుపెట్టారు. హేతువాదిగా ఒకింత తీవ్రంగానే వాదించేవారు. ఒక వైపు నిజాం పాలన, మరో వైపు కమ్యూనిస్ట్ ఉద్యమాలు ఉన్న ఆ కాలంలో ఆయన ప్రగతిశీలత వైపు, హేతువాదం వైపు మొగ్గారు. ఒక దశలో నిజాం పోలీసుల లిస్టులో కూడా చేరారు. అప్పుడు వారి అన్నగారు పార్థసారథి అనే మొదటి పేరును శ్రీభాష్యం విజయ సారథిగా మార్చి వరంగల్‌లోని శ్రీ విశ్వేశ్వరయ్య సంస్కృత కళాశాలలో చేర్పించారు. పదకొండేండ్ల వయసులోనే 'శారదా పద కింకిణి'లాంటి గ్రంథాలను రాశారు. దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలలో కవితా గానం చేసిన శ్రీభాష్యం విజయ సారథి అయ్యదేవర కాళేశ్వరరావు చేతుల మీదుగా మహాకవి బిరుదును, కలకత్తాలో యుగకవి బిరుదును, బిర్లా ఫౌండేషన్‌వారి వాచస్పతి పురస్కారాన్ని అందుకున్నారు. హేతువాద అభ్యుదయ భావాల అనంతరం తాను మానవతావాదానికి కట్టుబడి వున్నానని ఆయన అంటారు. మనిషి ఆనందం పొందడానికి భారతీయ సాహిత్యం సంస్కృతి ప్రధాన రహదారి అని శ్రీభాష్యం విజయ సారథి అంటారు.*

**ఇప్పటివరకే మహామహోపాధ్యాయ, వాచస్పతి, యుగోద్ధర్త వంటి ఎన్నో గౌరవాలు అందుకున్న మీరు ఇప్పుడు పద్మశ్రీ రావటం పట్ల ఎట్లా స్పందిస్తున్నారు?**

పద్మశ్రీ గొప్ప ఆనందాన్నిచ్చింది. అయితే ఈ పురస్కారం వ్యక్తిగా నాకంటే సంస్కృత భాషకు, సాహిత్యానికి లభించినట్టుగా భావిస్తున్నాను. మృత భాష లాంటి అనేక అవమానకరమైన మాటలతో నిరాదరణకు గురయిన సంస్కృత భాషా సాహిత్యాలకు గుర్తింపు రావడం సంతోషమే కదా.

**మీ సంస్కృత ప్రయాణం ఎట్లా మొదలయింది. మీ బాల్యంలో నిజాం పాలనలో ఉర్దూ అధికార భాషగా వుండేది కదా, మీరెట్లా సంస్కృతం వైపుకు వచ్చారు?**

నిజమే, అప్పుడంతా ఉర్దూకే ప్రాధాన్యత వుండేది. నన్ను కూడా మొదట ఉర్దూ నేర్చుకోవడానికే పంపారు. కాని ఎందుకో ఆ భాష నన్ను ఆకట్టుకోలేదు. దాంతో మా అమ్మగారు నన్ను సంస్కృతం వైపునకు ప్రోత్సహించారు. అక్కడా కొంత కాలం ఇమడలేకపోయాను. కాని 'గీతగోవిందం' నన్ను బాగా ప్రభావితం చేసింది. అందులోని లయ ఆకర్షించింది. దాంతో 7 ఏళ్ళ వయసులోనే మొదటి సారిగా సంస్కృతంలో రాయడం ఆరంభించాను. కొన్నిసార్లు సంస్కృత పదాలు రాకపోతే తెలుగు పదాలతోనే పూర్తి చేసే ప్రయత్నం చేసాను. చెంబు మాట తెలుగులోనే ఉపయోగించాను. అదే సమయంలో ఎవరికీ చెప్పకుండానే బాసర క్షేత్రం వెళ్లి దర్శనానికి వెళ్లి అమ్మవారి ముందు కూర్చున్నాను. ఐదురోజుల తర్వాత అయిదారు శ్లోకాలు ఆశువుగా వచ్చాయి. దాంతో సంస్కృతం మీద మక్కువ పెరిగింది. ఎవరు ఒప్పుకున్నారా లేదా అన్నది లేకుండా బాసరలో మొదలయిన సంస్కృత రచన ఇప్పటిదాకా గొప్ప ఆత్మానందంతో సాగింది. ఈ ప్రయాణంలో పలు సత్కారాలు మరెన్నో తిరస్కారాలూ లభించాయి. తర్వాత బిఓఎల్ పూర్తి చేసుకున్నంక వరంగల్‌లో 90 రూపాయల జీతంతో అధ్యాపకుడిగా నియమించబడ్డాను.



**పెద్దాయన, ఎంతో గొప్పవాడయిన కాళోజీ నారాయణ రావు గారు నన్ను పట్టుకొని "ఎందుకూ అక్కరకురాని తద్దిన మంత్రాల భాష పట్టుకున్నవేమిరా" అన్నాడు. చాలా బాధేసింది. వెంటనే "సంస్కృతం ప్రపంచంలోకెల్లా గొప్ప భాష. నువ్వు ఉపయోగించే 'ప్రభుత్వం', 'కార్యకర్త', 'అధ్యక్షుడు' ఇవన్నీ సంస్కృతమే కదా. అది లేకుండా ఒక్క వాక్యం రాయలేవు," అన్నాను.**

**వరంగల్ అనుభవాలు ఏమయినా చెప్పండి?**

అప్పుడు కవిసమ్మేళనాలల్లో నేనొక్కడినే సంస్కృత కవిని. పెద్దాయన, ఎంతో గొప్పవాడయిన కాళోజీ నారాయణ రావుగారు నన్ను పట్టుకొని "ఎందుకూ అక్కరకురాని తద్దిన మంత్రాల భాష పట్టుకున్నవేమిరా" అన్నాడు. చాలా బాధేసింది. వెంటనే "సంస్కృతం ప్రపంచంలోకెల్లా గొప్ప భాష. నువ్వు ఉపయోగించే 'ప్రభుత్వం', 'కార్యకర్త', 'అధ్యక్షుడు' ఇవన్నీ సంస్కృతమే కదా. అది లేకుండా ఒక్క వాక్యం రాయలేవు" అన్నాను. దాంతో అక్కడున్న కవులంతా చప్పట్లు కొట్టారు. కాళోజీ కొంచెం చిన్నబుచ్చుకున్నారు. కాని కోపగించుకోలేదు. తర్వాత అనేక కవి సమ్మేళనాలల్లో "వాడు రాలేదా" అని అడిగేవారు.

**మీకు అత్యంత ఇష్టమై, మిమ్మల్ని ప్రభావితం చేసిన సంస్కృత గ్రంథం?**

నాకు బాగా ఇష్టమయిన కవి బాణభట్టు రాసిన 'కాదంబరి'. ఆయన స్పృశించని ప్రక్రియ లేదు. చెప్పని భావం లేదు. మనకు హృదయంలో నాలుగు ధర్మాలున్నాయి. ధృతి, దీప్తి, సంకోచ, వికాసాలు. ఏ రచన చదివినా ఈ నాలుగు ధర్మాలు బయటకు వస్తాయి. ఆ నాలుగింటిని బయటకు తీసుకురావడానికే ఈ సాహిత్యం, దర్శనం మొదలయినవన్నీ. సమాజంలో సంస్కారం పెపొందించడానికే మనం చేసే ఈ ప్రయత్నాలన్నీ. నాకు అన్ని దర్శనాల కంటే సాంఖ్య దర్శనం మీదే ఎక్కువ ఇష్టం. కాని దురదృష్టం ఏమిటంటే అనేక గ్రంథాలు ఇవాళ లేవు, నాశనం చేసారు. ప్రపంచం మూడే వస్తువుల మీద ఆధారపడింది. వైశ్వానర, తైజస, ప్రాజ్ఞ. రాయీ రప్పా అన్నీ వైశ్వానర- వాటికి ప్రాణం లేదు. అవన్నీ ప్రాణికి ఉపయోగపడేవే. వాటికి స్వార్థం లేదు. తైజస అంటే అర్ధ చైతన్యం. చెట్లూ తీగలూ- వీటికి ప్రాణం ఉంటుంది. వీటిలో స్వార్థం ఒకింత, నిస్వార్థం మూడింతలు. ఇక మూడవది ప్రాజ్ఞ- వీటిలో చైతన్యం వుంటుంది. ఏక కణ జీవి నుండి మనిషి దాకా. వీటిలో ప్రయత్నం కృషితో వాళ్ళ చైతన్యం పెరుగుతుంది. ఇలాంటి అనేక విషయాలు సంఖ్యా శాస్త్రం చెప్పింది. కాని ఆ గ్రంథాలన్నీ ఇవ్వాళ లేవు. ఆయా కాలాల్లో నాశనం చేసారు. అది మన దురదృష్టం.

**ఇక మీ రచనా ప్రస్థానం ఎప్పుడు ఎట్లా మొదలయింది. ఎట్లా సాగింది?**

నా పదిహేడేళ్ళ వయసులో మొట్టమొదటి నవల రాసాను. దాని పేరు 'మనోరమ'. అంతకుముందు కూడా రచనలు చేసాను. చివరికి ఊర్లో పాలమ్మే అమ్మ ఆమె గురించి క్షీరందేహి మల్లక్క అని కూడా రాసాను. కాని మనోరమ ఇప్పుడు లేదు పోయింది. నాకు అధికంగా ప్రహేళికల ద్వారా పేరు వచ్చింది. సంస్కృతంలో ప్రహేళికలు లేవు.

**మీ రచనల్లో 'మందాకిని' గొప్ప రచనగా వినుతికెక్కినది. దాని విశేషాలు?**

మందాకిని అలవోకగా వచ్చినకావ్యం. మందాకిని అంటే గంగా ప్రవాహం అందులో శ్లోకాలుండవు. అంతా మాత్రా ఛందస్సు. 'ఆకతి మందాకినీ...చకతి మందాకినీ.. మధురేన పూరేన..' ఇట్లా మొదలవుతుంది. ప్రవాహంలో ఎన్ని గతులు ఉంటాయో అవన్నీ మందాకినిలో ధ్వనిస్తాయి. నది పర్వతం నుంచి దుమికినప్పుడు ఎట్లా వుంటుంది, సమతలంలో పారినప్పుడు ఎట్లా వుంటుంది, మలుపులో ఎట్లా ధ్వనిస్తుంది- ఈ గతులన్నీ కావ్యంలో వినిపిస్తాయి. ఇందులో 200 ధాతువులు ఉపయోగించాను. రచన కేవలం 48 గంటల్లో పూర్తయింది. 2000 లైన్లున్నాయి. అందులో ప్రధానంగా మూడు కథలున్నాయి. జల కథ, నాయికా నాయక కథ, మూడవది యోగ శాస్త్రం. మందాకినీ రచనకు చాలా పేరొచ్చింది. చివరికి ఉత్తర భారతంలో కవి సమ్మేళనాలు జరిగినప్పుడు "వో మందాకినీ కవి కహా" అని అడిగే వారు. మందాకినీ పాడుకునేందుకు వీలుగా వున్న గేయ కావ్యం. అది సంస్కృత సాహిత్యంలో నూతన ఒరవడి.



## శ్రీభాష్యం విజయ సారథి

**మీ 'భారత భారతి' గురించి చెప్పండి?**

'భారత భారతి'లో సామాజిక అంశాలు ప్రధానంగా ఉటంకించాను. సామాజిక పోకడల్ని విశ్లేషించి విమర్శించాను. కొన్ని పరిష్కార మార్గాలను కూడా సూచించాను. అరవై శ్లోకాలతో సాగుతుంది. దేశ స్వాతంత్రాన్నీ సమగ్రతను పరిరక్షించుకోవడానికి అందరూ ముందుండాలని 'భారత భారతి'లో చెప్పాను. అది రాసి ఇంత కాలమయినప్పటికి ఇప్పటికీ దేశంలో అవే పరిస్థితులున్నాయన్న బాధ ఇంకా వుంది.

ఇవిగాక, 150 పైగా రాసిన గ్రంథాలలో భిన్నమయిన ప్రక్రియల్లో రచనలు చేసాను. సుప్రభాతాలు, స్తోత్రాలు, భక్తి రచనలు, అధిక్షేప కవితలు, విమర్శ, ఆప్త లేఖలు (లేఖా సాహిత్యం), ఖండ కావ్యాలు, ప్రహేళికలు, విమర్శ, వర్ణనా కావ్యాలు, అనువాదాలు రాసాను. నాకు రాయడం చదవడమే జీవితం.

**ఎన్నో గౌరవ పురస్కారాలు పొందారు. మరి ఇబ్బందిపడ్డ సంఘటనలేమైనా?**

ఎందుకు లేవు. కాళోజీగారి ప్రస్తావన ఇంతకుముందే చెప్పాను. ఇక మొదటి సారి ఆకాశవాణిలో కవిత్వం చెప్పడానికి పిలిచారు. నాకది మొదటి అనుభవం కనుక ఉత్సాహంగా వెళ్లాను. రామానుజరావుగారి చొరవతో అవకాశం వచ్చింది. కాని కేంద్రానికి 10 గంటలకు వెళ్ళగా పగలు 3 గంటల వరకు అడిగిన వాళ్ళే లేరు. చివరికి దేవులపల్లికృష్ణశాస్త్రిగారు వచ్చి- ఎవరు మీరు ఏమిటని అడిగారు. నేను లేఖ చూపించగా- అయ్యో, లోనికి రండి అని, నేను రాసినవి విని, రికార్డు చేసి చాల బాగున్నాయన్నారు. అంతవరకు సరే.. తర్వాతే "మీరు ఎక్కడి వారు" అని అడిగారు. మొదట అర్థం కాలే, "ఇక్కడే" అన్నాను. "కాదు- ఆంధ్రలో ఏ ప్రాంతం" అన్నారు. అంతే అప్పటిదాక ఆయనపై వున్న గౌరవం పోయింది. "నేను నూటికి నూరుపాళ్ళు తెలంగాణ వాణ్ని, కరీంనగర్‌లో పుట్టాను వరంగల్‌లో పనిచేస్తున్నాను" అన్నాను. అంత పెద్దాయనకూ ప్రాంతీయ భావన వుండడం బాధ అనిపించింది. ఇక మరొసారి పుట్టపర్తి నారాయణాచార్యులు "తెలంగానమున కవులు శూన్యము" అన్న మాటా చాలా బాధను కలిగించింది. జీవితం అన్నంక అన్నీ వుంటాయి. దాటుకుంటూ గమ్యం వైపునకు వెళ్ళాలి.

**సంస్కృత భాష అభివృద్ధికి ఏమైనా సూచనలు చేస్తారా?**

చెబితే ఎవరు వింటారు. సంస్కృతం నేర్చుకోవడం చాలా తేలిక. కానీ ఎదో తెలీని నిరాసక్తత ప్రబలింది. సంస్కృతాన్ని సంస్కృతంగానే చూడాలి నేర్చుకోవాలి. ఇవాళ విశ్వవిద్యాలయ ఆచార్యులు కూడా ఇంగ్లీష్‌లో ఆలోచించి మాట్లాడి సంస్కృతం బోధిస్తున్నారు. చాలా కష్టమనిపిస్తుంది. సంస్కృతం చదివినవాళ్లకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. విద్యాలయాలలో ప్రాధాన్యత పెంచాలి.

**మీరు స్థాపించిన సర్వ వైదిక సంస్థానం గురించి చెప్పండి?**

సమ్యక్ భావన, సమ్యక్ దృష్టి పెపొందించడానికి 36 ఏళ్ళ క్రితం స్థాపించాను. ఇక్కడ కుల జాతి మత బేధం లేకుండా అందరూ సమానమనే భావనే ఆచరిస్తున్నాం. దశాబ్దాల క్రితమే హరిజనుల ఆలయ ప్రవేశం చేయించాను. చివరికి గవర్నర్‌గా పని చేసిన కృష్ణకాంత్ కూడా వరాహ స్వామి ఆలయంలోకి సామాన్యునిలా వరుసలోనే వచ్చారు.

ఇంటర్వ్యూ ■ **వారాల ఆనంద్**
94405 01281

## మాయిముంతల్ని మాయంజేసే...

బౌద్ధాన్ని కత్తికో కండగా ఖతం జేసిన
ఆదిశంకరుని కనుపాప పంకజాలు
పునాదుల్లేని పురుష సూక్తాల పుట్కలు
మనువు తనువుతో హిందూ చిందులు
హరప్పా నాగరికతల నడుములిరిసిన ఆగంతకాల్లో
మా ముసలవ్వల కోటలు పలిగిన కుండ పెంకలు
యిచ్చుకపోయిన యిటికె కచ్చులు చెప్పే నిజ నివాస చరితలు
భూమి కన్న ఆర్నెల్లు ముందు బుట్టిన ఆదిజాంబవముని కుదుల్లము
జంబుద్వీపానికి మొదుల్లము
మా దేశమ్మీన బడి మమ్ముల దోప్కమ్ జేసి దోషుల్ని జేస్తున్నయి
మా యింట్ల జొచ్చి మమ్ముల్నే దొంగలని,
మా బత్కుల్ని సింగాబంగం జేస్తున్నయి.
చరిత్ర కడుపు చించితే... యెంట్లు గట్టిన యెతలు
నేలమ్మ కాళ్ల గజ్జెలై కతలు జెప్తయి
విద్యల నైవేద్యాలు అగ్రహారాల్లో ఆనకట్టలేసుకున్నా...
సదువు సినుకు మా గూడెం సెవిగోడ మీద
మా అడివాకు మీద మెరిసిందనీ
మా నాలికె నలుసక్షరం తునుక నమిలిందనీ
వేయి వక్కలైన వేల్లు, సీసం దిమ్మిసలైన సెవులు
నరాలు చీలిన నాలికెలు - యింకా నడికట్టేసి నడూల్లె నిలవల్లే...
రాత రచ్చబండ కాడ నొసలు మాసిన నోటి రాతలు
మా నెత్తురు, చెమటను విత్తుకున్న యీ నేలమ్మ సముద్రాల్ని సదురుకొని
అడవుల్ని ఆవలించి పచ్చలుగా పసిద్దయింది.
యీ మట్టి మాకు బొడ్డూడని బిడ్డపేగు
మనిషితనం లేని మనుధర్మ కర్మలు
మమ్ముల్ని పురుగులకన్నా పుచ్చిన కుక్కలకన్నా
హీనంజేసి, మూతికి ముంత ముడ్డికి తాటాకులుగట్టి
వూరు అంచులకు అడివి పంచలకు తరిమి సంపుతుంటే...
బౌద్ధంల బచాయించిన బుద్ధిస్టులము
అలయ్ బలయ్ ఆలింగనాల్తో ముసల్మానులమైన మూలవాసులము
అక్కున జేర్చుకున్న 'ఆమెన్'ల క్రీస్తుబిడ్డలము
మమ్ముల సంకనెత్తుకున్న సబ్బండ మతాలకు సంతకాలైనము
ఆకాశం అన్నం గిన్నెల అక్షరాల సుక్కల మెతుకుల్ని అతికించిన
సదువుల సందమామ సావిత్రిబాయి పూలే సంతతిమి
ఆకాశానికడ్డు బూమికి బొడ్డులేని
పురాణాల పుట్టల తవ్విన అండేద్కర్ ఆనవాల్లము
వేయి తలల కాళ్లజెర్రిని వేటాడిన కోరెగాములము
కోపెన కారటి దాపులు, ఆదార్కాడు అంచులు
ఓటరు కాయితమ్ ఒడిల బడని సదువుల్లేని
పంచార కంచాలము
తారీఖుల తలాపులు, దస్తావేజుల దరిదెల్వని
జోలె సంచులము, యిండ్లు పొండ్లు లేని యిలవరసలము
యీ పూట యీ పల్లె, రేపే పల్లెల తెల్లార్తదో
నిలకడలేని నీడలు
బతికిసెడ్డ సెరితల్ని నడుమున ముడేసుకొని నడిసే
నది గర్భాల నాడిని పట్టిసూడు
అలల కురుల్ని దువ్వి ముడిసే తీర్పాటంలేని
సముద్రుని తీరాలను ఆరాదియ్యి
పచ్చల అచ్చుల్ని కోకేసుకున్న
ఆకమ్మను అడిగి సూడు
కొండోని యెన్ను మీద యెదకొచ్చి ఎగిరిదునికే
ఏటి మాటల మూటిప్పు
గీ మట్టిని తట్టి సూత్తేసాలు...
నేలమ్మ కాళ్లమీద బడ్డ మురికి మూలాల్ని మొలేసి
పొరల్ని పొక్కిలిచ్చి తెరల పటం గడ్డది
మన్నుమడ్డల్ల వేళ్లూనుకున్న వేల చరితల
మాయిముంతల్ని శిబిరాల ఖబ్రస్థాన్‌ల ఖైదుజేసే
కా (CAA) ఎన్నార్సీలను మన్నార్సీ జేసే
వూరేగింపులు వురికొస్తున్నయి

■ **జూపాక సుభద్ర**
94410 91305



| ప్రరవే ఐదవ మహాసభలు | నాటక రచనల పోటీ | 'నెలనెలా వెన్నెల' | 'మధుహాసం', 'చైనాయానం' ఆవిష్కరణ | రంగినేని ఎల్లమ్మ అవార్డు ప్రదానం |
|---|---|---|---|---|
| ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఐదవ మహాసభలు ఫిబ్రవరి 8, 9 తేదీల్లో పుట్ల హేమలత ప్రాంగణం, హెచ్.బి. పేలస్ ఫంక్షన్ హాల్, జిల్లా జైలు ఎదురుగా, పాత పాలమూరు, భూత్ రోడ్డు మహబూబ్ నగర్‌లో జరుగుతాయి. 'నేరము, శిక్ష - భిన్న కోణాలు' అంశంపై చర్చ, ఉపన్యాసాలు ఉంటాయి. హరగోపాల్, కె. శ్రీనివాస్, జి.లక్ష్మీ నరసయ్య, ఇ. సుధారాణి, ఎం. రాఘవాచారి, జహారా తదితరులు పాల్గొంటారు. **ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక** | సంస్కృతి (గుంటూరు) ఆధ్వర్యంలో నిర్వహించే నాటక రచనల పోటీకి భారత చారిత్రక, పురాణ, ఇతిహాస సంఘటనలు, కథలు, గాథల ఆధారంగా ప్రదర్శన యోగ్యత ఉన్న నాటకాలను రాసి పంపాలి. జూన్ 1వ తేదీలోగా చిరునామా: సంస్కృతి, ఎస్. బాలచందర్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, పెట్రోలు బంకు ఎదురుగా, సర్వేయర్స్ అసోసియేషన్ బిల్డింగ్, గుంటూరు-4 కు పంపాలి. **ఎస్. బాలచందర్** | తెలంగాణ చైతన్య సాహితి ఆధ్వర్యంలో 'నెలనెలా వెన్నెల' సాహిత్య కార్యక్రమం ఫిబ్రవరి 9 సా.5గం.లకు సామాన్య శాస్త్రం ఆర్ట్‌గ్యాలరీ, మణికొండ, హైదరాబాద్‌లో జరుగుతుంది. కథా, కవిత్వ సృజనలలో ఆసక్తి కలవారు పాల్గొనవచ్చు. రచనలను వినిపంచవచ్చు. **ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్** | మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి చమత్కారాలతో 'మధుహాసం', దాట్ల దేవదానం రాజు యాత్రాకథనం 'చైనాయానం'ల ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 8 సా.5గం.లకు గాంధీ భవన్, మున్సిపల్ ఆఫీసు వెనుక, దంటు కళాక్షేత్రం పక్కన, కాకినాడలో జరుగుతుంది. పి. చిరంజీవినీ కుమారి, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు పాల్గొంటారు. **ఆంధ్రీ కుటీరం** | రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని 'అద్వంద్వం' కవితా సంపుటికిగాను శ్రీరామ్ పుప్పాల అందుకుంటారు. పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 9 ఉ.10గం.లకు రంగినేని చారిటబుల్ ట్రస్ట్, కరీంనగర్ రోడ్, సిరిసిల్లలో జరుగుతుంది. దేశపతి శ్రీనివాస్, జూకంటి జగన్నాథం, జిందం కళా చక్రపాణి, రంగినేని మోహన్ రావు, మద్దికుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొంటారు. **రంగినేని మోహన్ రావు** |

# ప్రచురణ రంగంలో నిశ్శబ్ద విప్లవం హెచ్‌బిటి

ప్రాథమిక స్థాయిలో తెలుగు ప్రచురణలు మిషనరీల చొరవతో వెలువడ్డాయి. సాహిత్య, సామాజిక, రాజకీయ, మత, ఐతిహాసిక గ్రంథాలు ఇరవయ్యో శతాబ్దపు తొలి దశాబ్దాల్లో అచ్చుకు నోచుకున్నాయి. అప్పటి ప్రముఖ ప్రచురణ సంస్థలు వావిళ్ళ, వేదం వారు. ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల, విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం, విశ్వ సాహిత్య గ్రంథమాల (ముంగండ), ఆదర్శ గ్రంథమండలి, దేశి కవితా మండలి, యం. శేషాచలం అండ్ కో, నవోదయ, ప్రజాశక్తి, విశాలాంధ్ర, అణా గ్రంథమాల... మరెన్నో సంస్థలు తెలుగు ప్రచురణలను సుసంపన్నం చేశాయి.

ఈ కోవకు చెంది, ప్రగతిపూర్వక లక్ష్యాలతో, సామాజిక స్ఫూర్తితో మొదలైన సంస్థ హైదరాబాద్ బుక్ ట్రస్ట్ (హెచ్.బి.టి). సి.కె.నారాయణ రెడ్డి (సి.కె), సిరిల్ తదితరులు ట్రస్టీలుగా, తెలుగు భాష పరిచయంలేని, తెలుగు ప్రచురణల గూర్చి, తెలుగువారి జీవనశైలితో పరిచయం లేని, తమిళనాడుకు చెందిన గీత మేనేజింగ్ ట్రస్టీగా, యస్.ఆర్. శంకరన్, సి. పద్మనాభరెడ్డి, మహీధర రామమోహనరావు, కంభంపాటి సత్యనారాయణ, బొజ్జా తారకం, షరీఫ్ లాంటి పెద్దల సలహా సంప్రదింపులతో, ట్రస్టు పని చేయడం మొదలైంది. క్రమేపీ తెలుగు చదవడం, రాయడం నేర్చుకుని, ప్రచురణ ప్రక్రియలో ఓనమాలు దిద్దుకుని, ఊరూరా తిరిగి, తెలుగు భాషాసంస్కృతులపై అవగాహనతో ప్రచురణలను మొదలుపెట్టారు గీత. ఆంగ్లంలో బహుళ ప్రాచుర్యం పొంది, తెలుగు పాఠకులకు అందుబాటులోలేని సాహిత్య ప్రక్రియల్లోని గ్రంథాలను తెలుగులోకి అనువదించి, ప్రచురించడం మొదలుపెట్టారు.

1980లో మొదలైన ప్రచురణ ప్రక్రియలో భాగంగా, ఆ సంవత్సరం వెలువడ్డ అనువాద నవలలు 'రక్తాశ్రువులు', 'స్పార్టకస్', 'ఏడుతరాలు', 'కూలీగింజలు'. చరిత్ర విభాగంలో అనువాదాలు 'చరిత్ర అంటే ఏమిటి' (ఇ.హెచ్.కార్), 'చరిత్రలో ఏం జరిగింది' (గార్డన్ చైల్డ్) వచ్చాయి. ఇంకా డి.డి. కొశాంబి, రొమిలా థాపర్, బిపిన్ చంద్ర, వెండీ డొనిగర్, కంభంపాటి లాంటి చరిత్రకారులతోపాటు, యువ చరిత్రకారులు భాంగ్యా భూక్యా, అడపా సత్యనారాయణల గ్రంథాలూ వెలువడ్డాయి.

జీవిత చరిత్రలు, జ్ఞాపకాల విభాగంలో, ప్రధాన స్రవంతితో పాటు, ముఖ్యంగా స్త్రీల చరిత్రలు -- ప్రధాన స్రవంతిలో లేని -- రేవతి (ట్రాన్స్‌జెండర్), నళిని (సెక్స్ వర్కర్), పూలన్ దేవి- వీరేగాక, బొజ్జా తారకం, సి.కె. నారాయణరెడ్డి, కొండపల్లి కోటేశ్వరమ్మ, చేగువేరా, సావిత్రీపూలే, మార్టిన్ లూథర్ కింగ్-- వ్యక్తిపర జీవిత కథల నుండి, రాజకీయ నాయకుల జీవిత వర్ణనల వరకూ, అంతవరకూ తెలుగు పాఠకులకు అందని మరెన్నో గ్రంథాలు వెలువరించారు.



సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చీల్చి, వేధిస్తున్న కుల వ్యవస్థ గూర్చి అంబేడ్కర్ రచనల నుండి సేకరించి, ప్రచురించడం ద్వారా, కుల వ్యవస్థలోని అగ్రకుల ఆధిపత్యాన్ని, కుళ్ళును బహిర్గతం చేసి, సమకాలీనంగా జరుగుతున్న, కులాధిపత్య వ్యతిరేక ఉద్యమాలకు ఊతం కలిపించారు.

స్వయం సహాయక రంగానికి సంబంధించి, ఆరోగ్యం ('వైద్యుడు లేని చోట'), పౌర హక్కులు, స్త్రీల అధ్యయనాలు, పిల్లల పెంపకం, చదువులు "వీటిలో మేమే ముందున్నాం" అంటున్నారు గీత.

కాల్పనిక సాహిత్యంలో, ప్రఖ్యాత నవలాకారులు, మహాశ్వేతాదేవి, జయకాంతన్, శివరామకారంత్, బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ, ఇస్మత్ చుగ్తాయ్, కేశవరెడ్డి తదితర ప్రఖ్యాత నవలాకారుల అనువాదాలను, తెలుగు ఒరిజినల్స్‌ను ప్రచురించారు.

జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రల విభాగం విస్తృతిని, వైవిధ్యాన్ని సంతరించుకుంది.

స్వల్ప పెట్టుబడితో, యితరేతర సంస్థల, రాజకీయ పక్షాల ప్రమేయం లేకుండా, తాను ప్రచురిస్తున్న గ్రంథాల పట్ల పెరుగుతున్న ఆసక్తి, అభిమానాలతో, రెండు దశాల్లో నాలుగు వందల గ్రంథాలను బుక్ ట్రస్ట్ ప్రచురించింది.



**"గ్రంథ ప్రచురణ, పఠనం, వినిమయం, తదితర అకడమిక్ అంశాల పట్ల, రెండు తెలుగు రాష్ట్రాల ఉదాసీన వైఖరివల్ల ఆశాభంగం చెందుతున్నాను."**
**- గీత రామస్వామి**

సగటున సంవత్సరానికి ఇరవై గ్రంథాలు. వాసిలో ఘనతరమైనా రాశిలో యీ సంఖ్య పేరొందిన ప్రచురణ సంస్థలతో సరితూగదు.

బుక్ ట్రస్ట్ నిర్వహించడంలో గీత కొన్ని అనుభవాలను పంచుకొంది. "రచయితలు రాసిందే వేదమని అనుకొంటారు. ఇందులో అసహజమేముంది? వారి గ్రంథాలను సమ రచయితల చేత బేరీజు వేయడాన్ని నిరాకరిస్తారు. ఇంతకంటె ముఖ్యం గ్రంథ ప్రచురణ, పఠనం, వినిమయం, తదితర అకడమిక్ అంశాల పట్ల, రెండు తెలుగు రాష్ట్రాల ఉదాసీన వైఖరివల్ల ఆశాభంగం చెందుతున్నాను," అని గీత విచారం వ్యక్తంచేశారు. గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా సంబంధిత ప్రభుత్వ శాఖలతో నాలుగు దశాబ్దాలుగా తనకున్న చేదు అనుభవాన్ని వెలిబుచ్చారు. వాస్తవాలను జీర్ణించుకోవడంలో గీతకు కొన్ని సమస్యలున్నాయి. గ్రంథాలయాలు, ప్రసిద్ధమైనవి గూడ, నిధులు లేక, అంకిత భావంతో పనిచేసేవారు కరువై అనాథలయ్యాయి. ఒకప్పుడు అధ్యయన వెలుగులు విరజిమ్మిన సంస్థలను ఆదుకునే నాథుడు లేడు. నిత్య పఠనం, ఆరోగ్యకర చర్చలు, విజ్ఞాన వినిమయం లేని యాంత్రిక సమాజంలో ఉన్నామని గీతకూ తెలుసు. పైగా పొరుగున వున్న కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలతో పోల్చి చూస్తే, నిరాశే మిగులుతున్నదని ఆమె అభిప్రాయం. అలసి, విసిగి వేసారి దాదాపు ఒంటరిగా హెచ్‌బిటి భారం మోసిన గీత ప్రస్తుతం నిరాసక్తంగా వున్నారనిపిస్తుంది. చదువరుల సంఖ్య తగ్గి, గ్రంథ ప్రచురణ ప్రక్రియ తట్టుకోలేని నష్టాలకు దారి తీస్తున్నందుకా? మార్కెట్‌లోకి క్రమేపీ చొరబడుతున్న ఈబుక్స్ వల్లనా?

హెచ్‌బిటి చేపట్టి, సాగించిన కృషికి ఆలంబనం భారతీయ సమాజంలోని వైవిధ్యం (diversity) అంటున్నారు గీత. ఒక తమిళ అమ్మాయి, తెలుగు ప్రాంతానికి వచ్చి, తెలుగు చదవడం రాయడం నేర్చుకొని, ప్రచురణ ప్రక్రియలో ఓనమాలు దిద్దుకొని, పట్టణాలకు, పల్లెలకూ తిరిగి, రద్దీ ప్రాంతాల్లో, బస్‌స్టాండుల్లో, పుస్తకాలు అమ్మి, ఉత్తములూ సౌజన్యవంతుల నేతృత్వంలో సాధించిన కృషి గురించి ఆమె ఇలా అంటున్నారు: "నేను చేసినదేదో గొప్ప కృషి అనుకోవడం లేదు. ఆది నాకొక ఆర్తిని, మానసిక ధైర్యాన్ని కలిగించి, ఆపద సమయాలను ఎదుర్కొనేటట్టు చేసింది. పఠనాసక్తి తగ్గుతోంది. జ్ఞానాభివృద్ధికి దోహదం చేసే సామాజిక వర్గాలు, విద్యావంతులు ఆ కృషి చేస్తున్నారా? నా కృషిలో ఇంతవరకూ సంస్థాపర (establishment) ఆటంకాలు లేవు. ప్రస్తుతం దేశంలో భయ వాతావరణం నెలకొని వుంది. డిజిటల్ మీడియం వేగంగా చోటు చేసుకుంటున్నది. నా శక్తి మేరకు కృషి చేశానన్న సంతృప్తి వుంది. ఇప్పటి వరకూ లభించిన ప్రోత్సాహం, సహాయ సహకారాలు, భవిష్యత్‌లో కొనసాగుతాయన్న నమ్మకం ఉంది".

■ **వకుళాభరణం రామకృష్ణ**
*(హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా)*




# చౌరా!..సారా!

ముచ్చటగా మూడంటే మూడు సినిమాల్లో నటించిందో లేదో **సారా అలీ ఖాన్** సోషల్ మీడియాలో పాపులర్ సెలెబ్‌గా మారిపోయింది. సినిమాల్లోకి రాక ముందు ఆహార, వ్యాయామ నియమాలకు దూరంగా ఉండిపోయిన సారా నటిగా మారాలనుకున్న తర్వాత పట్టుదలతో తన తీరు మార్చుకుని నాజూకుగా తయారైంది. తన ఫిట్‌నెస్ రహస్యాల గురించి ఇలా చెబుతోందీ ముద్దుగుమ్మ!



### మిశ్రమ వ్యాయామాలు!

"రోజూ ఒకే రకమైన వ్యాయామాలు చేయడం వల్ల ఫలితం ఉండదు. అందుకే నేను వ్యాయామాలను కలిపి లేదా మార్చి అనుసరిస్తూ ఉంటాను. పిలేట్స్ నుంచి స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వరకూ బూట్‌క్యాంప్ వర్కవుట్స్, కార్డియో ఇలా వేర్వేరు వ్యాయామాలకు ఫిట్‌నెస్‌లో స్థానం కల్పిస్తూ ఉంటాను. మొదట్లో నేను అవసరానికి మించి బరువు ఉండేదాన్ని కాబట్టి చురుగ్గా వ్యాయామాలు చేయడానికి శరీరం సహకరించేది కాదు. అందుకే ఎక్కువగా వాకింగ్, సైక్లింగ్ చేసి బరువు తగ్గించుకున్నాను. ఆ తర్వాత పిలేట్స్ వ్యాయామం కోసం 'నమ్రతా పురోహిత్' అనే ట్రైనర్‌ను నియమించుకున్నాను. ఈ వ్యాయామం కండరాల ఫ్లెక్సిబిలిటీని పెంచింది.

### డాన్సింగ్!

నాకు ఒడిస్సీ నృత్యం వచ్చు. ఈ డాన్స్‌తో కూడా శరీరానికి చక్కని వ్యాయామం దక్కుతుంది. ఒత్తిడి కూడా తగ్గిపోతుంది. నిజం చెప్పాలంటే ఎలాంటి నృత్యమైనా ఎంతోకొంత వ్యాయామాన్ని అందిస్తుంది. నా వరకు నాకు నేనెంతో ఇష్టపడి నేర్చుకున్న ఒడిస్సీ నా అధిక బరువు తగ్గించుకోవడానికి తోడ్పడింది.

### ఫంక్షనల్ ట్రైనింగ్!

ఈ వ్యాయామం విపరీతంగా ఫిట్‌నెస్ ఫాలో అయ్యేవారికే అనుకుంటే పొరపాటు. 'సిండీ జోర్డాన్' దగ్గర బూట్ క్యాంప్ ట్రైనింగ్ తీసుకున్నాను. ఇది కూడా బరువు తగ్గడానికి ఉపయోగపడింది. దీనిలో ఫుల్ బాడీ వర్కవుట్లు, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కూడా ఉంటాయి. ఏరోబిక్స్ చేసిన ఫలితం కూడా దక్కుతుంది. కాబట్టి ఈ ట్రైనింగ్ నాకెంతో బాగా వర్కవుట్ అయింది."

---

విజేత



**అనారోగ్యంతో బాధపడుతున్న భర్త ప్రాణాలు కాపాడుకోవాలనే లక్ష్యం ఆమెది. ఆ లక్ష్యం కోసం తాను ఆరు పదులు దాటిన వృద్ధురాలినన్న విషయాన్ని మరిచిపోయిందామె. తన ఐదోతనాన్ని నిలుపుకోవడం కోసం వయసును లెక్కచేయకుండా 'మారథాన్'లో పాల్గొన్నది. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ విజేతగా నిలిచింది. ఒక్కసారి కాదు... వరుసగా మూడేళ్ల పాటు 'బారామతి మారథాన్'లో విజేతగా నిలిచి ఎందరికో స్ఫూర్తినిచ్చింది 72ఏళ్ల లతా కరే. మహారాష్ట్రలోని మారుమూల గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి కథనంతో స్ఫూర్తి పొందిన ఇద్దరు యువకులు ఆమె కథకు దృశ్యరూపమిచ్చారు. ఆ విశేషాలే ఇవి...**



# భర్త కోసం మారథాన్ పరుగు!

కరీంనగర్‌కు చెందిన నవీన్‌కుమార్, యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం నెమురగొముల గ్రామానికి చెందిన ఎర్రబోతు కృష్ణ మారథాన్ విజేత లతా కరే జీవిత కథ ఆధారంగా ఆమె పేరుతోనే మరాఠీలో చిత్రం 'లతా భగవాన్ కరే'ను రూపొందించారు. ఈ చిత్రం ఇటీవల (జనవరి 17న) మహారాష్ట్రలో విడుదలయ్యింది.

**ఎవరీ మారథాన్ విజేత...**

మహారాష్ట్రలోని బుల్దాన జిల్లా పింప్లీ గ్రామానికి చెందిన లతా భగవాన్ కరే దంపతులకు నలుగురు కూతుళ్లు. ఏళ్ల తరబడి కూలీ నాలీ చేసి కూడబెట్టిన డబ్బుతో కూతుళ్ల పెళ్ళిళ్లు జరిపించారు. అందుకోసం చేసిన అప్పులు ఆమె కుటుంబానికి భారంగా మారాయి. అప్పులు తీర్చేందుకు భార్యాభర్తలు కష్టపడుతున్న సమయంలో అనుకోని ఆపద వచ్చి పడింది. భర్త భగవాన్ కరే ఒంట్లో నలతగా ఉందని చెప్పడంతో లతా కరే ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లింది. ఏదో ఇన్‌ఫెక్షన్ సోకి ఉంటుందని పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్తే గాని అసలు విషయం ఏమిటో తెలుస్తుందని చెప్పడంతో ఆమె ఆందోళనకు గురైంది. రెండు రోజుల్లోనే భర్త నడవలేని స్థితికి చేరుకున్నారు. పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక తనలో తాను మదనపడింది. భర్తను ఎలాగైన కాపాడుకోవాలనే ఆరాటంతో బంధువులు, చుట్టుపక్కల వాళ్ల దగ్గరకెళ్లి సాయం అందించాలని వేడుకుంది. ఎంతో కొంత అందిన సాయంతో భర్తను పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఎంఆర్ఐ లాంటి పరీక్షలు చేయాలంటే రూ.5వేల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఆమె గుండె ఆగినంత పనైంది. హృదయవిదారకంగా రోదిస్తూ ఆ రోజంతా బారామతి ఆసుపత్రి వరండాలోనే ఉండిపోయిందామె.

**పేపరు ప్రకటనే ఊపిరి పోసింది...**

భర్త ఆకలిగా ఉందని చెప్పడంతో లతా కరే ఆస్పత్రి బయట రోడ్డు చివరన ఉన్న ఓ కొట్టు వద్దకు వెళ్లి తన దగ్గర ఉన్న కొద్దిపాటి చిల్లరతో రెండు సమోసాలు తీసుకువచ్చి తినమని భర్తకు ఇచ్చింది. సమోసాలు చుట్టిన పేపరులో మరాఠీలో పెద్ద పెద్ద అక్షరాలతో కూడిన ప్రకటన లతా కరే కంట పడింది. 'బారామతి మారథాన్‌లో పాల్గొనండి.. రూ.3వేలు నగదు గెలుచుకోండి' అనేది ఆ ప్రకటన సారాంశం. రాత్రంతా తెగ ఆలోచించి... మారథాన్‌లో పాల్గొని రూ.3వేలు గెలుచుకోవాలనుకుంది. ఆ డబ్బుతో భర్తకు వైద్యం చేయించాలని గట్టిగా నిర్ణయించుకుంది. మరుసటి రోజు (2013 డిసెంబర్ 17న) బారామతి మారథాన్ ప్రారంభం కావడానికి సిద్ధమైంది. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అనేక మంది మహిళలు స్పోర్ట్స్ దుస్తులు, షూ ధరించి పరుగుకు సిద్ధమయ్యారు. అప్పుడే లతా కరే 9గజాల నేత చీరతో, పాదాలకు కనీసం చెప్పులు కూడా లేకుండా మారథాన్ జరిగే ప్రదేశానికి చేరుకుంది. పోటీల్లో పాల్గొనేందుకు తనకు కూడా అవకాశం ఇవ్వాలని నిర్వాహకులను కోరింది. అందుకు వాళ్లు నిరాకరించారు. అయితే పరిస్థితిని వివరించి వేడుకోవడంతో నిర్వహకులు ఎట్టకేలకు అనుమతి ఇచ్చి చివరి వరుసలో నిలబెట్టారు. 'తాను ఎక్కడ నిలుచున్నాను అనేది కాదు... ఎలాగైన రూ.3వేలు గెలుచుకుని తన భర్తకు వైద్యం చేయించాల'నే టార్గెట్ ఒక్కటే ఆమె కళ్ల ముందు కనిపించింది. పరుగుపందెం మొదలైంది... లక్ష్యం ముందు తన కాళ్లకు గుచ్చుకుంటున్న రాళ్లు రప్పలు కనిపించడం లేదు.. అదే లక్ష్యం.. అదే వేగం.. అదే పరుగు .. బారామతి ప్రజల చప్పట్లు ఆమెను మరింత ఉత్సాహపరిచాయి. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ లతా కరే మారథాన్ విజేతగా నిలిచింది. భర్తపై లతా కరేకు ఉన్న ప్రేమకు అక్కడివారంతా జేజేలు పలికారు. అప్పటికప్పుడు మారథాన్ నగదు ప్రైజు రూ.3వేల నుంచి రూ.5వేలకు పెంచారు. ఆమె లక్ష్యం ముందు సమస్యలన్నీ చిన్నబోయాయి. గెలుచుకున్న డబ్బుతో భర్తను కాపాడుకుంది. అంతే... మహారాష్ట్రలోని పత్రికలు, ఛానళ్లు ఆమె గొప్పతనాన్ని కీర్తించాయి. నెల తిరగకుండానే ఎంతో మంది సహాయం అందించగా ఆమె బ్యాంకు ఖాతాలో రూ.2లక్షల వరకు జమ అయ్యాయి. అప్పటినుంచి వరుసగా మూడేళ్ల పాటు మారథాన్ విజేతగా లతా కరేనే గెలవడం గమనార్హం. ఇదే కథను 'లతా కరే' పేరుతో మరాఠీలో సినిమాగా తీశారు ఇద్దరు తెలుగు యువకులు. ఇటీవలే మహారాష్ట్రలో విడుదలైన ఈ సినిమాను త్వరలోనే తెలుగులోకి అనువదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

● **బొమ్మగాని గురులింగం**
బీబీనగర్, యాదాద్రి భువనగిరి జిల్లా

**పత్రికల్లోచదివి...**

మాది కరీంనగర్. సినిమా దర్శకుడిగా ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో లతా కరే కథనం చదివాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఆమె జీవిత కథాంశంతో సినిమా తీయాలనుకున్నా. అనేక వ్యయప్రయాసలకోర్చి మహారాష్ట్రకు వెళ్లి లతాకరే కుటుంబాన్ని కలిశా. స్క్రిప్టు సిద్ధం చేసుకుని, ఆమెతోనే బయోగ్రఫీ తీశా.

**- నవీన్‌కుమార్**
దర్శకుడు

**తెలుగు ప్రేక్షకుల ముందుకు...**

లతా కరే జీవితం ఎందరికో ఆదర్శం. అలాంటి గొప్పవ్యక్తి యదార్థగాథను సమాజానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో చిత్రనిర్మాణం చేపట్టా. మహారాష్ట్రలో ఈ సినిమా విడుదలై అందరి ప్రశంసలు అందుకుంటోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువదించి మన ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తా.

**- ఎర్రబోతు కృష్ణ,** నిర్మాత


లతా కరే కుటుంబంతో నిర్మాత, దర్శకుడు

---

యాత్ర

**చుట్టూ సముద్రం!**
**జస్ట్ 719.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం!!**
**నగరమా అంటే.. నగరం.**
**దేశమా అంటే.. దేశం!!**
**ఆ నగర దేశాన్ని ప్రపంచమంతా ముద్దుగా పిలుచుకునే పేరు... సింగపూర్.**

ట్రాఫిక్ క్రమశిక్షణ, రహదారులు, విద్యలో నాణ్యత... ఇలా దేని గురించి చెప్పాలన్నా పాశ్చాత్య దేశాలతో పోల్చుకోవడం మనకు అలవాటు. కానీ మన ఆసియా ఖండంలోనే పాశ్చాత్య దేశాలకు దీటుగా ఉండే ఏకైక దేశం సింగపూర్. పర్యాటక రంగం ఆ దేశ ఆదాయానికి ఆయువుపట్టు. విదేశీయులూ మెచ్చి వచ్చే చోటు సింగపూర్. కానీ, చూసినవే ఎవరైనా ఎన్నిసార్లు చూస్తారు? అందుకే పర్యాటకులను ఆకర్షించేలా చైనీయుల నూతన సంవత్సరం చైనా టౌన్‌లో, భారతీయుల దీపావళి వేడుకలు లిటిల్ ఇండియాలో, లెబనన్ల కొత్త సంవత్సర వేడుకలు వారుండే ప్రాంతాల్లో... ఇలా నిత్యం ఏదో ఒక కొత్త ఈవెంట్ జరుగుతూనే ఉంటుంది. అందుకే చాలా మంది పర్యాటకులు 'సింగపూర్‌లో ప్రతి రోజూ పండగే' అంటారు. అక్కడి పర్యాటక ఆకర్షణల్లో మచ్చుకు కొన్ని..

**నైట్ సఫారీ**

సింగపూర్‌కే ప్రత్యేకం 'నాక్టర్నల్ జూ'. అంటే రాత్రిపూట కూడా తెరచి ఉండే జంతువుల ప్రదర్శన శాల. ప్రపంచంలోనే తొలి నాక్టర్నల్ జూ ఇది. దాదాపు 86 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ జూలో రాత్రిపూట వేటాడే జీవులను చూడొచ్చు. 'నైట్ సఫారీ' పేరుతో 1994 మే 26 నుంచి ఇది అందుబాటులోకి వచ్చింది. 100 జాతులకు చెందిన 900 జంతువులు ఇందులో ఉంటాయి. వాటిలో 41 శాతం అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నవే. రైల్ కోచ్‌లాంటి వాహనంలో కూర్చొని,, చిమ్మచీకట్లో నెమ్మదిగా వెళ్తూ ఆ జంతువులను చూడొచ్చు.



**రెయిన్ ఫారెస్ట్ లూమినా**

నైట్ సఫారీ పక్కనే ఉండే మరో ఆకర్షణ.. రెయిన్‌ఫారెస్ట్ లూమినా. ఇది కూడా రాత్రిపూట సందర్శించేదే. పేరుకు ఫారెస్టే కానీ, ఇందులో నిజమైన జంతువులు రెండో మూడో ఉంటాయి. మిగతావన్నీ వర్చువల్ జంతువులే! పేరుకు తగినట్టుగా ఎక్కడ చూసినా కళ్లు చెదిరే అద్భుతమైన విద్యుద్దీపాల కాంతులు మనల్ని అబ్బురపరుస్తుంటాయి. ఒకచోట పెద్ద పెద్ద మైకులు ఉంటాయి. వాటిలో మనం ఎంత గట్టిగా అరిస్తే అన్ని వర్చువల్ జంతువులు కనిపించి ఆటలాడుతాయి. మరొకచోట వరుసగా బండరాళ్లు పరిచి ఉంటాయి. వాటి మీద మనం ఎంత గట్టిగా ఎగిరితే అన్ని వర్చువల్ జంతువులు ప్రత్యక్షమై అలరిస్తాయి.

**రిసార్ట్ వరల్డ్ సెంటోసా**

సింగపూర్ దక్షిణ తీరంలో ఉండే సెంటోసా దీవి ఆనందాల అద్భుతం. 'రిసార్ట్ వరల్డ్ సెంటోసా' పేరుతో అక్కడ ఏర్పాటైన రిసార్ట్‌ను పూర్తిగా చూడాలంటే కనీసం వారం రోజులైనా పడుతుంది. సింగపూర్‌లో ఉండే రెండు క్యాసినోల్లో ఒకటి అక్కడే ఉంటుంది. అలాగే ప్రపంచంలోనే రెండో అతిపెద్ద అక్వేరియంను అక్కడి ఎస్.ఇ.ఎ.(సౌత్ ఈస్ట్ ఆసియా)లో చూడొచ్చు. అది ఎంత పెద్ద అక్వేరియం అంటే దానిలో 1.8 కోట్ల లీటర్ల నీళ్లు పడతాయి! 800 జాతులకు చెందిన 50 వేల సముద్ర జీవాలు ఆ అక్వేరియంలో ఉంటాయి. రోజూ మధ్యాహ్నం పూట ఇద్దరు డైవర్లు ఆ అక్వేరియంలోకి దిగి చేపలకు ఆహారం పెట్టే దృశ్యాలను చూడాల్సిందే తప్ప వర్ణించలేం. ఇక, మేడమ్ టుస్సాడ్స్ మైనపు బొమ్మల మ్యూజియంలో మన బాలీవుడ్ స్టార్ల బొమ్మలే హైలైట్! మారిటైమ్ మ్యూజియం, రాయల్ ఆల్బట్రాస్ పడవలో విహారం, ట్రిక్ ఐ మ్యూజియం, స్కై డైవింగ్, స్కైల్యూజ్... ఇలా చాలా ఆకర్షణలే ఉంటాయక్కడ. రిసార్ట్ వరల్డ్ సెంటోసా ఎంత పెద్దదో అర్థమయ్యేలా చెప్పాలంటే దాని కారు పార్కింగ్ వైశాల్యం గురించి తెలుసుకుంటే చాలు. ఆ కార్‌పార్కింగ్ ప్రదేశం ఎంత పెద్దదో తెలుసా? అక్కడ 45 వేల కార్లను పార్కింగ్ చేయవచ్చు. ఇది బహుళ అంతస్తుల పార్కింగ్.

**చైనా టౌన్**

సింగపూర్ వెళ్లినవారంతా ఎక్కువగా, తప్పనిసరిగా వెళ్లే ప్రదేశాల్లో చైనా టౌన్ ఒకటి. అత్యంత ఆకర్షణీయంగా ఉండడంతోపాటు చాలామంది పర్యాటకులు సావనీర్లు, గిఫ్టులు కొనుక్కోవడానికి ఇదే అత్యంత అనువైన చోటు కావడం ఇందుకు ప్రధాన కారణం. ఎందుకంటే సింగపూర్ మాల్స్‌లో ఏదైనా కొనాలంటే భారీగా ఖర్చవుతుంది. కానీ, చైనా టౌన్ మన హైదరాబాద్‌లోని అబిడ్స్, కోఠి ప్రాంతం లాంటిది. ఇక్కడ పది డాలర్లకు (దాదాపు రూ.550) మూడు వస్తువుల బేరం నడుస్తుంటుంది. ఇంకా బేరమాడినా కూడా కొందరు తగ్గించే అవకాశం ఉంది. గృహాలంకరణ వస్తువులకైతే కొదవ ఉండదు.

**లిటిల్ ఇండియా**



ఇది భారతీయులు ఎక్కువగా ఉండే ప్రదేశం. భారతీయులు అంటే.. ఎక్కువ మంది తమిళులే! ఈ ప్రాంతంలో ఉండే ముస్తఫా షాపింగ్‌మాల్‌లోని సూపర్‌మార్కెట్‌కు వెళ్తే మనం ఏ చెన్నైలోనో ఉన్నామనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు. లిటిల్ ఇండియా ప్రాంతంలో పెద్ద 'తలైవా' (రజనీకాంత్) పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణ.

**చాంగీ జ్యువెల్**

సింగపూర్ పర్యాటకానికే మణిమకుటం- చాంగీ జ్యువెల్ ఎయిర్‌పోర్టు. సింగపూర్ ఎయిర్‌పోర్టులో నాలుగు టెర్మినల్స్ ఉంటాయి. వాటిలో తాజా నిర్మాణం చాంగీ జ్యువెల్ టెర్మినల్. మానవ నిర్మిత జలపాతాల్లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైనది ఇక్కడే ఉంది. 40 మీటర్ల ఎత్తు నుంచి పల్చటి కాగితంలా కిందికి జాలువారే జలపాతం (దీన్ని 'రెయిన్ వర్టెక్స్'గా పిలుస్తారు).. ఆ నీటిని టర్బైన్ల ద్వారా తిప్పి పైకి పంపుతారు. అక్కడే విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఒక్క జ్యువెల్ టెర్మినల్‌ను చూడ్డానికే ఒకరోజు మొత్తం సరిపోదు. 2013 నుంచి వరుసగా ఏడేళ్లుగా ప్రపంచంలోని అత్యుత్తమ విమానాశ్రయాల జాబితాలో చాంగీ జ్యువెల్ అగ్రస్థానంలో నిలుస్తోంది. మరో విశేషమేమిటంటే... ఇంత పెద్ద నిర్మాణాన్నీ ఎక్కడా పిల్లర్లు లేకుండా డోమ్‌లాగా నిర్మించారు. సింగపూర్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'మెరీనా బే శాండ్స్' హోటల్‌కు ప్లాన్ గీసిన ప్రముఖ ఆర్కిటెక్ట్ మోషే సఫ్డి దీనికి కూడా రూపాన్ని ఇచ్చారు.

● **కేబీఎల్**

**మరిన్ని వివరాలకు:** https://www.stb.gov.sg/
https://www.visitsingapore.com/en/

# అక్కడ... ప్రతి రోజూ పండగే!





---

స్ఫూర్తి


భర్త, కూతురుతో...

# 55 ఏళ్ల చదువుల తల్లి!

అది గుజరాత్ యూనివర్సిటీ ప్రాంగణం... కాలేజీ టాపర్లుగా నిలిచిన వారిని వేదిక మీదకు పిలిచి గోల్డ్ మెడల్స్ అందిస్తున్నారు. తల్లితండ్రులు చప్పట్లు కొడుతూ అభినందిస్తున్నారు. అంతలోనే నితీ రావల్ బంగారు పతకం అందుకునేందుకు వేదిక మీదకు వచ్చారు. 55ఏళ్ల నితీ ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా నాలుగు బంగారు పతకాలు సాధించి ఇటీవల చరిత్ర సృష్టించారు. ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు చేసిన తరువాత ఆమె చదువులో చూపించిన ప్రతిభ చూసి అందరితో పాటు ఆమె కుటుంబసభ్యులు ఎంతో పొంగిపోయారు.

నితీది న్యాయవాదుల కుటుంబం. ఆమెభర్త, కూతురు, కుమారుడు అందరూ లాయర్లే. మంచి సంబంధం రావడంతో కూతురు పెళ్లి చేశారు. కొడుకు ముంబయ్‌లోని ఒక కంపెనీలో న్యాయ సలహాదారుగా చేరాడు. పిల్లలిద్దరూ చక్కగా స్థిరపడడంతో కుటుంబ బాధ్యతల బరువు కొంత తగ్గింది. అప్పటికి నితీకి తన గురించి ఆలోచించుకునేంత తీరిక దొరికింది. ఉదయాన్నే కోర్టుకు వెళ్లిన భర్త తిరిగి రాత్రి ఇంటికి వచ్చేదాకా ఇంట్లో ఒంటరిగా ఉండడం ఆమెకు బోర్‌గా అనిపించేది. తను కూడా ఏదైనా చేయాలనుకున్నారు. ఆమె మనసు చదువు వైపు మళ్లింది. అప్పటికి ఆమెకు 53 ఏళ్లు. పైగా ఆమె పుస్తకాలు వదిలేసి ముప్ఫై ఏళ్లు దాటింది. 'నేను కూడా లా చదువుదామనుకుంటున్నా' అని తన భర్తతో చెప్పారు. భార్య మనసు తెలిసిన ఆయన సంతోషంగా 'సరే' అన్నారు.

"నేను క్లాస్‌రూమ్‌లోకి అడుగుపెట్టగానే విద్యార్థులంతా నన్ను టీచర్ అనుకున్నారు"అని తాను తిరిగి కాలేజీలోకి అడుగు పెట్టిన మొదటి రోజును గుర్తుచేసుకుంటూ నవ్వుతారు నితీ. కుటుంబం ఇచ్చిన మద్దతు, తన కష్టంతో తనకన్నా చిన్నవారైన తోటి విద్యార్థులతో పోటాపోటీగా చదివేవారు నితీ. చదువులో ఆమె చూపిన ప్రతిభకు నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. "నేను న్యాయవాద డిగ్రీ పూర్తిచేశానంటే అదంతా నా కుటుంబసభ్యుల సహకారం వల్లే" అని గోల్డ్ మెడల్స్ అందుకున్న ఆనందంలో అన్నారు నితీ. డిగ్రీ కోర్సు విజయవంతంగా ముగించిన ఈ చదువుల తల్లి లా మాస్టర్స్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

---

బ్యూటీ

# పెదవులు తళుక్కుమనేలా...

న్యూడ్ లిప్ కలర్ అనేది లిప్‌స్టిక్ షేడ్స్‌లో ప్రత్యేకమైనది. స్మోకీ ఐస్ లేదా డ్యూ మేకప్‌తో సహా ఏ లుక్ మీదకు అయినా సరే న్యూడ్ లిప్‌స్టిక్ చక్కగా మ్యాచ్ అవుతుంది. మీరు కూడా న్యూడ్ లిప్ కలర్ ట్రెండ్‌లో హొయలు పోయేందుకు ఏం చేయాలంటే...

- ముందుగా పెదవులను శుభ్రం చేసుకోవాలి. దాంతో వాటి మీది మృతకణాలు తొలగి మృదువుగా మారతాయి. తరువాత లిప్ ఆయిల్ లేదా లిప్ బామ్ రాసుకోవాలి.
- చర్మం రంగుకు సరిపోయే లిప్‌కలర్ ఎంచుకోవాలి. అంతేకాదు ఆ కలర్ మీ పెదవుల రంగుకు సరిపోతుందా లేదా! చెక్ చేసుకోవాలి. అయితే ముదురు రంగు లిప్‌స్టిక్ రాసుకుంటే పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది.
- న్యూడ్ లిప్ కలర్ ఒక్కటే వాడితే పెదవులు పాలిపోయినట్టుగా ఉంటాయి. అప్పుడు నేచురల్ కలర్ బ్రష్ వాడితే పెదవులు తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తాయి. సీసీ క్రీమ్ లేదా షీర్ ఫౌండేషన్ అప్లై చేసుకున్నా సరిపోతుంది.
- లిప్‌స్టిక్ వేసుకోవడం అయ్యాక లైన్ గీసుకోవడం మర్చిపోవద్దు. లిప్ లైన్ చక్కని ఆకృతిలో వచ్చేందుకు కావాలంటే కన్‌సీలర్ ఉపయోగించవచ్చు.



ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
విజయవాడ ● సోమవారం 3 ఫిబ్రవరి 2020

diksuchi@andhrajyothy.com

***దేశంలో అత్యధిక మంది ఎంచుకుంటున్న సంప్రదాయ వృత్తుల్లో.. న్యాయ వాద వృత్తి ఒకటి. వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్న వారికి సరి పడే వృత్తి ఇది. ప్రపంచీకరణ, అవుట్ సోర్సింగ్ నేపథ్యంలో ప్రస్తుతం కెరీర్ పరంగా 'లా' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి చేరింది. సామాజికంగా, పారిశ్రామికంగా చోటుచేసుకుంటున్న మార్పుల ఫలితంగా పేటెంట్ హక్కుల పర్యవేక్షణ సంస్థలు, కాపీరైట్ సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్‌జీఓలు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా లా గ్రాడ్యుయేట్లను నియమించుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రతి కంపెనీ, బ్యాంకులో లా విభాగం సర్వసాధారణమైంది. దీంతో పుష్కలమైన అవకాశాలు న్యాయవాదులకు స్వాగతం పలుకుతున్నాయి. ఫలితంగా లా కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. న్యాయ విద్యను అభ్యసించడానికి అత్యున్నతమైనవి జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాలు. వీటిలో ప్రవేశానికి వీలు కల్పించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)-2020కి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష విధానం, అర్హత, తదితర వివరాలను తెలుసుకుందాం..***

## క్లాట్ ద్వారా ప్రవేశం కల్పించే సంస్థలు

| | | |
|---|---|---|
| నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ | - | బెంగళూరు |
| నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా | - | హైదరాబాద్ |
| నేషనల్ లా యూనివర్సిటీ | - | భోపాల్ |
| వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యురిడికల్ సైన్సెస్ | - | కోల్‌కతా |
| నేషనల్ లా యూనివర్సిటీ | - | జోధ్‌పూర్ |
| హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ | - | రాయ్‌పూర్ |
| గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ | - | గాంధీనగర్ |
| డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ | - | లక్నో |
| రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా | - | పాటియాలా |
| చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ | - | పాట్నా |
| నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ | - | కొచ్చి |
| నేషనల్ లా యూనివర్సిటీ | - | ఒడిశా |
| నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా | - | రాంచీ |
| నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీ | - | గువహతి |
| దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ | - | విశాఖపట్నం |
| తమిళనాడు నేషనల్ లా స్కూల్ | - | తిరుచిరాపల్లి |
| మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ | - | ముంబై |
| మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ | - | నాగ్‌పూర్ |
| మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ | - | ఔరంగాబాద్ |
| హిమాచల్‌ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ | - | సిమ్లా |
| ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ | - | జబల్‌పూర్ |
| డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ లా యూనివర్సిటీ | - | హర్యానా |

**22 యూనివర్సిటీలు:** *క్లాట్ పరీక్ష ద్వారా 22 జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ, అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (విశాఖపట్నం) కూడా ఉన్నాయి.*



# మార్పులతో క్లాట్

జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల మధ్య కుదిరిన పరస్పర అవగాహన మేరకు ఆయా సంస్థల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి క్లాట్‌ను నిర్వహిస్తారు. కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్ - బెంగళూరు ఆధ్వర్యంలో ఈ ఏడాది క్లాట్‌ను నిర్వహిస్తారు.

## అర్హత

అండర్‌గ్రాడ్యుయేషన్: ఐదేళ్ల లా కోర్సులో చేరే విద్యార్థులు 45 శాతం మార్కులతో 10+2 / తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ / ఎస్టీ విద్యార్థులకు 40 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

- **పోస్ట్‌గ్రాడ్యుయేషన్:** ఎల్‌ఎల్‌ఎం కోర్సులో చేరే వారు 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ / ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ / తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి (ఎస్సీ / ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు). చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

## ప్రిపరేషన్ విధానం

- **ఇంగ్లీష్ :** తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం ఇది. గ్రామర్, ఇంగ్లీష్ భాషపై ప్రాథమిక అవగాహన ఉంటే ఈ విభాగంలో చక్కని స్కోర్ చేయవచ్చు. ఇందులో సమకాలీన, చారిత్రక నేపథ్యం నుంచి 450 పదాలతో కూడిన ప్యాసేజ్‌లను (రీడింగ్ కాంప్రెహెన్షన్) ఇస్తారు. వీటిని చదవడానికి 5 - 7 నిమిషాల సమయం పడుతుంది. ఈ ప్యాసేజ్‌లను చదివి వాటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలను రాయాలి. ప్యాసేజ్‌లో ఇచ్చిన వాదనలను తార్కికంగా పోల్చడం, దాని సారాంశం, ముగింపు, అందులోని వివిధ పదాల అర్థాలు వంటి అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ కాంప్రెహెన్షన్‌లో మంచి మార్కులు రావాలంటే వొకాబ్యులరీపై పట్టు ఉండాలి. తద్వారా ప్రశ్నలకు సులువుగా జవాబులను గుర్తించే సామర్థ్యం లభిస్తుంది.
- **జీకే అండ్ కరెంట్ అఫైర్స్:** ఇందులో సమకాలీన, వార్తలు, జర్నలిస్ట్ రిసోర్సెస్, కాల్పనికేతర రచనల నుంచి 450 పదాలతో కూడిన ప్యాసేజ్‌లను ఇస్తారు. ఈ ప్యాసేజ్‌లలో దాగి ఉన్న లీగల్ ఇన్ఫర్మేషన్, సంబంధిత అంశాలపై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో మెరుగైన మార్కులు సాధించాలంటే జాతీయ - అంతర్జాతీయ స్థాయిల్లోని సమకాలీన సంఘటనలు, కళలు - సంస్కృతి, నిరంతరం ప్రాముఖ్యం ఉండే చారిత్రక ఘటనలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇందుకోసం రోజూ ఆంగ్ల దిన పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి.
- **లీగల్ రీజనింగ్:** ఇందులో 450 పదాలతో కూడిన ప్యాసేజ్‌లను ఇస్తారు. లీగల్ వ్యవహారాలతో కూడిన వాస్తవ పరిస్థితులు, చట్టపరమైన విషయాలు, పబ్లిక్ పాలసీలు, నైతిక విలువలు వంటి అంశాల నుంచి ఈ ప్యాసేజ్‌లను అడుగుతారు. ఈ ప్యాసేజ్‌లను చదివి వాటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలను రాయాలి. సమకాలీన న్యాయ సూత్రాలు, నైతిక విలువలపై సాధారణ అవగాహన ఉంటే ఈ ప్రశ్నలకు జవాబులివ్వడం సులభమే. ఇచ్చిన ప్యాసేజ్‌లలోని రూల్స్, ప్రిన్సిపల్స్ స్వరూపం, పరిస్థితులకనుగుణంగా వాటిని ఏ విధంగా అన్వయిస్తున్నారు, వీటిల్లో సవరించిన మార్పులు వాస్తవ పరిస్థితులను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే నేపథ్యంలోంచి ప్రశ్నలు అడుగుతారు. అంటే అభ్యర్థుల్లో న్యాయపరమైన దృక్పథాన్ని, ఒక అంశం, వివాదం పట్ల సహేతుక ఆలోచన, నిర్ణయం వెలిబుచ్చే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. చట్టాలు, న్యాయవ్యవస్థకు సంబంధించి ఇటీవలి పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా ఇందులో మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.
- **లాజికల్ రీజనింగ్:** అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం. ఇందులో 300 పదాలతో కూడిన ప్యాసేజ్‌లను ఇస్తారు. ఈ ప్యాసేజ్‌లను చదివి వాటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలను రాయాలి. ముఖ్యంగా సందర్భానుసారం సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరిస్తారో తెలుసుకునేందుకు ఈ విభాగంలో ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో ఇచ్చిన ప్యాసేజ్‌లోని వైరుధ్యాలు, వివిధ వాదనలు, వాటి మధ్య సంబంధం, ముగింపులను గుర్తించడం వాటిని విమర్శనాత్మకంగా విశ్లేషించడం, దాన్ని కొత్త పరిస్థితులు / మారుతున్న కాలానికనుగుణంగా అన్వయించడం వంటి అంశాలాధారంగా ప్రశ్నలు అడుగుతారు.
- **క్వాంటిటేటివ్ టెక్నిక్స్:** ఇందులో సెట్స్, గ్రాఫ్స్, డయాగ్రామ్స్, న్యూమరికల్ ఇన్ఫర్మేషన్ వంటి అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన చిత్రాలు / డేటాలోని సమాచారాన్ని అవగాహన చేసుకుంటూ వాటికి మ్యాథమెటిక్స్‌లోని సూత్రాలను అన్వయిస్తూ సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే మ్యాథమెటిక్స్‌లో ప్రాథమిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. కాబట్టి 6 - 10వ తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాల్లోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి. సూత్రాలను, ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ క్రమంలో నిష్పత్తులు, శాతాలు, ప్రాథమిక బీజ గణితం, మెన్సురేషన్, సాంఖ్యకశాస్త్రం వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

## పరీక్ష విధానం

- **అండర్‌గ్రాడ్యుయేషన్:** ఈ విభాగం కోసం రాత పరీక్షలో కొన్ని మార్పులు చేశారు. గతంలో 200 మార్కులకు 200 ప్రశ్నలు ఇచ్చేవారు. నూతన విధానంలో ప్రశ్నల సంఖ్యను 150కి తగ్గించారు. ఇదే క్రమంలో పరీక్ష కూడా 150 మార్కులకే ఉంటుంది. ఇందులో ఇంగ్లీష్ (28 - 32 ప్రశ్నలు), కరెంట్ అఫైర్స్ - జీకే (35 - 39 ప్రశ్నలు), లీగల్ రీజనింగ్ (35 - 39 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్ (28 - 32 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ టెక్నిక్స్ (13 - 17 ప్రశ్నలు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండు గంటల్లో (120 నిమిషాలు) సమాధానాలను గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. ఆఫ్‌లైన్‌లో పరీక్షను నిర్వహిస్తారు.

## ప్లేస్‌మెంట్ తప్పనిసరి

క్లాట్ ద్వారా ప్రవేశం కల్పించే జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉంటారు. తద్వారా నాణ్యమైన బోధన లభిస్తుంది. ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) తప్పనిసరిగా ఉంటాయి. దాంతో కోర్సు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం గ్యారెంటీ అని చెప్పొచ్చు. ఉదాహరణకు హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ - రాయ్‌పూర్‌లో 2016-17లో 57 మందికి, వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యురిడికల్ సైన్సెస్ - కోల్‌కతా 2017లో 73 మందికి జాబ్ ఆఫర్స్ వచ్చాయి. బహుళజాతి సంస్థలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలు, అకౌంటింగ్ కంపెనీల్లో న్యాయశాస్త్ర పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కార్పొరేట్ లా, సైబర్ లా వంటి విభాగాలకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది.

## ముఖ్య సమాచారం

- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2020.
- పరీక్ష తేదీ: మే 10, 2020
- వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/



## కొత్త పద్ధతిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్

ఈ విభాగం రాత పరీక్షలో కూడా కొన్ని మార్పులు చేశారు. కొత్తగా సబ్జెక్టివ్ భాగాన్ని చేర్చారు. మొత్తమ్మీద రాత పరీక్షలో రెండు భాగాలు ఉంటాయి. మొదటి భాగంలో 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పేపర్ ఇస్తారు. ఇందులో కాన్‌స్టిట్యూషన్ లా, జ్యురిస్‌ప్రుడెన్స్, లా సబ్జెక్టులు (క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్ తదితరాలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. రెండో భాగం డిస్క్రిప్టివ్. ఇందులో ఏవైనా రెండు ప్రశ్నలకు 800 పదాలకు మించకుండా సమాధానాలను రాయాలి. ప్రతి ప్రశ్నకు 25 మార్కులు. లా, సమకాలీన సంఘటనలపై ఈ ప్రశ్నలు ఇస్తారు. అయితే ఆబ్జెక్టివ్ పేపర్‌లో నిర్దేశించిన మార్కులు పొందిన అభ్యర్థుల డిస్క్రిప్టివ్ భాగాన్ని మాత్రమే మూల్యాంకనం చేస్తారు. ఈ క్రమంలో ఎస్సీ / ఎస్టీ / పీడబ్ల్యూడీ అభ్యర్థులు 35 శాతం, మిగతా వారు 40 శాతం మార్కులను సాధించాల్సి ఉంటుంది. ఈ పేపర్‌లోని రెండు భాగాలకు కలిపి రెండు గంటల్లో (120 నిమిషాలు) సమాధానాలను గుర్తించాలి.

# జాబ్ కార్నర్

## ఏపీ హైకోర్టులో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పలు పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **111**
- పోస్టుల వారీగా ఖాళీలు: ఆఫీస్ సబార్డినేట్ - 100, డ్రైవర్లు - 11.
- అర్హత: ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఏడో తరగతి / తత్సమాన ఉత్తీర్ణత, పదో తరగతి ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రైవర్ పోస్టులకు తెలుగు / ఇంగ్లీష్ / హిందీ / ఉర్దూ చదవడం, రాయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం ఉండాలి.
- వయసు: 18 - 34 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2020 నాటికి).
- ఎంపిక విధానం: ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు 50 మార్కులకు నిర్వహించే ఓరల్ ఇంటర్వ్యూ ద్వారా, డ్రైవర్ పోస్టులకు 50 మార్కులకు ఉండే స్కిల్ (డ్రైవింగ్) టెస్ట్, ఓరల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్లను జత చేసి నిర్దేశిత చిరునామాకు పంపాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 20, 2020
- చిరునామా: ది రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్), హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నెలపాడు, అమరావతి, గుంటూరు జిల్లా - 522237.
- వెబ్‌సైట్: http://hc.ap.nic.in/

## మేనేజర్

ఎక్స్‌పోర్ట్ - ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **22**
- భర్తీ చేసే పోస్టులు: చీఫ్ మేనేజర్, మేనేజర్, డిప్యూటీ మేనేజర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తదితరాలు.
- అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ / బీటెక్, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- రాత పరీక్ష తేదీ: మార్చి 15, 2020.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: ఫిబ్రవరి 7, 2020.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22, 2020.
- వెబ్‌సైట్: www.eximbankindia.in

**తెలుసుకుందాం!**



## జైలును చూసొద్దామా!

అండమాన్ నికొబార్ దీవుల రాజధాని పోర్టుబ్లెయిర్‌లో ఉందీ సెల్యులార్ జైలు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయులను ఈ జైలులో బంధించేవారు. చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాల్సిన ఖైదీలను బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడికి తరలించేది. అలా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఎంతోమంది భారతీయులను ఇందులో బంధించింది. వినాయక్ దామోదర్ సావర్కర్, యోగేశ్వర్ శుక్లా, బటుకేశ్వర్ దత్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు ఈ జైలులో బంధీలుగా ఉన్నారు. ఈ జైలును అండమాన్‌లో నిర్మించడానికి కారణం ఇక్కడ నుంచి తప్పించుకుని పారిపోవడానికి అవకాశం అసలు లేకపోవడం. అందుకే బ్రిటిష్ పాలకులు ఇక్కడ మూడు అంతస్తుల్లో దీన్ని నిర్మించారు. ఇందులో ఖైదీల కోసం ఉద్దేశించిన 696 గదులు ఉన్నాయి. బ్రిటిష్ పాలకులు ఇక్కడి ఖైదీలను తమ ఇళ్ల నిర్మాణ పనుల కోసం తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఈ జైలు దర్శనీయ స్థలాల్లో ఒకటి. దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఈ జైలును సందర్శించడానికి వస్తున్నారు.

## పోలికలు కనిపెట్టండి

ఇక్కడ తొమ్మిది బొమ్మలు ఉన్నాయి. వీటిలో ప్రతి మూడు బొమ్మల మధ్య అడ్డం, నిలువు, ఐ మూలగా ఉన్న పోలికలు కనిపెట్టండి.



## బొమ్మ గీయండి



## దాగుడు మూతలు

కింది బొమ్మలో ఈ వస్తువులు దాగున్నాయి. వాటిని గుర్తించండి.
1. పెయింట్ బ్రష్ 2. స్కేలు 3. వికెట్లు 4. బ్యాగు 5. బెలూన్ 6. జల్లెడ



## 5 తేడాలు గుర్తించండి



## డైలీ సుడోకు - 268

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 6 | 3 | | 9 | | |
| | | | | | 4 | 7 | | 3 |
| 1 | | | | | 7 | | 6 | |
| | 8 | 7 | 5 | | | 2 | | |
| 4 | | 2 | | | | 3 | | 5 |
| | | 6 | | | 2 | 8 | 7 | |
| | 7 | | 2 | | | | | 4 |
| 8 | | 1 | 7 | | | | | |
| | | 9 | | 8 | 1 | | | |

**సుడోకు- 267 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | 9 | 6 | 3 | 8 | 7 | 2 | 5 |
| 6 | 7 | 8 | 9 | 2 | 5 | 4 | 3 | 1 |
| 5 | 2 | 3 | 1 | 7 | 4 | 6 | 9 | 8 |
| 9 | 3 | 4 | 2 | 5 | 6 | 8 | 1 | 7 |
| 8 | 6 | 5 | 3 | 1 | 7 | 9 | 4 | 2 |
| 7 | 1 | 2 | 8 | 4 | 9 | 5 | 6 | 3 |
| 2 | 5 | 7 | 4 | 9 | 1 | 3 | 8 | 6 |
| 3 | 9 | 6 | 5 | 8 | 2 | 1 | 7 | 4 |
| 4 | 8 | 1 | 7 | 6 | 3 | 2 | 5 | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.


వెంకటేశ్

# 'నారప్ప' పోరాటాలు

వెంకటేశ్ కథానాయకుడిగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నారప్ప'. తమిళ హిట్ సినిమా 'అసురన్'కు రీమేక్ ఇది. డి.సురేశ్‌బాబు, కలైపులి ఎస్. థాను సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. ప్రస్తుతం తమిళనాడులోని కురుమలైలో పీటర్ హెయిన్స్ నేతృత్వంలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. "సినిమాలో కీలకమైన పోరాట సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం. తదనంతరం వెంకటేశ్, చిత్ర బృందం అనంతపురంలో షెడ్యూల్ కంటిన్యూ చేస్తారు. వేసవిలో సినిమాను విడుదల చేస్తాం" అని నిర్మాతలు తెలిపారు.

# దర్శకుడిగా జయ పేరును శివ నిలబెట్టాలి!

"టీజర్ చూశా. క్రైమ్ థ్రిల్లర్‌లా ఆసక్తికరంగా ఉంది. మహిళా దర్శకురాలు దివంగత బి. జయ వాళ్లబ్బాయి శివ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రమిది. దర్శకుడిగా తల్లి పేరును శివ నిలబెట్టాలి. అలాగే, తండ్రి బీఏ రాజు పేరు కూడా! సినిమా పెద్ద హిట్టవ్వాలి" అని నాగార్జున అన్నారు. రూపేశ్ కుమార్ చౌదరి, సలోనీ మిశ్రా జంటగా శివ దర్శకత్వంలో సుశీలాదేవి నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ '22'. నాగార్జున ఈ సినిమా టీజర్ విడుదల చేశారు.


రూపేశ్, నాగార్జున, శివ, నాగచైతన్య

- నాగార్జున

"నూతన దర్శకులు తొలుత ప్రేమకథ తీయాలనుకుంటారు. శివ విభిన్నంగా ఆలోచించి క్రైమ్ థ్రిల్లర్ చేశాడు. టీజర్ చూస్తుంటే అతని పరిణితి ఏంటో తెలుస్తోంది. ఇటువంటి దర్శకుడు ఇండస్ట్రీకి అవసరం" అని మారుతి అన్నారు. "కథ ప్రకారమే '22' టైటిల్ పెట్టామ"ని శివ అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో నాగచైతన్య, నిర్మాతలు కొండా కృష్ణంరాజు, బీఏ రాజు తదితరులతో పాటు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటికి తీసుకెళ్లే సినిమా ఇది - నాని

"మంచి చిత్రాన్ని ఆస్వాదించి దాని తాలూక జ్ఞాపకాల్ని ఇంటికి తీసుకెళ్లడం అరుదుగా జరుగుతుంది. మంచి జ్ఞాపకంలా ఇంటికి తీసుకెళ్లే చిత్రమిది" అని నాని అన్నారు. శర్వానంద్, సమంత జంటగా నటించిన చిత్రం 'జాను'. సి. ప్రేమ్ కుమార్ దర్శకుడు. 'దిల్' రాజు, శిరీశ్ నిర్మాతలు. ఈ నెల 7న విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. నాని, వంశీ పైడిపల్లి బిగ్ సీడీని ఆవిష్కరించారు. నాని మాట్లాడుతూ "'96' రీమేక్ అనగానే 'టచ్ చేయకపోతే మంచిద'ని రాజుకి చెప్పా. ట్రైలర్ చూశాక మైండ్‌లో '96' డిలీట్ అయిపోయింది. ఇప్పుడు రామ్, జాను అంటే శర్వా, సమంతే గుర్తొస్తున్నారు" అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ "తమిళ వెర్షన్ చూసినప్పుడు నా గుండె బరువెక్కి రీమేక్ చేయాలనుకున్నా. జాను పాత్రలో సమంతని తప్ప మరొకరిని ఊహించుకోలేకపోయా. సినిమా చూశాక అందరూ 'వావ్' అంటూ, అదే హ్యాంగోవర్‌లో ఉండిపోతారు" అన్నారు. "మాతృక చూసినప్పుడు క్లాసిక్ సినిమా రీమేక్ జోలికి మనం వెళ్లాలా? అనుకున్నా. 'దిల్' రాజు 'నన్ను నమ్ము' అని భరోసా ఇచ్చారు. ఆరు నుండి 90 ఏళ్ల వరకు అందరికీ కనెక్ట్ అవుతుందీ సినిమా" అని శర్వానంద్ చెప్పారు. "దిల్ రాజు ఈ సినిమాలో యాక్ట్ చేయమని అడగ్గానే పారిపోయాను. రెండోసారి అడిగి ఒప్పించారు. నా నటనకు క్రెడిట్ దక్కితే దానికి శర్వానంద్ కారణం అవుతాడు" అని సమంత అన్నారు.


'దిల్' రాజు, శర్వానంద్, సమంత, నాని, శిరీశ్

# లెక్కలు తేల్చడానికి!

'నా తిక్కేంటో చూపిస్తా... అందరి లెక్కలూ తేలుస్తా' అంటూ పవన్‌కల్యాణ్ మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. 2012లో పవన్- హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'గబ్బర్‌సింగ్' బ్లాక్‌బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే! తన అభిమాన హీరోని అభిమానులంతా మెచ్చేలా చూపించారు హరీశ్ శంకర్. అప్పటి నుంచి వీరిద్దరి కలయిక మళ్లీ ఎప్పుడు సాధ్యపడుతుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆ తరుణం రానే వచ్చింది. పవన్-హరీశ్ కలయికలో ఓ సినిమాకు శ్రీకారం చుట్టింది మైత్రీ మూవీమేకర్స్ సంస్థ. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. త్వరలో ఇతర వివరాలను వెల్లడిస్తామని నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది.


హరీశ్ శంకర్


పవన్ కల్యాణ్

# లవర్స్ డేకి లోకల్ బాయ్


ధనుశ్

ధనుశ్, మెహరీన్, స్నేహ హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా 'పటాస్'. ఆర్ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. ఈ చిత్రాన్ని జగన్మోహిని సమర్పణలో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత సీహెచ్ సతీశ్‌కుమార్ 'లోకల్ బాయ్'గా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. లవర్స్ డే సందర్భంగా ఈ నెల 14న విడుదల కానుంది. "మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. తమిళంలో సంక్రాంతికి విడుదలై మంచి వసూళ్లు రాబట్టింది. నవీన్ చంద్ర నెగిటివ్ రోల్ చేశారు. నాజర్ కీలక పాత్ర చేశారు. తెలుగు ప్రేక్షకులనూ సినిమా ఆకట్టుకుంటుంది" అని సతీశ్‌కుమార్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్-మెర్విన్.

# వర్మ చిత్రం... 'దిశ' హత్యాచార ఘటనపై!

నిర్భయ, దిశ ఘటనల ఆధారంగా 'దిశ' చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు దర్శకుడు, నిర్మాత రామ్‌గోపాల్ వర్మ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. దిశ నిందితుల్లో ఒకరైన చెన్నకేశవులు భార్య రేణుకతో మాట్లాడుతున్న ఫొటోను ఆయన ట్వీట్ చేశారు. ఇంకా వర్మ మాట్లాడుతూ "దిశను రేపిస్టులు ఎందుకు చంపారు? వాళ్ల ఆలోచనా విధానం ఏమిటి? అనేది చిత్రంలో చూపించబోతున్నా. నిర్భయ రేపిస్టులు అమ్మాయిని ఊపిరితో వదిలేయడంతో పోలీసులు వాళ్లను పట్టుకోగలిగారు. అటువంటి తప్పును దిశ రేపిస్టులు చేయాలనుకోలేదు. అందుకని, పెట్రోల్ పోసి అమ్మాయిని తగలబెట్టారు. రేపిస్టులు గతంలో పట్టుబడిన వారి తప్పుల నుండి పాఠాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు తప్ప అత్యాచారాలను ఆపేయాలని అనుకోవడం లేదు. 'దిశ' చిత్రం మనందరిని భయపెట్టే పాఠం అవుతుంది. మన దేశంలో సంవత్సరాలుగా ఏపీ సింగ్ (నిర్భయ దోషుల తరపున వ్యాదిస్తున్న న్యాయవాది) వంటి న్యాయవాదులు మన కోర్టులతో ఎలా ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారనే నిజాన్ని 'దిశ' సినిమా రేప్ చేస్తుంది. నేను రేణుకను కలిశా. చెన్నకేశవులను 16 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకుంది. 17 ఏళ్ల వయసులో ఓ బిడ్డకు జన్మ ఇవ్వబోతోంది. దిశను మాత్రమే కాదు... సొంత భార్యనూ చెన్నకేశవులు బాధితురాల్ని చేశాడు. అమ్మాయికి, పుట్టబోయే బిడ్డకు భవిష్యత్తు లేకుండా చేశాడు" అన్నారు.




'తలైవి'లో జయలలితగా కంగనా రనౌత్

# అమ్మాయిలు మర్డర్ చేశారా?

నలుగురు అమ్మాయిలు గోవా వెళ్లారు. అక్కడో అబ్బాయిని కలిశారు. తర్వాత ఏం జరిగింది? గోవాలో ఓ బీచ్‌లో పోలీసులకు దొరికిన శవానికీ, ఈ అమ్మాయిలకు సంబంధం ఏంటి? వాళ్లు మర్డర్ చేశారా? అనేది వెండితెరపై చూడమంటున్నారు దర్శకుడు బాలు అడుసుమిల్లి. ధన్యా బాలకృష్ణ, త్రిధా చౌదరి, సిద్ధీ ఇద్నాని, కోమలీ ప్రసాద్ ముఖ్య తారలుగా హిమబిందు వెలగపూడి, వేగి శ్రీనివాస్ నిర్మించిన చిత్రం 'అనుకున్నది ఒక్కటి అయినది ఒక్కటి'. ఈ నెలలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "న్యూ ఏజ్ చిత్రమిది. ప్రచార చిత్రాలకు అద్భుత స్పందన లభిస్తోంది. తొలుత ఈ నెల 7న చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నాం. నిర్మాణానంతర కార్యక్రమాలు ఆలస్యం కావడం, ఇతర సాంకేతిక సమస్యల వలన వాయిదా వేశాం. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. రఘుబాబు, హిమజ, రఘు కారుమంచి, సమీర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బాడిస, సహ నిర్మాతలు: రఘురామ్ యరుకుండ, నేహా మురళీకృష్ణ.


త్రిధా చౌదరి, సిద్ధీ ఇద్నాని, ధన్యా బాలకృష్ణ, కోమలీ ప్రసాద్

# పైసా వసూల్ సినిమా

- అనిల్ కుమార్


సుధీర్, రామ్‌ప్రసాద్, శ్రీను

'సుడిగాలి' సుధీర్, 'గెటప్' శ్రీను, రామ్‌ప్రసాద్ హీరోలుగా నటించిన చిత్రం 'త్రీ మంకీస్'. కారుణ్య చౌదరి కథానాయిక. అనిల్ కుమార్ దర్శకుడు. జి.నగేష్ నిర్మాత. ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "హాస్యంతోపాటు అన్ని అంశాలూ ఉన్న సినిమా ఇది. సుధీర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, శ్రీను అప్ కమింగ్ డైరెక్టర్‌గా, రాంప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కనిపిస్తారు. హీరోయిన్ కారుణ్య సన్నీలియోన్ తరహాలో అలరిస్తుంది. పక్కా పైసా వసూల్ సినిమా ఇది" అని అన్నారు. "పూర్తిగా వినోదాన్ని పంచే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత చెప్పారు.

# హీరో వెడ్స్ డాక్టర్

యువహీరో నిఖిల్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నారు. భీమవరానికి చెందిన డాక్టర్ పల్లవితో నిఖిల్ ఐదేళ్లగా ప్రేమలో ఉన్నారు. గోవాలో పల్లవికి తన ప్రేమను వ్యక్తం చేశారు నిఖిల్. అదే ప్రాంతంలో పెద్దల సమక్షంలో శనివారం నిశ్చితార్థం చేసుకున్నారీ జంట. ఏప్రిల్ 16న వీరిద్దరూ వివాహబంధంతో ఒకటి కానున్నారు.


నిఖిల్


పల్లవితో...

# యథార్థ పాత్రల ప్రేరణతో..

'విభిన్న మనస్తత్వాలు కలిగిన ఆనందిని, భైరవి అనే ఇద్దరు యువతుల కథ ఇది. అంజలి, లక్ష్మీరాయ్ ఈ పాత్రల కోసం ప్రత్యేకశ్రద్ధ తీసుకొని నటిస్తున్నారు. ప్రత్యేక శిక్షణతో చాలా స్లిమ్‌గా తయారయ్యారు. ఇలా కష్టపడే కథానాయికలు మా చిత్రానికి దొరకడం చాలా గర్వంగా ఉంది' అన్నారు దర్శకుడు కర్రి బాలాజీ. అరుణ్ అదిత్ ముఖ్య పాత్ర పోషిస్తున్న 'ఆనందభైరవి' చిత్రాన్ని ఎంవీవీ సత్యనారాయణ సమర్పణలో బి.తిరుపతిరెడ్డి, రమేశ్‌రెడ్డి ఇటికేల నిర్మిస్తున్నారు. 'ఇప్పటివరకూ హైదరాబాద్, వైజాగ్‌లో జరిగిన షూటింగ్‌తో యాభై శాతం చిత్రం పూర్తయింది. తదుపరి హైదరాబాద్, చెన్నైలో ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పార్ట్ పూర్తవుతుంది. సమాజంలోని ఎన్నో యథార్థ పాత్రలు మా చిత్రంలో కనిపిస్తాయి. వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. లక్ష్మీరాయ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ముంబైలో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నా' అని తెలిపారు.


లక్ష్మీరాయ్

# ఉత్కంఠ... విరామం

సంజయ్ వర్మ, గరీమా సింగ్, నవీన్ నేని, పునర్నవి భూపాలం ముఖ్య తారలుగా మూన్‌వాక్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సందీప్ చేగురి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఒక చిన్న విరామం'. ఫిబ్రవరి 14న విడుదల కానుంది. సందీప్ చేగురి మాట్లాడుతూ "ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. రోడ్ జర్నీ నేపథ్యంలో విభిన్న కథాంశంతో రూపొందింది" అన్నారు. "బిగ్‌బాస్ తర్వాత మంచి కాన్సెప్ట్ ఉన్న సినిమా చేశా" అని పునర్నవి భూపాలం అన్నారు. ఈ చిత్రానికి భరత్ మాచిరాజు సంగీత దర్శకుడు.


నవీన్ నేని, పునర్నవి






మారాలి జగన్

# మారకపోతే భారీ మూల్యమే



- కక్షసాధింపు మంచి విధానం కాదు
- దానివల్ల దేశానికీ ఎంతగానో నష్టం
- మదుపరులకు తప్పుడు సంకేతాలు
- బ్యాంకులూ వెనక్కి వెళ్లిపోతున్నాయి
- జగన్ రీతిపై జాతీయ పత్రికల వ్యాఖ్యలు
- ఆయా సందర్భాల్లో సంపాదకీయాలు
- చంద్రబాబుతో సమన్వయానికి సూచన
- తండ్రి నుంచి నేర్చుకోవాలని హితవు

పార్లమెంటులో ఏకంగా 22 మంది ఎంపీలు! కొత్తగా జాతీయ సలహాదారు పోస్టు సహా డజనుకుపైగా అలాంటి పదవులే ఢిల్లీలోనూ, రాష్ట్రంలోనూ! అయినా, జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పడిపోవడమేగానీ నిలబడుతున్నట్టు కనిపించడం లేదు. జాతీయమీడియాలో వస్తున్న వార్తలు, ఆంగ్ల పత్రికల సంపాదకీయ వ్యాఖ్యలు...జగన్ పాలనపై వీలు దొరికినప్పుడల్లా ధ్వజమెత్తుతూనే ఉన్నాయి. ఎనిమిదినెలల క్రితం అధికారంలోకి వచ్చి, తొలి అడుగుగా ప్రజావేదికను కూల్చిన నాటినుంచీ తాజాగా రాజధాని మార్పు దాకా ముఖ్యమంత్రి జగన్ తీసుకొంటున్న ప్రతి చర్యా వాటి కన్నెర్రకు గురవుతూనే ఉంది. 'రివర్స్' టెండరింగ్ విధానాన్ని ఆ పత్రిక ఈ పత్రిక అని లేకుండా అన్ని మాధ్యమాలు తూర్పారబట్టాయి. జగన్ కక్షసాధింపు వైఖరి.

మూడు రాజధానుల నిర్ణయంతో పరాకాష్ఠను అందుకొన్నదని తమ సంపాదకీయాల్లో ఆందోళనను వెలిబుచ్చాయి. బ్లూంబర్గ్ వంటి అమెరికా పత్రికలు సైతం విద్యుత్ ప్రాజెక్టులు, రాజధాని నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీస్తోందని విమర్శించింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమన్వయం చేసుకొంటూ, ఆయన ఐదేళ్లలో తలపెట్టిన ప్రాజెక్టులను, నిర్ణయాలను పూర్తిచేయడం రాష్ట్రానికే కాదు.. దేశ ప్రయోజనాలకూ మేలు చేస్తుందని ముక్తకంఠం వినిపించాయి. ఈ విషయంలో 'మీ తండ్రి నుంచి నేర్చుకోండి' అని ముక్తాయించాయి.





**మూడు సరికాదు**

"మూడు రాజధానులు సరైన నిర్ణయం కాదు. భారతదేశానికి అమరావతి వంటి గ్రీన్‌ఫీల్డ్ రాజధాని అవసరం" - శేఖర్ గుప్తా



**ప్రతీదీ రద్దే**

"ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకం. తెలుగునాడును ఇంగ్లీషు నాడుగా మారుస్తున్నారు. జగన్ సర్కార్ పాలనలో రద్దుల పర్వమే కొనసాగుతోంది" - సచ్చిదానందమూర్తి, ద వీక్ సహ సంపాదకుడు

### ● టైమ్స్ ఆఫ్ ఇండియా

"రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కులను ఉపయోగించుకుని శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న చంద్రబాబును అరెస్టు చేయడం పూర్తిగా అనవసరం. ఈ ఘర్షణాయుత రాజకీయాల వల్ల రాష్ట్రం దెబ్బతింటుంది. కక్షసాధింపే జగన్ ప్రధాన దృష్టిగా కనిపిస్తోంది. చంద్రబాబు మేధోజనితమైన అమరావతి ఇప్పుడు దయ్యాల నగరంగా మారే ప్రమాదం ఉన్నది. జగన్ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకుండా కేవలం సంక్షేమ కార్యక్రమాలే అమలు చేస్తే ఖజానా గుల్ల అవుతుంది. చంద్రబాబుతో సత్సంబంధాలు పెట్టుకుని రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేంద్రంగా మార్చాలనుకున్న ఆయన అసంపూర్ణ కలను జగన్ నెరవేర్చాలి"

**(2019 సెప్టెంబర్ 12 సంపాదకీయం)**

"తరచూ విధాన నిర్ణయాలు మార్చడం వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతింటుంది. అమరావతి ప్రాజెక్టు విజయవంతం అయితే దేశవ్యాప్తంగా నగరాల నిర్మాణానికి రైతులు ముందుకు వచ్చేందుకు దోహదం ఏర్పడేది. అమరావతిలో జగన్ నిర్మాణాలను పూర్తి చేయాలి. వాటిని అసంపూర్తిగా ఆయన మిగల్చరాదు. ఇది దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలు పంపిస్తుంది" **(2020 జనవరి 20 సంపాదకీయం)**

### ● ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్

"చంద్రబాబు వారసత్వాన్ని జగన్ చెరిపివేసే బదులు సుపరిపాలనా ఎజెండాను అమలు చేయాలి. విద్యుత్ ప్రాజెక్టుల రద్దు, పోలవరం ప్రాజెక్టు రివర్స్ టెండరింగ్, అమరావతి లో నిర్మాణాలను వందరోజుల్లోనే నిలిపివేయడం దారుణం. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వెనక్కు వెళ్లడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి మంచి పరిణామం కాదు"

**(2019 సెప్టెంబర్ 13 సంపాదకీయం)**

"జగన్ మద్య అమ్మకం విధానం వల్ల రాష్ట్ర ఖజానాపై భారం పడుతుంది. మద్యం కొరతగా మారినంత మాత్రాన ప్రజలు మద్యానికి బానిసలు కాకుండా పోరు. దీని వల్ల చీప్ లిక్కర్ వినియోగం పెరుగుతుంది"

**(2019 నవంబర్ 25 సంపాదకీయం)**

"అమరావతి ఆలోచనను నిర్వీర్యం చేయాలన్నదే సీఎం జగన్ ఉద్దేశమైతే అది అసమర్థ నిర్ణయం అవుతుంది. అందుకు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. మూడు రాజధానుల మధ్య వందలాది కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీని వల్ల రోజువారీ కార్యకలాపాలు దుర్భరంగా మారుతాయి" **(2020 జనవరి 23 సంపాదకీయం)**

### ● ఎకనమిక్ టైమ్స్

"జగన్ ప్రభుత్వానిది తిరోగామ దృక్పథం. అమరావతి ప్రాజెక్టును రద్దు చేయడం దేశంలో పట్టణాభివృద్ధిని దెబ్బతీసే విధానం. ఇంకా యువకుడైన జగన్ తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్‌లో చంద్రబాబు చేపట్టిన ఐటీ హబ్ ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ఎలా ఉండేదో అర్థం చేసుకోవాలి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి చేపట్టిన యమునా ఎక్స్‌ప్రెస్ వే వంటి ప్రాజెక్టులను అఖిలేశ్ ఎలా పూర్తి చేశారో తెలుసుకోవాలి. ఒక వినూత్న పద్ధతిలో భూసేకరణ జరిపిన చంద్రబాబు కృషిని కొనసాగించి అమరావతి రాజధాని నగరం దేశానికే ఆదర్శంగా మార్చి ఉండాల్సింది. జగన్ విధ్వంసక పంథాలో సాగుతున్నారు. చంద్రబాబు నిర్మించిన అధునాతన కన్వెన్షన్ సెంటర్ సహా రూ. 50వేల ప్రాజెక్టులను నిలిపివేశారు. ఇది చెత్త రాజకీయం"

**(2019 నవంబర్ 15 సంపాదకీయం)**

"మౌలికసదుపాయాల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం క్రియాశీలక పాత్ర పోషించాలి. విద్యుత్ ప్రాజెక్టుల రద్దు, అమరావతి ప్రాజెక్టు రద్దు వంటి అవివేకమైన నిర్ణయాలు జగన్ సర్కార్ అమలు చేయకుండా జోక్యం చేసుకోవాలి"

**(2019 సెప్టెంబర్ 3 సంపాదకీయం)**

"ఆంధ్రా సీఎం.. అమరావతిని చంపొద్దు. రాజకీయ కక్ష సాధింపుకోసం రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీయవద్దు. దేశంలో పెట్టుబడుల వాతావరణానికి హాని కలిగించవద్దు. దేశంలో అభివృద్ధికి కేంద్రాలుగా కొత్త నగరాలు ఏర్పడాలి. అలా ఏర్పడుతున్న ఒక నగరాన్ని వధించడం క్షమించరాని, బాధ్యత రహితమైన చర్య"

**(2019 సెప్టెంబర్ 12 సంపాదకీయం)**

"ఉద్యోగాలను స్థానికులకే రిజర్వు చేయడమనేది ఘోరమైన ఆలోచన. ఒకే భారత దేశం..ఒకే మార్కెట్ ఉండాలన్న ఉద్దేశంతోనే జీఎస్టీని ప్రవేశపెట్టారు. కానీ జగన్ సర్కార్ ఈ ఆలోచనను చంపేసింది. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వ ప్రాతిపదికను కూడా ఈ నిర్ణయం కాలరాచింది. ఇది ఒక ప్రమాదకరమైన నిర్ణయం"

**(2019 జూలై 24 సంపాదకీయం)**

### ● బిజినెస్ స్టాండర్డ్

జగన్ తన చపలచిత్త స్వభావం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గండి కొడుతున్నారు. ఇంధన ప్రాజెక్టులను రద్దు చేయడం అంతర్జాతీయంగా వివాదాలకు కారణమవుతుంది.

**(2019 నవంబర్ 26 సంపాదకీయం)**

"నిర్మాణమవుతున్న రాజధాని ప్రాజెక్టును రద్దు చేసి మూడు రాజధానులను ప్రకటించడంలో ఎలాంటి హేతుబద్ధత లేదు. దీని వల్ల మూడు రాజధానుల చుట్టూ తిరగడానికి ప్రజలకు భారీ ప్రయాణ ఖర్చులు భరించాల్సి వస్తుంది. సమగ్రాభివృద్ధి దెబ్బతింటుంది. రియల్‌ఎస్టేట్ ప్రయోజనాలు నెరవేరడం మినహా జరిగేది ఏమీ లేదు. ఇప్పటివరకూ జగన్ తీసుకున్న నిర్ణయాలన్ని పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసేవే. రైతులకు జరిగిన నష్టాన్ని, పరిహారాన్ని జగన్ ఎలా చెల్లిస్తారు? చంద్రబాబు హయాంలో నిర్మించిన భవనాల కూల్చివేత వంటి చర్యలు వ్యాపార సంస్థలను నిరుత్సాహపరుస్తాయి" **(2020 జనవరి 24 సంపాదకీయం)**

### ● ద టెలిగ్రాఫ్

"ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీడియాకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. వాటిపై కేసులు పెట్టేందుకు అధికారులను ప్రోత్సహించడం సరైంది కాదు. ఇప్పటికే అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ సూచికల్లో దేశం ఎంతో వెనుకబడి ఉంది. నియంతృత్వ పోకడలను వెంటనే మానుకోవాలి"

**(2019 నవంబర్ 15 సంపాదకీయం)**

### ● ద హిందూస్థాన్ టైమ్స్

"రాజకీయ కారణాలతో అమరావతి ప్రాజెక్టుపై శీతకన్ను వేయడం సరైంది కాదు. భారీ ఎత్తున ప్రజాధనం వృధా అయ్యేందుకు జగన్ బాధ్యత వహించాలి. అమరావతి కోసం సేకరించిన భూమి ఏమవుతుందో చెప్పాలి. తన వ్యక్తిగత ఆకాంక్షలకోసం ప్రజా ప్రయోజనాలను దెబ్బతీయరాదు"

**(2019 సెప్టెంబర్ 12 సంపాదకీయం)**

### ● బ్లూంబర్గ్ (అమెరికా)

"లక్షలాది కోట్ల మేరకు పెట్టుబడులతో సాగుతున్న విద్యుత్ ప్రాజెక్టులు, అమరావతి ప్రాజెక్టులను రద్దు చేసి, పోలవరం రీటెండరింగ్‌కు వెళ్లడం ఆంధ్రప్రదేశ్ లోనే కాదు, మొత్తం దేశంలోనే పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీస్తుంది"

**(2019 నవంబర్ 27 సంపాదకీయం)**

### ● ద హిందూ

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న అవకతవక నిర్ణయాలు తప్పుడు సంకేతాలు పంపిస్తున్నాయి. వొడాఫోన్ సంస్థ దేశంలో కొనసాగడం కష్టమైంది. సింగపూర్ కన్సార్టియం అమరావతి నుంచి వెనక్కు వెళ్లింది. ఇంధన ప్రాజెక్టులు ఉనికి కోసం పోరాడుతున్నాయి"

**(2019 నవంబర్ 14 సంపాదకీయం)**

### ● ద హిందూ బిజినెస్ లైన్

"మూడు రాజధానుల ఆలోచన అమలు అంత తేలిక కాదు. రైతుల ఆందోళనను పట్టించుకోవాలి. అమరావతి దెబ్బతినకుండా చూసుకోవాలి"

**(2019 డిసెంబర్ 21 సంపాదకీయం)**

### ● ద ట్రిబ్యూన్ (చండీగఢ్)

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాన్నే లక్ష్యంగా పెట్టుకుని నిర్ణయాలు జరుగుతున్నాయి. కీలకమైన ప్రాజెక్టులను రద్దు చేయడం, చంద్రబాబును అరెస్టు చేయడం సరైంది కాదు. మూడువేల కిలోమీటర్లు ప్రయాణిస్తే ప్రయాణించొచ్చు కానీ, పరిపాలన లో మాత్రం ప్రజాస్వామ్యబద్ధంగా ప్రయాణించాలి"

–న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

# 3 రాజధానుల సభ వెలవెల

- జగన్ మెప్పు కోసం చెవిరెడ్డి పథకం
- బాబు స్వగ్రామంలో భారీసభకు స్కెచ్
- 25 వేల మందితో నిర్వహణకు నిర్ణయం
- చివరకు వందల మంది కూడా రాని వైనం
- అరగంటలోనే ప్రాంగణం ఖాళీ

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు స్వగ్రామం కూడా మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతిస్తోందని నిరూపించేందుకు వైసీపీ చేసిన ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. చిత్తూరు జిల్లాలోని ఆయన స్వగ్రామం నారావారిపల్లె వద్ద భారీ సభ నిర్వహించి.. సీఎం జగన్ మెప్పు పొందడానికి చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భారీ స్కెచ్ వేసినా ఫలితం లేకుండాపోయింది. పాతిక వేల మందితో సభ పెట్టాలని ఆయన గత కొద్దిరోజులుగా పక్కా ఏర్పాట్లు చేసుకున్నారు. సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, మరో సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వంటి జగన్ సన్నిహితులను.. జిల్లాకే చెందిన ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామిని, తిరుమల వచ్చిన మంత్రి కన్నబాబును, తోటి ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి (తిరుపతి), బియ్యపు మధుసూదన్‌రెడ్డి (శ్రీకాళహస్తి), వెంకటేగౌడ (పలమనేరు), ఆరణి శ్రీనివాసులు (చిత్తూరు), పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి (తంబళ్లపల్లె), చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మలను ఆహ్వానించారు. నారావారిపల్లె, పరిసర గ్రామాలు టీడీపీకి కంచుకోటలు కావడంతో ఇక్కడి నుంచి జనసమీకరణ సాధ్యం కాదని.. చంద్రగిరి, తిరుపతి నుంచి జనాన్ని తెచ్చే ప్రయత్నం చేశారు. స్థానికంగా అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చి డ్వాక్రా మహిళలను, గ్రామ వలంటీర్లను, సచివాలయాల సిబ్బందినీ బలవంతంగా సభకు తరలించారు. సభకు హాజరు కాని డ్వాక్రా మహిళలు రూ.200 జరిమానా కట్టాల్సి ఉంటుందని హెచ్చరికలు కూడా జారీచేశారు. విద్యార్థులను పంపడానికి విద్యా సంస్థల యాజమాన్యాలు ససేమిరా అన్నాయి. దానికి బదులుగా వాహనాలు పంపించాయి. ఈ వాహనాల్లోనే గ్రామ సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను, డ్వాక్రా మహిళలను సభకు తరలించారు. అలా తీసుకొచ్చిన వందల మందితో సభను ప్రారంభించారు. కానీ మొదలైన అరగంటకే ప్రాంగణం ఖాళీ అయిపోయింది. జనం నిష్క్రమించారు. సభ అట్టర్ ఫ్లాపయినా సలహాదార్లు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రసంగాలు కొనసాగించారు.



గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నారావారిపల్లె స్థానికుల నిరసన

**నారాయణస్వామికి అవమానం..:** ఈ సభలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి అవమానం ఎదురైంది. తన కంటే తక్కువ హోదాకు చెందిన ప్రజాప్రతినిధులు, సలహాదార్లు, అధికార ప్రముఖుల కోసం ఆయన వేదిక కింద కుర్చీ వేసుకుని అరగంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది.

### అమరావతికి మద్దతుగా గ్రామస్థుల నినాదాలు

ఆదివారం ఓ వైపు వైసీపీ నేతలు నారావారిపల్లె సమీపంలో సభ జరుపుతుండగా.. గ్రామంలో ప్రజలు.. ప్రత్యేకించి మహిళలు చంద్రబాబు ఇంటి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని అమరావతినే రాజధానిగా కొనసాగించాలని నినదించారు. శాప్ మాజీ ఛైర్మన్ పీఆర్ మోహన్ మధ్యాహ్నం నుంచీ సాయంత్రం వరకూ ఎన్టీఆర్ విగ్రహం వద్దే కూర్చుని మూడు రాజధానులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ప్రశాంతతకు పేరుపడిన తమ ప్రాంతంలో గొడవలు సృష్టించడం ఇష్టం లేదని, అందుకే శాంతియుతంగా తమ నిరసన తెలుపుతున్నామని గ్రామస్థులు మీడియాతో స్పష్టం చేశారు.

### పసుపు నీళ్లతో శుద్ధి..

వైసీపీ సభ పూర్తయ్యాక నారావారిపల్లె రహదారిపై పీఆర్ మోహన్ ఆదివారం సాయంత్రం పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారు. కాగా.. ఇటు వైసీపీ సభ, అటు గ్రామస్థుల నిరసనలతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తవచ్చని భారీగా మోహరించిన పోలీసు బలగాలు.. గ్రామస్థులు శాంతియుతంగా ఆందోళన చేపట్టడంతో ఊపిరి పీల్చుకున్నాయి.

## విద్యార్థులకు భావ స్వేచ్ఛ లేదా?

- సోనియా గతే జగన్‌కూ: అమరనాథ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనేక ఉద్యమాలకు పుట్టినిల్లు లాంటి విద్యావిద్యాలయాల్లోని విద్యార్థులకు వైసీపీ పాలనలో తమ భావాల్ని, అభిప్రాయాల్ని చెప్పుకునే హక్కు, స్వేచ్ఛ లేకుండా పోయిందని మాజీ మంత్రి ఎన్ అమరనాథరెడ్డి మండిపడ్డారు. ఏపీ రాజధానిగా అమరావతిని కొనసాగించాలని గళం విప్పిన నలుగురు నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులను సస్పెండ్ చేయడాన్ని ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నారావారిపల్లె ముందున్న ఏరంగంపేట వద్ద 3 రాజధానులకు మద్దతుగా నిర్వహించిన సభకు ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులను బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. 'మరి ఎస్వీ వర్సిటీ విద్యార్థులను సస్పెండ్ చేస్తారా? నాగార్జున వర్సిటీకి ఒక న్యాయం, ఎస్వీ వర్సిటీకి ఒక న్యాయమా?' అని నిలదీశారు. రాష్ట్ర విభజన చేసిన సోనియా గాంధీకి ప్రజలు ఏ ట్రీట్‌మెంట్ ఇచ్చారో.. రాజధానిని 3 ముక్కలు చేస్తున్న జగన్‌కు త్వరలో అదే విధంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## పింఛన్ల పేరిట జగన్ దగా

- అభాగ్యుల సొమ్ము కొట్టేస్తున్నారు: బుద్దా



అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పేరుతో జగన్ చేసిన మోసం అంతాఇంతా కాదని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. 'రూ.3వేలు ఇస్తామని, రూ.250 మాత్రమే పెంచారు. వయోపరిమితి 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తూ మొదటి సంతకం చేశారు. 8నెలలు గడుస్తున్నా, 60 ఏళ్లు నిండిన ఒక్కరికీ పెన్షన్ ఇవ్వకుండా దగా చేశారు. పైగా 7 లక్షల పెన్షన్లు ఎత్తేసి, ఇప్పుడు డోర్ డెలివరీ అంటూ మరో స్కామ్‌కు తెర తీశారు. పెన్షనర్ల కళ్లలో జగన్‌తో కారం కొట్టించి, డోర్ డెలివరీపై టీడీపీ నేతలు నిప్పులు పోసుకోవద్దని సాయిరెడ్డి వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయి. రూ.2వేల పెన్షన్ ఇవ్వడానికి వాలంటీర్ల పేరుతో రూ.50 కొట్టేస్తున్నారు. మామూళ్లు దండుకుంటున్నారు. అభాగ్యుల సొమ్మునూ కొట్టేయిస్తున్న వైసీపీ బ్యాచ్‌కి పుట్టగతులుండవు' అన్నారు.

## ఆర్థిక నేరస్థుడనే బడ్జెట్‌లో మొండిచెయ్యి

- కేసుల భయంతోనే కేంద్రాన్ని అడగట్లేదు: ఆలపాటి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి జగన్ ఆర్థిక నేర కోణం కారణంగానే రాష్ట్రానికి బడ్జెట్‌లో కేంద్రం మొండి చెయ్యి చూపించిందని మాజీ మంత్రి ఆలపాటి రాజా ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ కేంద్రాన్ని ఏమైనా అడిగితే తన కేసులపై ప్రభావం పడుతుందనే భయంతోనే సీఎం మిన్నకుండిపోయారని ఆరోపించారు. ఆర్థిక నేరస్థుడికి వ్యవస్థలపై నమ్మకం ఉండదన్న విషయం మరోసారి రుజువైందన్నారు. 'రక్తసంబంధీకులకు న్యాయం చేయలేని నీవు రాష్ట్ర ప్రజలకు ఎలాంటి న్యాయం చేస్తావు? సోదరే నీపై నమ్మకం లేదంటూ కోర్టులను ఆశ్రయించిందంటే ఇంత కంటే దిగజారుడు చర్య మరోటి ఉండదు' అన్నారు.

## పగ చుట్టూ జగన్ పాలన

- వైసీపీ నేతలకు చెప్పుల దండలు తప్పవు: కళా

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత చంద్రబాబుపై ప్రతీకారం తీ ర్చుకునే దిశగానే జగన్ పరిపాలన పరిభ్రమిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు ఆరోపించారు. చంద్రబాబు స్వ గ్రామం నారావారిపల్లెలో తలపెట్టిన వైసీపీ సభే అందుకు నిదర్శనమన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 'ఇగో, శాడిజం, రౌడీయిజంతో 3 రాజధానులను తెరపైకి తెచ్చారు. అమరావతిని చిదిమేస్తు న్న తీరు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సీమలో కుట్ర రాజకీయానికి తెరదీశారు. నారావారిపల్లెలో వైసీపీ సభ పెట్టి, అక్కడి ప్రజలను అవమానిస్తున్నారు. హైకోర్టుతో చీ వాట్లు తిన్నా జగన్ వైఖరిలో మార్పు రాలే దు. ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తున్నారు' అని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీస్ శాఖ విద్వేషాలు రెచ్చగొట్టేందుకే నారావారిపల్లె సభకు అనుమతిచ్చిందని, అమరావతికి మద్దతుగా టీడీపీ చేసే శాంతియుత నిరసనలను అణిచివేయడం పోలీస్‌శాఖ ద్వంద వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాగా, అవినీతే జీవన విధానంగా మార్చుకుని వైసీపీ నేతలు ప్రజల్ని దోచుకుతింటున్నారని రేపల్లె టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసా ద్ సీఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనాలను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు.

### వంద మంది కూడా రాలేదు: ఆనందబాబు

గుంటూరు(తూర్పు): రాష్ట్రానికి కీలక నే తలని చెప్పుకొనే సలహాదార్లు, మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు.. సభ నిర్వహిస్తే కనీసం వంద మంది జనం లేరని మాజీ మంత్రి, టీడీపీ నేత నక్కా ఆనందబాబు ఎద్దేవాచేశా రు. చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె లో వైసీపీ సభ జరిగిన తీరుపై ఆయన ఆదివారం గుంటూరులో స్పందించారు. 'ఏం చే యాలో తెలియక డ్వాక్రా మహిళలతో కానిచ్చారు. ఆ సభను చూస్తుంటే ఇంతోటి దాని కి అంత దూరం ఎందుకనే సామెత గుర్తుకు వస్తోంది' అని చెప్పారు.

## జనసేనతో ప్రయాణం... ముగిసిన అధ్యాయం

- ఇకనుంచి రైతుల సంక్షేమానికే నా ప్రయాణం
- త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటన: సీబీఐ మాజీ జేడీ

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జనసేనతో తన ప్రయాణం ముగిసిన అధ్యాయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. తన రాజీనామా లేఖను ఆ పార్టీ ఆమోదించినందున దాని గురించి వ్యాఖ్యానించాల్సిన అవసరం లేదన్నారు. ఇకనుంచి తన ప్రయాణమంతా రైతుల కోసం సాగుతుందన్నారు. ఆదివారం విజయవాడలోని వెస్టిన్ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని చెప్పారు. యువతరాన్ని వ్యవసాయం వైపు మళ్లించాలన్నారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరతానన్న విషయం త్వరలోనే మీడియాకు వెల్లడిస్తానని చెప్పారు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాలు మాత్రమే మార్గమని అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వ్యవసాయానికి కేటాయింపులు బాగున్నాయని ప్రశంసించారు.

## 'సుప్రీం' జడ్జిల చేతుల్లో అమరావతి భూములు?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె వద్ద మూడు రాజధానులకు మద్దతుగా వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి కన్నబాబు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అమరావతి ప్రాంతంలోని ఆ 29 గ్రామాల రైతులు బాగుపడితే చాలా అని కల్లం ప్రశ్నించారు. రాజధానికి సమీకరించిన భూముల్లో అధికశాతం ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని.. తమవారితో భూములు కొనిపించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని చంద్రబాబుపై పరోక్ష విమర్శలు చేశారు. 'రాయలసీమలో తాగునీటికి, పొట్టకూటికి జనం ఏడుస్తుంటే అమరావతిలో కొందరు రూ.కోట్లు పోయాయని ఏడుస్తున్నారు. అమరావతిలోనే రైతులున్నారా.. విశాఖ, కర్నూలు జిల్లాల్లో లేరా? హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఘనత తనదని చంద్రబాబు చెప్పుకొంటున్నారు. నిజానికి సంబంధిత ఎస్ఈజెడ్ పాలసీ తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అయితే.. ప్రమోట్ చేసింది పీవీ నరసింహారావు.. భూములు కేటాయించింది, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది నేదురుమల్లి జనార్దన్ రెడ్డి. చంద్రబాబు అనుయాయులు చేసిందల్లా చుట్టూ భూములు కొని బాగుపడడమే! రాజధాని రాష్ట్రం మధ్యలో ఉండాలని ఎవరు చెప్పారు? తమిళనాడు, మహారాష్ట్ర రాజధానులు, దేశ రాజధాని ఢిల్లీ, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల రాజధానులు ఓ చివరన లేవా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూడకుండా లక్షల కోట్లు పెట్టి రాజధానిని అభివృద్ధి చేయాలంటే ఎలా? టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రాన్ని ఆర్థికంగా భ్రష్టు పట్టించే పోయారు. గత ఐదేళ్ల పాలన ముగిసే సరికి రూ.65 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టారు. రూ.3 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారు. శ్రీబాగ్ ఒప్పందానికి అనుగుణంగానే సీఎం జగన్ మూడు ప్రాంతాల అభివృద్ధికి నిర్ణయించారు. దానికి ప్రజలు మద్దతివ్వాలి' అని కోరారు. అమరావతిని నిర్మించడం ఎంత కష్టమో.. దాన్ని నిలుపుకోవడం కూడా అంతే కష్టమని సజ్జల అన్నారు. అక్కడ దళితులు, రైతుల భూములను మోసం చేసి లాక్కున్నారని ఆరోపించారు. అమరావతి ఆందోళనల్లో ఎస్సీ, బీసీలు లేరని, రైతులు కూడా చాలా తక్కువేనన్నారు. చంద్రబాబు అమరావతిపై చూపుతున్న ప్రేమలో కనీసం ఒక శాతం స్వగ్రామంపై చూపినా నారావారిపల్లె ఈ విధంగా ఉండేది కాదని కన్నబాబు అన్నారు. పాలన వికేంద్రీకరణ నారావారిపల్లె నుంచే ప్రారంభం కావాలని నారాయణస్వామి చెప్పారు.

ఆంధ్రజ్యోతి

# బిజినెస్

9

విజయవాడ ● సోమవారం 3 ఫిబ్రవరి 2020

andhrajyothibusiness@gmail.com

## ఆర్‌బీఐ విధానం, ఆర్థిక ఫలితాలు కీలకం

ముంబై: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో చేసిన పలు ప్రకటన ప్రభావం ఈ వారం మార్కెట్‌పై కొనసాగే అవకాశం ఉంది. వీటితో పాటు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానం, కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, కీలకమైన స్థూల ఆర్థిక గణాంకాల ప్రభావం కూడా మార్కెట్‌పై ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు నచ్చకపోవడంతో శనివారం సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు భారీ నష్టాన్ని మూటగట్టుకున్న విషయం తెలిసిందే. ఫలితంగా ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో నష్టపోయారు. బడ్జెట్ ఇన్వెస్టర్లను నిరాశకు గురి చేసిందని విశ్లేషకులంటున్నారు. కాగా గురువారంనాడు ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానాన్ని ప్రకటించనుంది. బడ్జెట్ తర్వాత వెలువడనున్న తొలి విధానం కాబట్టి దీనిపై అందరి దృష్టి ఉంది. మరోవైపు మరికొన్ని కంపెనీలు డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించాల్సి ఉంది.

# ఐటీ శ్లాబులపై తొలగని సందిగ్ధం

### రూ.13 లక్షలు దాటితే కొత్త విధానమే మేలు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఆదాయ పన్ను (ఐటీ) శ్లాబులు ఎవరికి మేలు చేకూరుస్తాయనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. వార్షిక ఆదాయం రూ.13 లక్షల కంటే ఎక్కువ ఉండి, ఏటా రూ.2 లక్షల వరకు తగ్గింపు క్లెయిమ్ చేసే ఆదాయ పన్ను చెల్లింపుదారులకు కొత్త విధానమే మేలని అధికార వర్గాలంటున్నాయి. అయితే వార్షిక ఆదాయం రూ.12 లక్షలు లేదా అంతకంటే తక్కువ ఉండి, ఏటా రూ.2 లక్షల వరకు పెట్టుబడుల తగ్గింపులు క్లెయిమ్ చేసే వారికి మాత్రం పాత విధానమే మేలని పేర్కొన్నాయి.

### ఇదీ లెక్క

అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ప్రస్తుతం మన దేశంలో 5.78 కోట్ల మంది ఐటీ చెల్లింపుదారులు ఉన్నారు. వీరిలో 5.3 కోట్ల మంది (90 శాతం) రూ.2 లక్షల కంటే తక్కువ మొత్తాన్ని తగ్గింపుగా క్లెయిమ్ చేస్తున్నారు. ప్రామాణిక తగ్గింపు, పీఎఫ్, గృహ రుణాలపై చెల్లించే వడ్డీ, ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్, జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపు వంటి వాటి ద్వారా వీరు ఈ తగ్గింపును క్లెయిమ్ చేస్తున్నారు.

### రెండు కొత్త శ్లాబులు

ఐటీ లెక్కింపునకు సంబంధించి ఇప్పటికే 10, 20, 30 శాతం శ్లాబులు అమల్లో ఉన్నాయి. వీటికి తోడు ఆర్థిక మంత్రి సీతారామన్ కొత్తగా రూ.7.5-10 లక్షల వార్షిక ఆదాయ వర్గాల కోసం 15 శాతం శ్లాబు, రూ.12.5 లక్షల నుంచి రూ.15 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారి కోసం 25 శాతం శ్లాబులను ప్రవేశపెట్టారు. వార్షిక ఆదాయం రూ.15 లక్షలు మించితే వారు 30 శాతం శ్లాబు పరిధిలోకి వస్తారు. ఎలాంటి మినహాయింపులు, తగ్గింపులు క్లెయిమ్ చేయని ఐటీ చెల్లింపుదారుల కోసం ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఈ కొత్త శ్లాబులు ప్రకటించారు.

### ఎంత మేలంటే ?

- వార్షిక ఆదాయం రూ.13 లక్షలపైన ఉండి రూ.2 లక్షల వరకు తగ్గింపులు క్లెయిమ్ చేస్తే పాత శ్లాబుల ప్రకారం రూ.1.48 లక్షలు పన్నుగా చెల్లించాలి
- మినహాయింపులు, తగ్గింపులు లేని కొత్త విధానం ఎంచుకుంటే వీరు రూ.1.43 లక్షలు ఐటీగా చెల్లిస్తే సరిపోతుంది. అంటే పన్ను పోటు రూ.5,200 తగ్గుతుంది
- అదే రూ.2 లక్షల తగ్గింపు క్లెయిమ్‌తో వార్షిక ఆదాయం రూ.14 లక్షలు మించితే రూ.10,400, రూ.15 లక్షలు మించితే రూ.15,600 ఆదా అవుతాయి
- రూ.50,000 ప్రామాణిక తగ్గింపు లేని నాన్-శాలరీ వ్యక్తుల వార్షిక ఆదాయం రూ.9.5 లక్షలు ఉండి రూ.1.5 లక్షల పెట్టుబడుల తగ్గింపు ఎంచుకుంటే వార్షిక పన్ను చెల్లింపు భారం రూ.5,200 తగ్గుతుంది

# ప్రవాసుల దేశీయ ఆదాయంపైనే పన్ను

- వారి విదేశీ రాబడి జోలికి వెళ్లం
- ఎగవేతదారులపైనే మా గురి
- నిజమైన ఎన్‌ఆర్‌ఐలకు బెంగ వద్దు
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) విదేశాల్లో ఆర్జించిన ఆదాయంపైనా పన్ను విధించినట్టు మీడియాలో వచ్చిన వార్తలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. దేశీయ ఆస్తులపై వారు ఆర్జించిన ఆదాయంపై మాత్రమే పన్ను విధింపు ఉంటుందన్నారు. 'ఎన్‌ఆర్‌ఐలు దుబాయ్‌లో ఉండి సంపాదిస్తుంటే, ఆ ఆదాయంపై పన్ను విధించలేను. అయితే అక్కడ ఉండి కూడా ఇక్కడి ఆస్తులపై అద్దె ఆదాయం వంటివి సంపాదిస్తుంటే మాత్రం ఆ ఆదాయంపై ఇక్కడే పన్ను విధించక తప్పదు' అని అన్నారు.

### ధోకా లేదు

ఎన్‌ఆర్‌ఐ హోదాకు సంబంధించి బడ్జెట్‌లో తెచ్చిన మార్పులతో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న 'నిజమైన' ప్రవాస భారత కార్మికులు, ఉద్యోగులకు ఎలాంటి ధోకా ఉండదని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఐలు విదేశాల్లో సంపాదించే ఆస్తులపై వచ్చే ఏ ఆదాయంపైనా పన్ను విధించే అధికారం తమకు లేదన్నారు. ఎన్‌ఆర్‌ఐ హోదాను అడ్డుపెట్టుకుని దేశంలోని ఆస్తులపై ఆదాయం సంపాదిస్తూ పన్ను ఎగవేయడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకే ఎన్‌ఆర్‌ఐ నిర్వచనంలో మార్పులు చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు ఏడాదిలో 183 రోజులు విదేశాల్లో ఉన్న భారతీయుల్ని ఎన్‌ఆర్‌ఐలుగా పరిగణించేవారు. తాజా బడ్జెట్‌లో ఈ కాలాన్ని 245 రోజులకు పెంచారు.

### రెండో విడత భారత్ ఈటీఎఫ్

దేశంలో రుణ పత్రాల మార్కెట్‌ను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మార్చిలోగా రెండో విడత భారత్ బాండ్ ఈటీఎఫ్, డెట్ ఈటీఎఫ్ పథకం జారీ చేస్తామని సీతారామన్ చెప్పారు. ప్రభుత్వ రుణ పత్రాలతో కూడిన రుణ పత్రాల ఈటీఎఫ్‌నూ త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## సెప్టెంబరు తర్వాత ఎల్‌ఐసీ ఐపీఓ!

- 10 శాతం వరకు వాటాల విక్రయం

న్యూఢిల్లీ:భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) ఐపీఓకు సిద్ధమవుతోంది. ఈ ఇష్యూ వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) ద్వితీయార్ధంలో (సెప్టెంబరు తర్వాత) ఉండే అవకాశం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రస్తుతం ఎల్‌ఐసీ ఈక్విటీలో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంది. ఇందులో 5 నుంచి 10 శాతం వరకు ఐపీఓ ద్వారా విక్రయించే అవకాశం ఉందని కుమార్ చెప్పారు. అయితే ఎంత శాతం ఈక్విటీ వాటా విక్రయించాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ లోపు ఐపీఓకు అవసరమైన విధి విధానాలనూ పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం చట్టాన్ని కూడా సవరించాల్సి ఉంటుందన్నారు. చట్టపరంగా ఇందుకోసం అనుసరించాల్సిన విధివిధానాలపై న్యాయ మంత్రిత్వ శాఖతో ఇప్పటికే చర్చలు ప్రారంభించినట్టు కుమార్ చెప్పారు.

## బీపీసీఎల్ ప్రైవేటీకరణ వేగవంతం

- త్వరలో ఈఓఐలకు ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)ను ప్రైవేటుపరం చేసే ప్రక్రియ వేగవంతమైంది. త్వరలోనే బిడ్డర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలు (ఈఓఐ) ఆహ్వానించనున్నట్టు ఒక సీనియర్ అధికారి తెలిపారు. బీపీసీఎల్‌లో వ్యూహాత్మక వాటా విక్రయానికి గత నవంబరులో కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ కంపెనీలో ప్రభుత్వ వాటా 53.29 శాతంగా ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం బీపీసీఎల్‌లో వాటాలను విక్రయిస్తే ప్రభుత్వానికి రూ.60,000 కోట్లు సమకూరవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కంపెనీ విక్రయానికి సంబంధించి యూఎస్, లండన్, దుబాయ్‌లో ఇన్వెస్టర్ రోడ్‌షోలను నిర్వహించారు. బీపీసీఎల్‌లో వాటాల విక్రయం ద్వారా వచ్చే సొమ్ము వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేతికి అందుతుంది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 2వ తేదీకి.. | | విజయవాడ | 350 |
| హైదరాబాద్ | 345 | విశాఖపట్నం | 375 |
| 3వ తేదీకి.. | | వరంగల్ | 348 |
| చిత్తూరు | 393 | డజను గుడ్లు రూ. | 60 |
| గోదావరి | 350 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 82 | విజయవాడ | 87 |
| వరంగల్ | 82 | గుంటూరు | 87 |
| మహబూబ్‌నగర్ | 82 | ఒంగోలు | 89 |
| కరీంనగర్ | 82 | చిత్తూరు | 87 |
| కర్నూలు | 82 | నెల్లూరు | 87 |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | 76 |
| గోదావరి | 81 | | |

# సీడ్ ఫండ్‌తో స్టార్టప్‌లకు చేయూత

### త్వరలో మార్గదర్శకాలు: డీపీఐఐటీ

న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో ప్రకటించిన నేషనల్ సీడ్ ఫండ్‌కు సంబంధించి త్వరలో మార్గదర్శకాలు రూపొందించనున్నట్టు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) తెలిపింది. తద్వారా స్టార్టప్‌లు, వర్ధమాన వ్యాపారులకు అండగా నిలుస్తామని పేర్కొంది. ప్రారంభ దశల్లో ఉన్న అంకుర సంస్థలకు చేయూతనిచ్చేందుకు గాను నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ అంశంపై డీపీఐఐటీ కార్యదర్శి గురుప్రసాద్ మహాపాత్ర స్పందించారు. స్టార్టప్‌లలో అధిక శాతం సంస్థలకు నిధుల సమీకరణే ప్రధాన సమస్య అని, ప్రభుత్వం తాజాగా సీడ్ ఫండ్‌ను ఏర్పరచిన నేపథ్యంలో ఈ నిధులతో వాటికి దన్నుగా నిలిచేలా మార్గదర్శకాలకు రూపకల్పన చేయనున్నట్లు ఆయన వివరించారు.

స్టార్టప్‌లు చాలాకాలంగా సీడ్ ఫండ్ పథకం కోసం డిమాండ్ చేస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర విభాగాల్లో కొన్నింటికి సీడ్ ఫండ్స్ ఉన్నప్పటికీ.. అవి జాతీయ స్థాయిలో నిలిచేంత పెద్దవి కావని ఆయన వివరించారు. ఇక బడ్జెట్‌లో ప్రకటించిన ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్ (ఈఎస్‌ఓపీ) కూడా స్టార్టప్ వాతావరణాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉపకరిస్తుందని, మొత్తంగా బడ్జెట్ పెట్టుబడుల్ని ప్రోత్సహించేదిగా ఉందని గురుప్రసాద్ అభిప్రాయపడ్డారు.

# కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓగా ఎల్‌వీ ప్రభాకర్



- బాధ్యతల స్వీకరణ

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ నూతన మేనేజింగ్ డైరెక్టర్,చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎల్‌వీ ప్రభాకర్ ఈ నెల 1న బాధ్యతలు చేపట్టారు. అగ్రికల్చర్ విభాగంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ప్రభాకర్.. సర్టిఫైడ్ అసోసియేట్ ఆఫ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ (సీఏఐఐబీ)లోనూ గుర్తింపు పొందారు. కెనరా బ్యాంక్ సారథ్య బాధ్యతలను చేపట్టడానికి ముందు ప్రభాకర్.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈడీ హోదాలో పీఎన్‌బీ టర్నోవర్‌ను రూ.లక్ష కోట్లు పెంచి రూ.11.45 లక్షల కోట్లకు చేర్చటంలో కీలక పాత్ర పోషించారు. అలాగే రూ.20,000 కోట్లు రికవరీ చేయటంలో ప్రభాకర్ కీలకంగా ఉన్నారు.

# 'సిప్' ఎప్పుడు ప్రారంభించాలి?



*మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. ఇన్వెస్టర్లకు ఎలాంటి భారం లేకుండా క్రమపద్ధతిలో పెట్టుబడి పెట్టడానికి అందుబాటులో ఉంచిన సాధనం సిప్ (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్). ఈ సిప్ పెట్టుబడులు ఎప్పుడు ప్రారంభిస్తే మంచిదనేది చాలా మంది అడిగే ప్రశ్న. అసలు సిప్ అంటే ఏమిటి, ఇది ఇతర పొదుపు పథకాల కన్నా ఏ విధంగా మెరుగైనది అనే విషయాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం (తిరుపతి) కృష్ణబాలాజీ వివరిస్తున్నారు.*

సిప్‌లపై అవగాహన ఉంటే పెట్టుబడి పెట్టడం అంత కష్టమేమీ కాదు. సిప్‌నే "క్రమశిక్షణతో కూడిన పొదుపు ప్రణాళిక" అంటారు. నెలవారీగా మిగిలే సొమ్ము నుంచి క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టే వీలు కల్పించడమే సిప్ ప్రధాన సూత్రం. ఈక్విటీ మార్కెట్ లేదా డెట్ మార్కెట్లో ఏ షేర్లు, బాండ్లు మంచివన్న అవగాహన సాధారణ ఇన్వెస్టర్‌కు ఉండదు. మార్కెట్‌ను అధ్యయనం చేయాల్సిన అవసరం ఇన్వెస్టర్‌కు లేకుండా నిపుణులైన ఫండ్ మేనేజర్లు పరిశోధన భారం తమ పైన వేసుకుని సిప్ నిధులు ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలో నిర్ణయిస్తారు. సాధారణంగా బ్యాంకు ఆర్‌డీలపై వచ్చే వడ్డీ రేటు ద్రవ్యోల్బణం నుంచి మనకి పూర్తి రక్షణ కల్పించదు. ఈక్విటీ పెట్టుబడుల ద్వారా మాత్రమే మెరుగైన రాబడులు సాధ్యం. మార్కెట్ అందిస్తున్న రాబడి కన్నా 1 లేదా 2 శాతం అదనంగా రాబడి అందించే విధంగా ఫండ్ మేనేజర్లు మీ పెట్టుబడులను డిజైన్ చేస్తారు కాబట్టి ద్రవ్యోల్బణం కన్నా 5 లేదా 6 శాతం పైబడి ఆదాయం లభిస్తుంది.



### ప్రయోజనాలు..

- పొదుపులో క్రమశిక్షణ అందిస్తుంది. ఖాతా ఉన్న బ్యాంకుకు ఒక స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఇస్తే మనం నిర్ణయించిన తేదీకి ఖాతా నుంచి మనం నిర్ణయించిన సొమ్మును సిప్ ఖాతాకు బదిలీ చేసేస్తుంది
- రూపాయి విలువను సమతుల్యం చేయడం మరో ప్రయోజనం. మార్కెట్ గరిష్ఠ స్థాయిల్లో ట్రేడవుతున్నప్పుడు రూ.100 పెట్టుబడికి 10 యూనిట్లు వస్తే మార్కెట్ దిగజారినప్పుడు అదే పెట్టుబడికి అదనపు యూనిట్లు జమ అవుతాయి. దీనే రూపాయి సమతుల్యం అని వ్యవహరిస్తారు
- పెట్టుబడుల పరిభాషలో సిప్‌ను దత్తపుత్రుడుగా వ్యవహరిస్తారు. సొంత సంసార బాధ్యతల బరువులో మిమ్మల్ని వృద్ధాప్య దశలో కొడుకులు పట్టించుకోకపోయినా ఈ దత్తపుత్రుడు కచ్చితంగా అండగా నిలుస్తాడు
- "గుడ్లన్నింటినీ ఒకే బుట్టలో పెట్టవద్దు" అనేది పెట్టుబడుల విభాగంలో ప్రధాన సూత్రం. బుట్ట పడిపోతే గుడ్లన్నీ పగిలిపోయే ప్రమాదం ఉంటుంది. అంటే రిస్క్‌ని డైవర్సిఫై చేసుకోవాలన్న మాట. అలా చేయాలంటే మొత్తం ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో అంతా సిప్‌లోనే పెట్టడం కాకుండా బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు, బంగారం వంటి వాటిలో కూడా కొంత మొత్తం చొప్పున పెట్టుబడి పెట్టాలి

### చక్ర వడ్డీ మ్యాజిక్

సిప్‌లో పెట్టుబడి సొమ్ము ఎలా పెరుగుతుందో తెలుసుకోవాలంటే "చక్ర వడ్డీ మ్యాజిక్" గురించి తెలుసుకుని తీరాలి. ఆకాశ్, పృథ్వీ బాల్య స్నేహితులు. 10 ఏళ్ల పాటు ఉద్యోగం చేసి డబ్బు కూడబెట్టుకుని ఒక స్టార్టప్ కంపెనీ ప్రారంభించాలన్నది వారి కల. ఆకాశ్ ఉద్యోగంలో చేరిన మొదటి నెల నుంచే నెలకి రూ.25,000 సిప్‌లో పొదుపు చేయడం మొదలుపెట్టాడు. పృథ్వీ ఉద్యోగంలో చేరిన తర్వాత ఓ ఐదేళ్లు కులాసాగా కాలం గడిపి నెలకి రూ.50,000 సిప్ ద్వారా పొదుపు చేయడం ప్రారంభించాడు. పదేళ్లలో ఆకాశ్ పెట్టిన పెట్టుబడి రూ.30 లక్షలు కాగా ఏడాదికి 12 శాతం సగటు వడ్డీ లెక్కన రూ.56 లక్షలు చేతికందింది. కాని పృథ్వీ కూడా ఐదేళ్లలో అంతే మొత్తం పెట్టుబడి పెట్టినా అతనికి వచ్చిన రాబడి రూ.40.55 లక్షలే. ఇదంతా చక్ర వడ్డీ మాయ. అందుకే సిప్‌లో ఎంత త్వరగా పొదుపు చేయడం ప్రారంభిస్తే అంత అధిక ప్రయోజనం పొందవచ్చు. ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ గురూ వారెన్ బఫెట్ పెట్టుబడుల రంగంలో విజయం సాధించడానికి పాటించిన మూడు సూత్రాలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

- అతి చిన్న వయసులోనే పొదుపు ప్రారంభించడం
- క్రమశిక్షణతో నెలవారీ పొదుపు చేయడం
- మార్కెట్ హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా ఓర్పుగా దీర్ఘకాలం వేచి ఉండడం

ఏ ఫండ్‌లో పెట్టుబడి పెట్టాలి, ఎలా ముందడుగేయాలి అనే విషయంలో సొంత నిర్ణయాలపై ఆధారపడే కన్నా అనుభవజ్ఞులైన వారి సలహా తీసుకోవడం మంచిది. అనుభవజ్ఞుల సలహా ప్రభావం ఎలా ఉంటుందో తెలియాలంటే ఈ కింది ఉదాహరణ చూడండి.

కిరణ్, సృజన 25 ఏళ్ల వయసులో ఉన్న కొత్త జంట. బ్యాంకు రుణంతో ఒక డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ తక్షణం తీసుకుని 20 ఏళ్ల తర్వాత మరో ట్రిబుల్ బెడ్ రూమ్ ఇండిపెండెంట్ ఇల్లు తీసుకోవాలన్నది వారి ఆలోచన. రూ.50 లక్షల రుణం కోసం బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించారు. 30 ఏళ్ల కాలపరిమితి వరకు ఇంటి రుణం చెల్లించే అవకాశం ఉన్నా 20 సంవత్సరాల లోపు తీర్చేసి మరో ఇంటి రుణం పొందాలనుకుంటున్నట్టు చెప్పారు.

### అనుభవజ్ఞుల సలహా ప్రభావం

అది విన్న మేనేజర్ వారికి చక్కని సలహా ఇచ్చాడు. వారడిగిన రుణంపై 8.5 శాతం వడ్డీ లెక్కన 20 ఏళ్ల కాలపరిమితికి ఈఎంఐ రూ.43,391 అవుతుంది. కాని 30 ఏళ్ల కాలపరిమితిని పూర్తిగా ఉపయోగించుకుంటే అదే రుణంపై వారి ఈఎంఐ రూ.38,446కి తగ్గుతుంది. ఎలాగూ రూ.43,391 చెల్లించగల సామర్థ్యం ఉన్నందువల్ల 30 సంవత్సరాలకు రుణం తీసుకుని మిగిలిన సొమ్ములో రూ.5,000 ఒక మంచి సిప్‌లో ఇన్వెస్ట్ చేయాలని బ్యాంక్ మేనేజర్ సూచించాడు. ఆయన సలహా పాటించారు. 18 సంవత్సరాలు పూర్తయ్యే నాటికి అప్పటికి కట్టిన ఇఎంఐలు పోను ఇంకా ఇంటి రుణంలో రూ.34,63,403 బకాయి ఉంది. అదే కాలపరిమితిలో సిప్ ద్వారా వారికి రూ.35,58,643. వచ్చింది. ఆ సిప్ రాబడి స్వీకరించి దాని నుంచి తమ ఇంటి రుణం బకాయి మొత్తం చెల్లించేశారు. అలా చేసినా కూడా వారికి నికరం గా రూ.90 వేలు చేతికి వచ్చింది. "ఆలస్యం అమృతం విషం" అంటారు. సిప్‌లో పెట్టుబడి ఇప్పుడే ప్రారంభించండి.

## టెక్ వ్యూ

# ప్రధాన మద్దతు 11500



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన కరెక్షన్‌లో ప్రారంభమై స్వల్పకాలిక మద్దతు స్థాయి 12150 కన్నా కూడా దిగువన ముగిసింది. శనివారంనాడు బడ్జెట్ రోజున 300 పాయింట్లు నష్టపోయి మరింత బలహీనపడింది. ప్రధాన మద్దతు స్థాయి 11800 కన్నా దిగజారడంతో స్వల్పకాలిక కరెక్షన్‌లో కూడా ప్రవేశించింది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. గత 10 రోజుల్లోనే 800 పాయింట్ల మేరకు దిగజారింది. ఐదు నెలల ర్యాలీకి తెర దించింది. మంత్లీ చార్టుల ప్రకారం జనవరిలో దిగువకు రివర్సల్ బార్ పాటర్న్ ఏర్పడింది. స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుందనేందుకు ఇది సంకేతం. కీలకమైన 200 డీఎంఏకు కూడా చేరువకు వస్తోంది. ఈ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఉండవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 11500 స్థాయిలో రికవరీ ఏర్పడే ఆస్కారం ఉంది. అయితే ఎక్కడ మద్దతు లభిస్తుందో వేచి చూడాలి. రానున్న కొద్ది రోజుల్లో బలంగా కన్సాలిడేట్ అయితే తప్ప స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉండదు. కొద్ది రోజుల ఆటుపోట్ల అనంతరం నిలదొక్కుకుని స్పష్టమైన దిశ ఏర్పరచుకోవచ్చు.

**బుల్లిష్ స్థాయిలు :** గత వారంలో భారీగా పతనం ఏర్పడినందు వల్ల ఈ వారంలో ట్రేడింగ్ పరిధి భారీగానే ఉండవచ్చు. రికవరీ బాట పడితే మైనర్ నిరోధం 11730 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11850. ఇదే డిసెంబరు 10న ఏర్పడిన గరిష్ఠ స్థాయి.

**బేరిష్ స్థాయిలు :** ప్రధాన మద్దతు స్థాయి 11600. గత ఏడాది అక్టోబరు 27న ఏర్పడిన బాటమ్ ఇది. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు. అంతకన్నా దిగువన క్లోజయితే మరింత బలహీనతను ప్రదర్శిస్తుంది. మధ్యకాలిక ప్రధాన మద్దతు స్థాయి 11500. ఇక్కడైనా రికవరీ తప్పనిసరి.

**బ్యాంక్ నిఫ్టీ :** గత శుక్రవారం ప్రధాన మానసిక అవధి 30000 కన్నా దిగువన బలహీనంగా ముగిసింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన నిలదొక్కుకోవాలి.

**స్వల్పకాలిక వ్యూహం :** 11500 వద్ద బలంగా నిలదొక్కుకోగలిగినప్పుడే స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

**పాటర్న్ :** రికవరీ బాట పడితే 11850 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన నిరోధం ఉంది. ఒకవేళ కరెక్షన్ కొనసాగించినా 11500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. ఆర్ఎస్ఐ సూచి ప్రకారం మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితిలోకి ప్రవేశిస్తోంది. కనిష్ఠ స్థాయిల్లో ట్రేడర్లు ఫ్యూచర్స్ మార్కెట్‌లో షార్ట్ పొజిషన్లకు దూరంగా ఉండడం మంచిది. ప్రస్తుతం మార్కెట్ ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా దిగువన ఉంది. అలాగే 20, 50 డీఎంఏల కన్నా దిగువన ఉండడం అప్‌ట్రెండ్‌కు కొంత వ్యవధి పడుతుందనేందుకు సంకేతం.

**టైమ్ :** ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉంది.





| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం: | 11730, 11800 |
| మద్దతు: | 11640, 11600 |

www.sundartrends.in

## ఆస్ట్రో గైడ్

# 11900 పైన బుల్లిష్

### (ఫిబ్రవరి 3-7 తేదీల మధ్య వారానికి)

### గత వారం నిఫ్టీ : 11662 (-586)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12217-11633 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 586 పాయింట్ల భారీ నష్టంతో 11662 వద్ద వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. ఒక్క బడ్జెట్ రోజునే 300 పాయింట్లు నష్టపోయింది.

- సోమ, శుక్రవారాల (జనవరి 27-31) నడుమ ఏర్పడిన పరిధి 12217-11946. ఇది మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 12161, 12126, 11819, 11653 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ మినహా అన్ని డీఎంఏల కన్నా దిగువకు వచ్చింది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోంది. ఈ వారాంతంలో 11900 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 11900**　　**బ్రేక్‌డౌన్ స్థాయి : 11500**

**నిరోధ స్థాయిలు : 11825, 11900 (11740 పైన బుల్లిష్)**

**మద్దతు స్థాయిలు : 11500, 11425 (11575 దిగువన బేరిష్)**

**ఇన్వెస్టర్లకు సూచన...**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

### గ్రహగతులు

- వృషభంలోని కృత్తిక పాదం 2 నుంచి మిథునంలోని పునర్వసు పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- కర్కాటకంలోని శ్రవణం పాదం 3 నుంచి ధనిష్ఠ పాదం 1 మధ్యలో రవి సంచారం
- కుంభంలోని ధనిష్ఠ పాదం 4 నుంచి శతభిషం పాదం 2 మధ్యలో బుధ సంచారం
- మిథునంలోని పూర్వాభాద్ర పాదం 4 నుంచి ఉత్తరాభాద్ర పాదం 2 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4లో కుజ సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో మకర నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3లో తుల నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 2లో రాహువు, ధనుస్సులోని మూల పాదం 4లో కేతువు సంచారం

### ఉదయం సెషన్ బలం (సోమవారానికి)

**తిథి :** మాఘ శుక్ల నవమి　　నక్షత్రం : కృత్తిక

**అప్రమత్తం :** ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 2.13**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 9.45 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.10 వరకు మెరుగ్గా ఉండి తదుపరి చివరి వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటిగంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11700, 11735 మద్దతు స్థాయిలు : 11620, 11585**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి**



నాగార్జున వర్సిటీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

## విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 2: రాజధాని అమరావతికి మద్దతుగా నిలిచిన నలుగురు విద్యార్థుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఏపీ రాష్ట్ర విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విద్యార్థుల స్వేచ్ఛను, హక్కులను వర్సిటీ యంత్రాంగం కాలరాస్తోందని, విద్యార్థులను సస్పెండ్ చేయడం అధికారుల నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. విద్యార్థి జేఏసీకి కులం, రాజకీయ పార్టీలను అంటగట్టే వర్సిటీ అధికారులు విద్యార్థులను ప్రలోభ పెట్టటం సరైంది కాదన్నారు. విద్యార్థి జేఏసీ ఉపాధ్యక్షుడు గణేష్, నాగేశ్వరరావు, నాని, రాజీవ్, చిన్నం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సస్పెన్షన్‌పై రాష్ట్రవ్యాప్త ఉద్యమం: టీఎన్ఎస్ఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి మద్దతుగా గళం విప్పిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థుల్ని సస్పెండ్ చేయడాన్ని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఖండించారు. విద్యార్థుల సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ భావాలను వ్యక్తపర్చిన విద్యార్థుల్ని సస్పెండ్ చేయడం ఏ నిబంధన కిందకు వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వీసీ తీరుపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## మీరైనా చెప్పండి!



అమరావతి రాజధాని అంశాన్ని అమెరికాలోని ప్రవాసాంధ్రులు న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ సందీప్ చక్రవర్తికి వివరించారు. రాజధాని కోసం పోరాడుతున్న మహిళలపై పోలీసులు చేస్తున్న దాడుల గురించి ఆయన దృష్టికి తెచ్చి వినతిపత్రం సమర్పించారు. దీన్ని భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అందులో కోరారు. చక్రవర్తిని కలిసిన వారిలో రాజా కసుకుర్తి, పద్మ చావా, బాలసుబ్రహ్మణ్యం రాయుడు, పవన్ తాత, విష్ణు కనపర్తి, నాయుడు ఈర్ల, శ్రీహరి మాదాటి తదితరులున్నారు.

# పోరు ఆగదు!



సేవ్ అమరావతి అంటూ చెన్నైలో ఆందోళన చేస్తున్న ప్రవాసాంధ్రులు

## గళం విప్పిన ప్రవాసాంధ్రులు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "చెన్నైలో స్థిరపడినా మా మూలాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. అమరావతి ఆంధ్రుల బంగారు కల. దానిని చెరిపేందుకు ప్రభుత్వం చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏపీ బంగారు భవిష్యత్తు కోసం భూములను త్యాగం చేసిన రైతులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నాం" అంటూ అమరావతిలో రైతుల పోరాటానికి సంఘీభావంగా ప్రవాసాంధ్రులు గళం విప్పారు. 'అమరావతిని కాపాడుకుందాం - రైతులకు న్యాయం చేద్దాం' అన్న నినాదంతో ఆదివారం ప్రవాసాంధ్రులు చెన్నైలో రోడ్డెక్కారు. రైతుల పోరాటానికి సంఘీభావంగా తమిళనాడు తెలుగు సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చెన్నైలో నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టంలో ధర్నా నిర్వహించారు. తెలుగు సంఘాల ప్రతినిధులు ఆదిశేషయ్య, ఎం.చలపతిరావు, టి. రామకృష్ణ, టీడీపీ నేతలు చంద్రశేఖర్, ఐటీ ఉద్యోగుల ప్రతినిధి గడ్డం మహేంద్ర, రవిబాబు తదితరులు ధర్నాకి నేతృత్వం వహించారు.

### 47వ రోజు కొనసాగిన అమరావతి రైతుల ఆందోళనలు
### సీఎం మనసు మార్చాలని పొంగళ్లు, చర్చిల్లో ప్రార్థనలు
### రాజధాని పోరాటానికి ప్రవాసాంధ్రుల సంఘీభావం

గుంటూరు, తుళ్లూరు, మంగళగిరి, తాడికొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి మా భవిష్యత్తు.. ఒకటే రాష్ట్రం, ఒకటే రాజధాని.. అది అమరావతి' అనే స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు తమ పోరు ఆగదని ఆ ప్రాంత రైతులు పేర్కొన్నారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ రైతులు చేపట్టిన ఆందోళనలు 47వ రోజు ఆదివారం కొనసాగించారు. మందడం, తుళ్లూరు, వెలగపూడి దీక్షా శిబిరాల్లో పెద్దఎత్తున మహిళలు, రైతులు, రైతు కూలీలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరికి తోడుగా తాడికొండ అడ్డరోడ్డులో రైతులు దీక్ష నిర్వహించి పెద్ద ఎత్తున వాహనర్యాలీ నిర్వహించారు. పెదపరిమి, గుంటూరు కలెక్టరేట్ ఎదురు, కృష్ణాయపాలెం, యర్రబాలెంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. మూడు రాజధానులపై సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చేలా చూడమని అమరావతి రైతులు ప్రార్థనలు చేశారు. నేలపాడులో గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి అక్కడినుంచి మహిళలు, రైతులు డప్పుల మోత మధ్య పాదయాత్రగా తుళ్లూరు దీక్ష శిబిరానికి చేరి పూజలు నిర్వహించారు. తుళ్లూరు బాలయేసు మందిరంతో పాటు, ఆర్‌సీఎం చర్చిలో రైతులు, మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మమ్మల్ని నయవంచన చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మమ్మల్ని కలిసిన విషయాన్ని వైసీపీ తమకు అనుకూలంగా చెప్పుకుంటోందని ఆరోపించారు. తాడికొండ అడ్డరోడ్డులో 30వ రోజు దీక్షలు కొనసాగాయి. రాజధాని రైతులకు ఇతర ప్రాంతాల నుంచి మద్దతు పెరుగుతోంది. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి నేతృత్వంలో తెనాలి నుంచి రెండు బస్సుల్లో మహిళలు వచ్చి రైతులకు బాసటగా నిలిచారు. పెదవడ్లపూడి నుంచి దాదాపు 200 మంది రైతులు వచ్చి సంఘీభావం తెలిపారు. విరాళాలు అందజేశారు. నరసరావుపేట నుంచి సీబీఎన్ ఆర్మీ సభ్యులు రాజధానిలో పర్యటించి రైతులకు మద్దతు తెలిపారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి దీక్షా శిబిరాలను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ నేత రావెల కిశోర్‌బాబు సందర్శించారు. రాజధాని మార్చిన ఘనత ఆనాడు తుగ్లక్, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని ఎద్దేవా చేశారు. గుంటూరుకు చెందిన 90 ఏళ్ల ఈదర కస్తూరిబాయి అమరావతి కోసం పోరాడుతున్న రైతులు, మహిళలకు సంఘీభావాన్ని ప్రకటించారు. తాడేపల్లి మండలంలోని పెనుమాకలో రైతులు చేస్తున్న దీక్షలు కొనసాగాయి. అమరావతి మండల పరిధిలోని లేమల్లె గ్రామంలోని 14వ మైలు సెంటర్‌లో ఆదివారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. మంగళగిరి అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో పాతబస్టాండు సెంటరులో రిలే దీక్షలు కొనసాగాయి. యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు, జేఏసీ నేతల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.


తుళ్లూరులో ఆర్‌సీఎం చర్చిలో మహిళల ప్రత్యేక ప్రార్థనలు



### రాజధానిని ఎందుకు మార్చాలి?

▸▸ నటుడు శివకృష్ణ

సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, ఇతర భవనాలు సిద్ధంగా ఉన్న రాజధాని అమరావతిని ఎందుకు మార్చాలనుకుంటున్నారో అర్థం కావటం లేదని సీనియర్ నటుడు శివకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన రాజధాని రైతుల ఆందోళనలకు సంఘీభావం తెలిపి తుళ్లూరు దీక్షా శిబిరంలో ప్రసంగించారు.



### ఎంపీ సురేశ్‌కు రాజధాని సెగ!

నందిగామ, ఫిబ్రవరి 2: బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేశ్‌కు రాజధాని సెగ తలిగింది. కృష్ణాజిల్లా నందిగామ పట్టణంలో ఆక్యుపంచర్ వైద్యం కోసం ఆదివారం ఉదయం ఆయన నందిగామ వచ్చారు. సమాచారం తెలుసుకున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు వైద్యశాల వద్దకు చేరుకుని ఎంపీకి గులాబీ పూలు అందజేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం రాజధాని అమరావతిలోనే కొనసాగేలా సీఎం జగన్‌ను ఒప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన సురేశ్.. తాను జగన్ గీసిన గీత దాటనని, ఆయన మాటే నా మాట అని స్పష్టం చేశారు. ఎవరెన్ని చెప్పినా 3 రాజధానులు ఖాయమని, సీఎం జగన్ ఉద్దేశం అంటూ కారెక్కారు. దీంతో టీఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు కారుకి అడ్డు తగిలారు. డ్రైవర్ వారిని తప్పిస్తూ కారుని హైదరాబాద్ వైపు తీసుకువెళ్లారు.

## 'విశాఖ' వెనుక పెద్ద కుంభకోణం

▸▸ అసమర్థ సీఎంలు ఏపీ దురదృష్టం: కన్నా



గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 2: అమరావతిలో భూకుంభకోణాలు చేయడానికి ఆస్కారం లేదని, విశాఖలో చేసుకోవచ్చన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి జగన్ రాజధాని తరలింపునకు పూనుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలో 6వేల ఎకరాల అసైన్డ్, ఆక్రమిత భూములను ప్రభుత్వానికిస్తే ఎకరాకు 900 గజాలు వెనక్కి ఇస్తామని చెప్పడంలోనే పెద్ద కుంభకోణం దాగి ఉందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వాల్లో రెండు సార్లు విశాఖ భూ కుంభకోణాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇచ్చిన నివేదికలను ఎందుకు బయటపెట్టటం లేదని ప్రశ్నించారు. రాజధానిని అమరావతి నుంచి తరలివెళ్లకుండా బీజేపీ, జనసేన సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు దురదృష్టవశాత్తు అసమర్థ ముఖ్యమంత్రులు దొరికారని, అందుకే ప్రతి దానికి కేంద్రం వైపు చూడటం, నిందలు వేయడం పరిపాటిగా మార్చుకున్నారన్నారు. కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు దోహదపడేలా ఉందన్నారు. ఏపీకి మొండి చేయి అని అధికార పార్టీ చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదన్నారు. జీరో బడ్జెట్ వ్యవసాయానికి పక్కా ప్రణాళికను ఈ బడ్జెట్‌లో రూపొందించారన్నారు.

### రాజధాని పర్యటనకు పవన్



అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అమరావతి గ్రామాల్లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. సుమారు రెండు రోజులపాటు ఈ పర్యటన సాగనుంది. పర్యటనలో ఏయే గ్రామాలను సందర్శించాలో నిర్ణయించాలని, షెడ్యూల్ రూపొందించాలని స్థానిక జనసేన నాయకులను పవన్ ఆదేశించారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా గాయపడిన వారిని మంగళగిరి పార్టీ కార్యాలయంలో పవన్ కలిశారు. ఈ సందర్భంగా రాజధాని గ్రామాల్లో మరోసారి పర్యటించాలని వారు కోరారు. దీంతో మరోసారి రాజధానిలో పర్యటించాలని పవన్ నిర్ణయించారు. పార్టీ నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఇతర నేతలు షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ఈ వారంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పార్టీ నేతలతో పవన్ భేటీ కానున్నారు. మరోవైపు రాజధాని తరలింపు, కార్యాలయాల తరలింపు విషయం కోర్టు పరిధిలో ఉన్నా, ప్రభుత్వం మాత్రం కొన్ని విభాగాలను తరలిస్తుంది. ఈ అంశం కూడా భేటీ సమయంలో ప్రస్తావనకు రానున్నట్లు సమాచారం. ఇదిలావుంటే, రాజధాని విషయంలో జనసేన-బీజేపీ ఒకే మాటపై ఉండాలని నాయకులు నిర్ణయించారు. ఆదివారం గుంటూరు, విజయవాడకు చెందిన ఇరు పార్టీల నేతలు హేయ్‌ల్యాండ్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో జనసేన పార్టీ నుంచి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పోతిన మహేష్, బీజేపీ నుంచి రావెల కిశోర్‌బాబు, పాతూరి నాగభూషణం, వంగవీటి నరేంద్ర పాల్గొన్నారు. రాజధాని విషయంలో ఇరు పార్టీలు నేతలు ఏది మాట్లాడినా ఒకే స్టాండ్ పాటించాలని నిర్ణయించారు. రాజధాని అనేది ఒక్కటే ఉండాలని, అక్కడే సచివాలయం, రాజ్‌భవన్, ఇతర కార్యాలయాలు ఉండాలన్నదే ఇరు పార్టీల విధానమని నిర్ణయించారు.

## అమరావతి పరిరక్షణకు..
## రైతు రక్షణ బస్సు యాత్ర

▸▸ ఉద్యమ తీవ్రత కేంద్రానికీ తెలియాలి

▸▸ ఢిల్లీలోనూ ఆందోళనలు చేపడదాం

▸▸ రైతు సంఘాల ఐక్య కార్యాచరణ

▸▸ అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో భేటీ


మందడం దీక్షా శిబిరంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అలుపెరగని పోరాటం చేస్తున్న రాజధాని రైతులు, మహిళలు, ప్రజలకు మద్దతుగా త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'రైతు రక్షణ బస్సు యాత్ర' నిర్వహించాలని రైతు సంఘాల నాయకులు నిర్ణయించారు. 3రాజధానుల ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ 47రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, రిలే దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున అమరావతి పరిరక్షణ ఉద్యమ తీవ్రత కేంద్రప్రభుత్వానికి తెలిసేలా ఢిల్లీలో పార్లమెంట్ భవన్ ఎదుట ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. రాష్ట్రంలోని వివిధ రైతు సంఘాల నాయకులు ఆదివారమిక్కడ సమావేశమయ్యారు. అమరావతి పరిరక్షణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక భేటీలో మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వర రావు, కామినేని శ్రీనివాస్, రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్, భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంబాబు, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాలరావు, పండ్ల తోటల రైతు సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, కోనసీమ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బ్రహ్మానందం, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జంగు కుమారస్వామి, కృష్ణా జిల్లా కిసాన్ సంఘ్ అధ్యక్షుడు సతీశ్, గుంటూరు జిల్లా కిసాన్ సంఘ అధ్యక్షుడు అర్జునరావు, రైతు కార్యాచరణ సమితి కన్వీనర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఒక రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలని ముక్తకంఠంతో చెప్పారు. మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు ఇచ్చిన రైతులు, వారి కుటుంబ సభ్యులు రోడ్డునపడి తీవ్ర ఆవేదనతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే.. ప్రభుత్వం పోలీసుల ద్వారా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలపై దమనకాండను కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. రాజధాని తరలింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొన్నితీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వాటిని బీజేపీ నాయకుడు వెలగపూడి గోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. 'రాష్ట్ర ప్రజలందరూ ఆమోదించిన అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలి.. అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు పూర్తి చేయాలి.. రైతుల ఉద్యమాన్ని పోలీసులతో అణచివేయాలనుకుంటున్న ప్రభుత్వ తీరును అందరూ ఖండించాలి.. ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి.. అభివృద్ధి వికేంద్రీకరణపై పార్టీలు, ప్రజాసంఘాలతో సమగ్రంగా చర్చించాలి' అని తీర్మానించినట్లు తెలిపారు.

### తరలింపు జగన్ వల్ల కాదు: వడ్డే

'అమరావతి నుంచి రాష్ట్ర రాజధానిని, హైకోర్టును తరలించడం జగన్ వల్లే కాదు.. ఇంకెవరి వల్లా సాధ్యం కాదు. 13 జిల్లాల ప్రజల ఆమోదంతోనే అమరావతిలో రాజధాని నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించింది. రాజధానికి కేంద్రం రూ.1,500 కోట్లు ఇచ్చింది. జగన్ మూర్ఖత్వంతో ముందుకు సాగుతున్నారు. రాజ్యాంగంలో కేపిటల్ అనే పదమే లేదని చెప్పి మూడు రాజధానులు ఎలా ఏర్పాటు చేస్తారు? సుప్రీంకోర్టు ఆమోదంతో రాష్ట్రపతి నోటిఫికేషన్ ఇచ్చాకే అమరావతిలో హైకోర్టు ఏర్పాటయింది. దానిని తీసుకెళ్లి కర్నూలులో పెడతాననడం, శాసనసభను అమరావతిలోనే ఉంచి ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తామంటూ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలు చెల్లవు. కోర్టులు న్యాయం చేస్తాయి. కేంద్రం కూడా సరైన సమయంలో జోక్యం చేసుకుంటుందని భావిస్తున్నాను. మండలి రద్దు ప్రక్రియ ఇప్పట్లో కాదు' అని వడ్డే స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పటి నుంచే వారు వైజాగ్‌లో భూములు కొనుగోలు చేస్తూ వస్తున్నారని.. ఇప్పుడు వాటి విలువను పెంచుకోవాలని విశాఖలో ఎగ్జిక్యూటివ్ కేపిటల్ పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

### ఆంధ్రుల పౌరుషం ఏమైపోయింది: కామినేని

'ఎక్కడకు వెళ్లినా, ఎవరిని కదిపినా రాజధానిని మార్చడం తప్పే అంటున్నారు. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాల్గొనడానికి ముందుకు రావడం లేదు. ప్రభుత్వం రాష్ట్రంలో అలాంటి భయానక వాతావరణాన్ని నెలకొల్పింది. రాజధాని ప్రాంతంలో రైతులు, మహిళలు మాత్రమే ఆందోళన చేస్తున్నారు. ఆంధ్రుల పౌరుషం ఏమైపోయింది' అని కామినేని ప్రశ్నించారు.

## జగన్ మూర్ఖంగా ముందుకు
## కేంద్రం జోక్యంతోనే ఆగుతాడు

▸▸ 'మూడు'పై ప్రజాభిప్రాయం తీసుకోవాలి

▸▸ రాజధాని రైతుల దీక్షలకు మాజీ మంత్రి వడ్డే సంఘీభావం

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాజధాని విషయంలో సీఎం జగన్ మూర్ఖంగా ముందుకు వెళ్తున్నారని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. అమరావతిలోనే రాజధానిని కొనసాగిస్తూ, అన్ని జిల్లాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఆదివారం ఆయన మందడం, వెలగపూడిల్లో దీక్షలు చేస్తున్న రైతులకు, 13జిల్లాల రైతు సంఘాల నేతలతో వచ్చి సంఘీభావం తెలిపారు. తుళ్లూరు, వెలగపూడిల్లో మహాధర్నాల్లో పాల్గొన్నారు. కేంద్రం జోక్యం చేసుకుంటే తప్ప జగన్ మూర్ఖత్వపు నిర్ణయాలు ఆపడన్నారు. హైకోర్టు ఉత్తర్వులు కాదని కర్నూలుకు ప్రభుత్వ కార్యాలయాలను తరలించడమేమిటో అర్థం కావటం లేదన్నారు. విశాఖలో భూములు కొన్నవారు లాభపడేందుకే రాజధానిని మారుస్తున్నారని ఆరోపించారు. మూడు రాజధానులపై ప్రజాభిప్రాయం ప్రకారం వెళ్లాలన్నారు.

## అమరావతిపై మోదీతో చర్చిస్తా

▸▸ మండలిపై రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తాం

▸▸ రైతులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భరోసా

▸▸ ఢిల్లీ వెళ్లిన రాజధాని రైతులు

▸▸ న్యాయం చేయాలని వినతిపత్రం


కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అమరావతి జేఏసీ ప్రతినిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి సమస్యపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో చర్చిస్తానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమరావతి రైతులకు తగు న్యాయం చేయడానికి తన వంతు పాత్ర పోషిస్తానని భరోసా ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో ఆయనతో అమరావతి జేఏసీ, రైతుల ప్రతినిధుల బృందం భేటీ అయ్యింది. అమరావతి కోసమే తమ భూములన్నీ ఇచ్చామని, తీరా ఇప్పుడు విశాఖకు తరలించాలని నిర్ణయించడం అన్యాయమని రైతులు గోడు వెలిబుచ్చారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోందని, అక్రమ కేసులు బనాయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అమరావతి రాజధానిని యథాతథంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మూడు రాజధానులపై ఏపీ ప్రభుత్వం నుంచి కేంద్రానికి అధికారికంగా ఎలాంటి ప్రతిపాదనా అందలేదన్నారు. బీజేపీ రాష్ట్రశాఖ అమరావతికి అనుకూలంగా తీర్మానించిందని రైతులకు కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినప్పుడు స్పందిస్తామని చెప్పారు. శాసన మండలి రద్దు విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగానే వ్యవహరిస్తుందన్నారు. ఒక్క రాజధాని మార్పువల్లే అధికార వికేంద్రీకరణ కాదని, అధికార వికేంద్రీకరణకు అనేక మార్గాలు ఉన్నాయని చెప్పారు. అమరావతి జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### భవిష్యత్తులో సెంటు భూమి ఇవ్వరు: శివారెడ్డి

అమరావతికి భూములిచ్చిన రైతులకు అన్యాయం జరిగితే, భవిష్యత్‌లో ఎక్కడా ప్రభుత్వాలకు సెంటు భూమి కూడా రైతులు ఇవ్వరని అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ శివారెడ్డి అన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, హోం, ఆర్థిక మంత్రులనూ కలవనున్నట్టు తెలిపారు.

### మానసిక ఒత్తిళ్లతోనే మరణాలు: స్నేహలతారెడ్డి

అమరావతికి భూములిచ్చిన రైతులు రాజధాని మార్పుతో తీవ్ర ఒత్తిళ్లకు లోనై గుండెపోటుతో చనిపోతున్నారని రైతు ప్రతినిధి స్నేహలతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు అమానుషంగా వ్యవహరిస్తూ రెచ్చగొడుతున్నారని రైతుల ప్రతినిధి మార్టిన్ ఆరోపించారు.

## చీల్చి చెండాడతారా?

▸▸ విజిలెన్స్, 'ఎంక్వైరీస్' ఉద్యోగుల విస్మయం

▸▸ కర్నూలుకు తరలింపు నిర్ణయంపై ఆందోళన

▸▸ మూడేళ్లకోసారి ఊళ్లు మారడం ఇబ్బందనే భావన

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల తరలింపు నిర్ణయంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విజిలెన్స్ కమిషన్, కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీస్ విభాగాలను కర్నూలుకు తరలించాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని గత శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. కర్నూలులో జ్యుడీషియల్ రాజధాని అంటున్న ప్రభుత్వం.. అక్కడ హైకోర్టు ప్రధాన బెంచ్‌తో పాటు ఇతర క్వాసీ జ్యుడీషియరీ సంస్థలు, ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అయితే వీటన్నింటినీ పక్కనపెట్టి ముందుగా ఏసీబీకి చెందిన విజిలెన్స్ కమిషన్, కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీస్ విభాగాల తరలింపుపై నిర్ణయం తీసుకుంది. ఇవి కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే సంబంధించినవి. సాధారణ న్యాయం, ప్రజలు, కేసులకు సంబంధించినవి కావు. వీటికొచ్చే కేసులు, విచారణ ఉద్యోగులకు సంబంధించినవే ఉంటాయి. అందుకే సాధారణంగా సచివాలయం ఉన్నచోటే ఈ విభాగాలను ఏర్పాటు చేస్తారు. వీటిలో పనిచేసే ఉద్యోగులు కూడా న్యాయవ్యవస్థకు చెందినవారు కాదు. సచివాలయ ఉద్యోగులనే డిప్యుటేషన్‌పై వీటిలో నియమిస్తారు. ప్రస్తుతం రెండు విభాగాల్లో కలిసి 59మంది ఉండగా వీరంతా సచివాలయ ఉద్యోగులే. వారంతా ఇప్పుడు కర్నూలు తరలివెళ్లాలి. మూడేళ్ల అనంతరం డిప్యుటేషన్ పూర్తయ్యాక మళ్లీ సచివాలయ ఉద్యోగాల్లోకి రావాల్సి ఉంటుంది. అప్పటికి సచివాలయం అమరావతిలో ఉంటే అక్కడికి, లేకుంటే విశాఖ వరకూ వెళ్లాలి. ఇది దూరాభారం అవుతుందనే భావన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీస్ సచివాలయంలో అంతర్భాగమే అన్నట్లుగా ఉంటాయి. వీటికి వచ్చే కేసులు సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలకు చెందిన ఉద్యోగులకు సంబంధించినవే ఎక్కువ. ఏదైనా కేసు విచారణ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖాధిపతి కార్యాలయం నుంచి, సచివాలయ కార్యదర్శి నుంచి విజిలెన్స్ కమిషనర్ వివరణ కోరవచ్చు. ఈ విభాగాలన్నీ ఒక్కచోట ఉంటేనే ఈ పని తేలికవుతుంది. సచివాలయం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చినవారిని కర్నూలుకు వెళ్లమని, మళ్లీ అక్కడినుంచి మూడేళ్ల తర్వాత సచివాలయం ఉన్నచోటకు వెళ్లమనడం ఉద్యోగుల్ని చీల్చి చెండాడటమే అంటున్నారు. మూడేళ్లకోసారి అంత దూరం మారాల్సి రావడం ఉద్యోగులకు భారంగా మారుతుందని వాపోతున్నారు. హైకోర్టుతో పాటు మానవ హక్కుల కమిషన్, వినియోగదారుల కమిషన్, విజిలెన్స్ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ , రాష్ట్ర వినియోగదారుల ఫోరం, ఇతర ట్రైబ్యునళ్లు ప్రజల నుంచి, ఆయా వర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులు విచారిస్తాయి. ఆలాంటి సంస్థలను తరలించాలి తప్ప సచివాలయంలో ఉండాల్సిన, ఉద్యోగుల కేసులు మాత్రమే విచారించే విభాగాలను ముందుగానే పంపడం సరికాదని అంటున్నారు.

# 'నిర్భయ' వాదనల్లో 'దిశ'

## ఢిల్లీ హైకోర్టులో ప్రస్తావించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

### దేశ సహనాన్ని దోషులు పరీక్షిస్తున్నారు

- కావాలనే ఆలస్యం చేస్తున్నారని వాదన
- కోర్టుకు ఎందుకు తొందర?: ఏపీ సింగ్
- తీర్పును వాయిదా వేసిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఉరిశిక్ష ఖరారైన 'నిర్భయ' హత్యాచార దోషులు మరింత సమయం పొందడానికి ఏమాత్రం అర్హులు కారని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ కేసుకు సంబంధించి.. నలుగురు దోషుల ఉరిశిక్ష అమలుపై విధించిన స్టేను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆదివారం వాదనలు వినిపించారు. దోషులంతా కావాలనే ఉరిశిక్ష అమలును ఆలస్యం చేస్తూ వస్తున్నారని, న్యాయ వ్యవస్థతో ఆటలాడుకుంటున్నారని జస్టిస్ సురేశ్ కయత్‌కు తెలిపారు. ఉరిశిక్షపై దిగువ కోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా




ఆయన 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ గురించి ప్రస్తావించారు. "అక్కడ జరిగింది దిగ్భ్రాంతికరమే. కానీ, ప్రజలు వేడుక చేసుకున్నారు" అని గుర్తుచేశారు. అది చాలా చెడ్డ ముద్ర వేసిందని.. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు, ఉరిశిక్ష అమలు విషయంలో దాని అధికారాలే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 'నిర్భయ' దోషులు ఉద్దేశపూర్వకంగానే ఉరి శిక్ష అమలును ఆలస్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దేశ సహనాన్ని పరీక్షిస్తున్నారని చెప్పారు. దోషి పవన్ గుప్తా ఇప్పటికీ క్యూరేటివ్/క్షమాభిక్ష పిటిషన్ వేయకుండా కావాలనే తాత్సారం చేస్తున్నాడని తెలిపారు. నలుగురు దోషులనూ కలిపే ఉరి తీయాల్సిన అవసరం లేదని, పిటిషన్లు పెండింగ్‌లో లేని వారిని ఉరి తీయొచ్చని సూచించారు. దోషుల తరఫున న్యాయవాది ఏపీ సింగ్ వాదనలు వినిపిస్తూ.. కేంద్రం వేసిన పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉరిశిక్ష అమలుకు సుప్రీంకోర్టు గానీ, రాజ్యాంగం గానీ ఎలాంటి గడువునూ నిర్దేశించలేదని గుర్తుచేశారు. ఈ విషయంలో న్యాయస్థానం కూడా ఎందుకు తొందరపడుతోందని అడిగారు. దోషి ముకేశ్ తరఫున న్యాయవాది రెబెకా జాన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్రం శనివారమే నిద్ర లేచిందా? అని ప్రశ్నించారు. ఇంతకుముందే ఎందుకు పిటిషన్ వేయలేదని అడిగారు. దోషులు తుదిశ్వాస వరకు న్యాయపరంగా వారికున్న అవకాశాలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ సురేశ్ కయత్ తీర్పును వాయిదా వేశారు.



రాష్ట్రపతిభవన్‌లోని మొఘల్‌గార్డెన్స్‌లో విరబూసిన పూలు. 5వ తేదీ నుంచి ప్రజలను ఈ గార్డెన్స్‌లోకి అనుమతిస్తారు. మార్చి 8వ తేదీ వరకు ప్రజల సందర్శన కోసం దీనిని తెరిచి ఉంచుతారు.

## విశ్వహిందూ మహాసభ.. వ్యవస్థాపకుడి కాల్చివేత

- మార్నింగ్ వాక్‌లో ఛాతీపై కాల్చిన దుండగుడు



లఖ్‌నవు, ఫిబ్రవరి 2: విశ్వ హిందూ మహాసభ వ్యవస్థాపకుడు, అఖిల భారత హిందూ మహాసభ ఉత్తరప్రదేశ్(యూపీ) యూనిట్ చీఫ్ రంజిత్ బచ్చన్(40)ను ఒక దుండగుడు అత్యంత సమీపం నుంచి ఛాతీపై తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటనలో బచ్చన్ సోదరుడు ఆదిత్య శ్రీవాస్తవ తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే లఖ్‌నవులోని యూపీ అసెంబ్లీ కాంప్లెక్స్‌కు 2 కిలోమీటర్ల దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం 6 గంటలకు బచ్చన్, ఆదిత్యలు మార్నింగ్ వాక్ చేస్తుండగా శాలువా కప్పుకొని నడుచుకుంటూ వచ్చిన ఓ వ్యక్తి వీరిని అడ్డగించి, మొబైల్ ఫోన్లను లాక్కున్నాడు. అనంతరం బచ్చన్‌పై తుపాకీతో కాల్పులు జరిపాడు. బచ్చన్ అక్కడికక్కడే కుప్పకూలారు. అనంతరం ఆదిత్యపైనా కాల్పులకు తెగబడ్డాడు. అయితే, ఆయన తప్పించుకునే ప్రయత్నం చేయగా ఎడమ భుజానికి బుల్లెట్ గాయాలయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రంజిత్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారని, వీరి మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయని, ఈ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని జాయింట్ కమిషనర్ నవీన్ అరోరా తెలిపారు. కాగా, బచ్చన్ హత్యను అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి ఖండించారు. సీఎం ఆదిత్యనాథ్‌కు రాష్ట్రంలో శాంతి భద్రతల కన్నా పక్క రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాలే ముఖ్యమైందని విమర్శించారు.

## చర్చిలో తొక్కిసలాట.. 20 మంది మృతి

- టాంజానియాలో ప్రాణాలు తీసిన పవిత్ర తైలం!

దార్ ఎస్ సలామ్, ఫిబ్రవరి 2: టాంజానియాలోని ఓ చర్చిలో జరిగిన తొక్కిసలాటలో 20 మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మోషి పట్టణంలో క్రైస్తవ మత ప్రబోధకుడు బోనిసెఫ్ మాంఫోసా నిర్వహించిన ప్రార్థనలకు వేల మంది వచ్చారు. అక్కడ ఆయన ఒక తైలాన్ని చూపిస్తూ అది అత్యంత పవిత్రమైనదని చెప్పారు. దానిని తాకితే రోగాలు నయమవుతాయని చెప్తూ కొంచెం నేలపై పోశారు. దానిని తాకడానికి జనం ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది.

## షాహీన్‌బాగ్‌ను ఖాళీ చేయించండి

- ఢిల్లీలో స్థానికుల ధర్నా
- భారీగా పోలీసుల మోహరింపు
- ఆందోళనలో వృద్ధురాలు సమీదా మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: సీఏఏకు వ్యతిరేకంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్ వద్ద మహిళలు చేపట్టిన ఆందోళన 50వ రోజుకు చేరింది. మరోవైపు ఆందోళనకారులను అక్కడి నుంచి తొలగించాలంటూ ఆదివారం కొందరు స్థానికులు నిరసన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో రోడ్లపై బారికేడ్ల వల్ల ట్రాఫిక్ సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ధర్నా ప్రదేశంలో శనివారం కపిల్ గుజ్జర్(25) అనే వ్యక్తి కాల్పులు జరిపినప్పటి నుంచి అక్కడ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అటుగా వెళ్లేవారిని గుర్తింపు కార్డులు పరిశీలించాకే అనుమతిస్తున్నారు. దీంతో తమ ఇబ్బందులు మరింత పెరిగాయని స్థానికులు ఆరోపించారు. 'నిన్నటి వరకు బారికేడ్లు ఉన్నా పక్కనుంచి వెళ్లగలిగాం. నిన్నటి నుంచి గుర్తింపు కార్డు అడుగుతుండటంతో అటుగా వెళ్లడం కష్టంగా మారింది' అని స్థానికుడు దీపక్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. బారికేడ్ల వల్ల గత 50 రోజులుగా తమ పిల్లలు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని రేఖా దేవి అనే మహిళ ఆరోపించారు. 'జై శ్రీరామ్.. వందేమాతరం.. షాహీన్‌బాగ్‌ను ఖాళీ చేయించాలి' అంటూ స్థానికులు నినాదాలు చేశారు. ఇరువైపుల ఆందోళనల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు షాహీన్‌బాగ్ వద్ద కాల్పులు జరిపిన కపిల్ గుజ్జర్‌ను అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. కాగా, షాహీన్‌బాగ్, జామియా వర్సిటీ వద్ద ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీ ఆగ్నేయ డీసీపీ చిన్మయ్ బిశ్వాల్‌ను ఈసీ బదిలీ చేసింది. కుమార్ గ్యానేశ్‌కు బాధ్యతలు ఇచ్చింది.

### కాల్పులు ఉగ్రవాది పనే: ఒవైసీ

షాహీన్‌బాగ్ వద్ద నిరసనకారులపై కాల్పులు జరిపిన కపిల్ గుజ్జర్‌ను ఉగ్రవాదిగా ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. 'హిందువుల మేలు కోసం మాట్లాడేవారే ఈ దేశంపై పాలన సాగిస్తారు అంటూ గుజ్జర్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ యుద్ధోన్మాదాన్ని తెలియజేస్తోంది' అని ఒవైసీ ట్వీట్ చేశారు. మరోవైపు కోల్‌కతాలో వివాదాస్పద సీఏఏకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆందోళనల్లో పాల్గొన్న ఓ మహిళ ఆరోగ్యం క్షీణించి మరణించారు. షాహీన్‌బాగ్‌లో ఆందోళనల స్ఫూర్తితో కోల్‌కతా, ముంబై, లక్నో తదితర నగరాల్లోనూ నిరసనలు కొనసాగిస్తున్నారు. 'కోల్‌కతా బాగ్' ప్రాంతంలో జనవరి 7వ తేదీ నుంచి సుమారు 250మంది మహిళలు వివాదాస్పద సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సమీదా ఖాతూన్(57) ప్రతిరోజూ ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. శనివారం సాయంత్రం ఆమెకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా గుండె ఆగి చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్

## ఢిల్లీ పట్టం.. మళ్లీ కేజ్రీవాల్‌కే

### సంక్షేమ పథకాలకే హస్తినవాసుల ఓటు

- పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ప్రజలు మళ్లీ కేజ్రీవాల్‌కే పట్టం కట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నెల 8వ తేదీన జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీనే మళ్లీ విజయదుందుభి మోగిస్తుందని హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ పల్స్ సర్వేలో తేలింది. సర్వే వివరాల ప్రకారం.. కేజ్రీ సర్కారు సంక్షేమ పథకాల పట్ల ఢిల్లీలో పేదలు, మధ్య తరగతి ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. ఈ సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబం నెలకు రూ.1500-3000 ఆదా చేయగలుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు జాతీయ అంశాల కన్నా స్థానిక అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో మోదీ ఆకర్షణ, అమిత్ షా వ్యూహాలు పనిచేయవని సర్వే తేల్చింది. రాష్ట్ర స్థాయిలో విశ్వసనీయత గల నేత లేకపోవడం కూడా బీజేపీకి నష్టం చేకూరుస్తోంది. అదే సమయంలో షీలాదీక్షిత్ మృతి తర్వాత కాంగ్రెస్ కూడా నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఎన్నార్సీ, సీఏఏ పెద్దగా ప్రభావం చూపవని, షాహీన్ బాగ్ నిరసన ప్రదర్శన వల్ల ముస్లింలు సంఘటితం కాగా హిందూ ఓటర్లు మతపరంగా సంఘటితమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు పూర్తిగా ఆమ్ ఆద్మీ పార్టీకి మారింది. బీజేపీ ప్రచారం సోషల్ మీడియాకే పరిమితమైంది. ప్రజలు జాతీయ స్థాయిలో జాతీయవాదానికి, రాష్ట్ర స్థాయిలో సంక్షేమానికి ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్లు సర్వేలో తేలింది.

## అస్వస్థతతో ఆస్పత్రికి సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను ఆదివారం నాడిక్కడ సర్ గంగారాం ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ఆమెకు కొన్ని పరీక్షలు చేస్తారు. ఆమె కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆమె వెంట కుమారుడు రాహుల్, కుమార్తె ప్రియాంకా వాద్రా ఉన్నారు.

## 'ఉపాధి' ప్రణాళికలు పంపండి

- రాష్ట్రాలకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్ రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ లేఖలు రాసింది. ఇప్పటికే ఉపాధి హామీ పథకానికి రూ.60వేల కోట్లు కేటాయిస్తూ శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఆయా రాష్ట్రాలకు ఈ బడ్జెట్ పంపిణీకి అవసరమైన మార్గదర్శకాలు, షెడ్యూల్ విడుదల చేసింది. జనవరి నెలాఖరు కల్లా అన్ని జిల్లా పరిషత్‌లు వార్షిక ప్రణాళికలను ఆమోదించి ఆయా గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ల ద్వారా ఫిబ్రవరి 10 కల్లా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు పంపాల్సి ఉంటుంది. ఈ నెలలోనే ఢిల్లీలో ఎంపవర్ కమిటీ సమావేశమై లేబర్ బడ్జెట్‌ను ఖరారు చేస్తుంది. మార్చి 31 కల్లా అన్ని రాష్ట్రాలకు ఆమోదించిన లేబర్ బడ్జెట్ ప్రణాళికలను అందజేస్తారు. అక్టోబరు 2నుంచి నవంబరు 30 వరకు పనులు కల్పించేందుకు లేబర్ బడ్జెట్ ప్రణాళికల రూపకల్పన చేశారు. జిల్లా స్థాయిలో కనీసం 60శాతం పనులు వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు సంబంధించినవి పొందుపరిచారు. ఫిబ్రవరి 12 నుంచి ఎంపవర్ కమిటీ సమావేశం జరగనుండగా, ఆంధ్రప్రదేశ్ అధికారులతో 26న ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేస్తారు.

## ఎక్సైజ్‌శాఖ దినసరి కూలీలా పనిచేయాలి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ దినసరి కూలీలా పనిచేయాలని ఉపముఖ్యమంత్రి(ఎక్సైజ్) కె.నారాయణస్వామి సూచించారు. దశలవారీ మద్య నిషేధంలో భాగంగా తీసుకున్న చర్యల వల్ల గణనీయమైన మార్పులొచ్చాయని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లిక్కర్ అమ్మకాలు 26శాతం, బీరు అమ్మకాలు 27శాతం తగ్గాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా 18శాతం తగ్గాయని, మద్యనిషేధంలో విజయంవైపు వేస్తున్న తొలి అడుగు ఇది అని అభివర్ణించారు. ఇటీవల ఎక్సైజ్‌శాఖ దాడుల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో టీడీపీకి చెందిన కోళ్ల ఫారంలో 60 కేసుల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, సారాపై ఫిర్యాదులకు 14500 టోల్‌ఫ్రీని అందుబాటులోకి తెచ్చినట్లు గుర్తు చేశారు.

## సిట్ సీక్రెట్

(మొదటి పేజీ తరువాయి)

ధర్మానపై తీవ్రమైన అంశాలనే ప్రస్తావించింది. ఒకటి కాదు.. రెండుకాదు.. 14 ఎన్‌వోసీల (నిరభ్యంతర పత్రాల జారీ) కేసుల్లో ఆయన పాత్రను ఎత్తిచూపింది. విశాఖ, దాని చుట్టుపక్కల రూ.కోట్ల విలువచేసే భూములు మాజీ సైనికుల నుంచి ధర్మాన కుటుంబీకులు, సన్నిహితుల కంపెనీలు, వ్యక్తుల పేరిట బదిలీ అయ్యాయని వెల్లడించింది. ఒక్కో భూమి విషయంలో ధర్మాన ఎలా వ్యవహరించారో స్పష్టంగా పేర్కొంది. అయితే కొత్త సిట్ ఇచ్చిన నివేదికలో ఆ తీవ్రత లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఎన్‌వోసీల జారీలో భారీ అక్రమాలు?

ధర్మాన రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలోనే అధికారులు విశాఖ రూరల్, భీమునిపట్నం, పరవాడ, పరదేశీపాలెం, దేశపాత్రునిపాలెం, మధురవాడ, పెదముసిడివాడ తదితర ప్రాంతాల్లో మాజీ సైనికులకు ఎన్‌వోసీలు ఇచ్చారు. ప్రభుత్వం అసైన్ చేసిన భూములను అమ్ముకునేందుకు భారీగా ఎన్ వోసీలు భారీగా ఇచ్చారు. ఈ పత్రాల జారీలో భారీగా అక్రమాలు జరిగాయని, అలా ప్రభుత్వం చేయిదాటిన భూములు ఆ తర్వాత నాటి పెద్దల నియంత్రణలోకి వెళ్లాయని పాత సిట్ చెప్పింది. కోట్లాది రూపాయల విలువచేసే భూముల్ని మాజీ సైనికుల నుంచి నాటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుటుంబీకులు, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉన్న మిత్రుల కంపెనీలు చేజిక్కించుకున్నాయని తేల్చింది. ఈ మొత్తం వ్యవహారంలో ధర్మాన, ఆయన సన్నిహితులపై విచారణ జరిపించాలని, కొన్ని కేసుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. రెవెన్యూ అధికారులు భూములపై తీవ్రమైన నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడ్డారని, మాజీ సైనికుల భూములకు సంబంధించి కీలక పత్రాలు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని పేర్కొంది. వీటిపై ఫోరెన్సిక్ పరిశీలనలు జరిపించాలని సూచించింది. 'అడ్డగోలుగా నిబంధనలను ఉల్లంఘించి తీసుకున్నదే ఎన్‌వోసీ' అని అందరూ భావించేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేసింది.

### లబ్ధి పొందిన కంపెనీలు ఇవే..

ఓమ్‌కాన్ రియల్టర్స్-డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోరమాండల్ ఎస్టేట్స్-ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల్లో ధర్మాన సోదరుడు ధర్మాన రామదాసు డైరెక్టర్‌గా ఉన్నారు. కోరమాండల్‌లో నాటి మంత్రి ధర్మానకు అత్యంత సన్నిహితుడైన ఐబీ కుమార్ కూడా ఉన్నారని పాత సిట్ స్పష్టంగా తన నివేదికలో పేర్కొంది. విశాఖ చుట్టూ ఉన్న ఐదారు గ్రామాల పరిధిలోని మాజీ సైనికులు చకచకా ఎన్‌వోసీలు తీసుకుని భూములు అమ్మేసుకున్నారు. ఆ భూములు అటూ ఇటూ చేతులు మారి.. చివరకు ఈ రెండు కంపెనీల చేతుల్లోకి వచ్చాయి. పాత సిట్ నివేదిక ప్రకారం.. 4289 అసైన్‌మెంట్ ఫైల్ పేరిట 15అసైన్‌మెంట్ భూములు ఉన్నాయి. ఇందులో 11భూములకు ఎన్‌వోసీలు ఇచ్చారు. 2627 ఫైల్ ఆధారంగా మరో మూడు అసైన్డ్ భూములకు ఎన్‌వోసీలు ఇచ్చారు. 14 భూములపై మాజీ సైనికులకు నిరభ్యంతర పత్రాలు అందగా.. ఇవన్నీ ఆ రెండు కంపెనీల చేతుల్లోకి వెళ్లాయి.

- పరవాడ మండలం దేశపాత్రుని గ్రామంలో 367/4, 363/1, 363/3, 365/1, 364, 367/3, 367/2,360/2, 360/1, 315/11, 315/7 సర్వే నంబర్లలోని 34 ఎకరాల భూమిని ఈ కంపెనీలు, ఇతరులు చేజిక్కించుకున్నారు.
- విశాఖ రూరల్ మండలం మధురవాడలోని సర్వే నంబరు 335/4లోని ఐదెకరాల భూమి కూడా వారి వశమైంది. ఈ కేసులో ధర్మాన ప్రసాదరావుతో పాటు ఐబీ కుమార్ పాత్రపై విచారణ చేపట్టాలని.. అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిట్ సిఫారసు చేసింది.
- పెదముసిడివాడలో 436 సర్వే నంబరులోని 3.29 ఎకరాల భూమిని కోరమాండల్ ఎస్టేట్స్ కొనుగోలు చేసింది.
- పెదముసిడివాడలో సర్వే నంబరు 441/1లోని 4.65 ఎకరాల భూమిని కూడా కోరమాండలే కొనుక్కుంది.
- పరదేశీపాలెంలో సర్వే నంబరు 187/1లోని 4.89 ఎకరాల భూమినీ అదే సంస్థ కొనుగోలు చేసింది.
- పెదముడిసివాడలో ఓ మాజీ సైనికుడి నుంచి ధర్మాన సోదరి భూమిని కొనుగోలు చేశారని సిట్ తేల్చింది.

### పాత సిట్ రిపోర్టును పరిశీలిస్తున్నాం

మధ్యంతర నివేదికలోని అంశాలు, దానిపై వస్తున్న విమర్శలను కొత్త సిట్ ఛైర్మన్ డాక్టర్ విజయ్‌కుమార్ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లింది. దీనిపై ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన విచారణపై మధ్యంతర నివేదికనే సమర్పించామని, అది పూర్తి రిపోర్టు కాదని చెప్పారు. 'మా దృష్టికి వచ్చిన అన్ని కేసులనూ పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ భూముల దురాక్రమణ, రికార్డుల ట్యాంపరింగ్, క్లాసిఫికేషన్ మార్పు, ఎన్‌వోసీల జారీ వంటి అంశాలపై విచారణ చేస్తున్నాం. అనేక అక్రమాలు, తప్పులను గుర్తించాం. వీటికి బాధ్యులైన అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశాం' అని తెలిపారు. పాత సిట్ రిపోర్టులో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఉంది కదా.. మీరు ఆ కేసులను విచారిస్తున్నారా అని ఆయన్ను ప్రశ్నించగా.. 'పాత సిట్ రిపోర్టును టీమ్స్ పరిశీలిస్తున్నాయి. తప్పు చేసిన ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చెప్పాం. పూర్తి రిపోర్టు ఇంకా సమర్పించాల్సి ఉంది' అని బదులిచ్చారు. వాస్తవానికి కొత్త సిట్ కూడా ఎన్‌వోసీల కేసులపై విచారణ జరిపింది. ఈ కేసుల్లో ధర్మాన ప్రస్తావన ఉందా..? లేక ఆయన్ను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### 12 ఏళ్ల క్రితమే 300 కోట్లకుపైనే..!

పైవన్నీ మచ్చుకు కొన్ని ఉదాహరణలే. ఇంకా పలు కేసులు ఉన్నాయి. ప్రభుత్వం చేజారిపోయే నాటికి అంటే 2006-2008 నాటికి ఆ భూముల (51 ఎకరాలు) విలువ రూ.300 కోట్లపైమాటేనని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారం ధర మూడింతలు పెరిగిందని అంటున్నారు.

## జైలు భయంతోనే రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారా?

- సీఎంగా బడ్జెట్‌పై స్పందించరా?: జగన్‌పై యనమల ధ్వజం



అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు తగ్గడానికి సీఎం జగనే బాధ్యత వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. తన కేసుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విరుచుకుపడ్డారు. 'కేంద్ర బడ్జెట్‌పై సీఎం ఎందుకు స్పందించలేదు? కేసుల భయంతోనే స్పందించలేదా? జైలు భయంతోనే రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారా? సీఎంగా బడ్జెట్‌పై స్పందించాల్సిన బాధ్యత లేదా' అని నిలదీశారు. కేంద్ర నిధులు రాబట్టడంపై దృష్టిపెట్టలేదని.. కోర్టు వాయిదాలపైనే ఆలోచిస్తూ నిర్లక్ష్యం చేశారని ఆక్షేపించారు. '22మంది ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తానన్నారు. హోదా తేలేకపోగా రూ.1,521కోట్ల నష్టం తెచ్చారు. 15వ ఆర్థికసంఘం నిధు ల్లో రాష్ట్ర వాటా దాదాపు 0.2శాతం.. రూ.1521కోట్ల మేర కేటాయింపులు తగ్గాయి. కేంద్రంనుంచి వచ్చే నిధులు తగ్గాయి. కేంద్ర పథకాల వాటా తగ్గింది. వీటన్నిటికీ జగన్‌దే బాధ్యత' అని స్పష్టంచేశారు. విశాఖ, విజయవాడ మెట్రోలకు నిధులు రాబట్టలేకపోయారని.. పోలవరానికి రావలసిన డబ్బే తెచ్చుకోలేకపోయారని చెప్పారు. 'మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రాష్ట్రంనుంచి ప్రతిపాదనలే రాలేదని బీజేపీ ఎంపీయే చెప్పారు. విశాఖ భూములపై పెట్టిన శ్రద్ధలో పదోవంతు కూడా కేంద్ర నిధులపై పెట్టలేదు. ఢిల్లీని వదిలేసి విశాఖ భూముల చుట్టూ తిరిగారు' అని విమర్శించారు. అమరావతికి నిధులు వద్దని జగనే ప్రధానికి చెప్పారని గుర్తుచేశారు. 'రాష్ట్రాన్ని రెంటికీ చెడ్డ రేవడిలా మార్చారు. కంపెనీలన్నీ వెనక్కిపోయాయి. పెట్టుబడులు ఆగిపోయాయి.గతంలో జైలుకెళ్లిన పారిశ్రామికవేత్తలే వాళ్లకు గుర్తు. ముఖ్యమంత్రే అవినీతి కేసుల్లో కోర్టు విచారణకు హాజరవుతున్నారు' అని దుయ్యబట్టారు. ఆర్థికమంత్రి బుగ్గన 2020-21 గురించి వదిలేసి, 2018-19 గురించి చెప్పడం మానుకోవాలని హితవుపలికారు. 'కాంట్రాక్టర్లతో లాలూచీ కోసమే రివర్స్ టెండరింగ్. బెదిరింపుల వల్లే పనులన్నీ నిలిపేశామని కాంట్రాక్టర్లే చెప్పారు. జగన్ తుగ్లక్‌ను మించిపోయారు కాబట్టే జాతీయ మీడియా ఆయన్ను జగ్లక్ అంటోంది. మీ అక్రమాలకు అడ్డుగోడగా నిలవడంతోనే మండలి రద్దుకు తీర్మానం చేశారు' అని ధ్వజమెత్తారు.

## బూతుల మంత్రి కొడాలి

- నోరు అదుపులో పెట్టుకోకుంటే పరాభవం తప్పదు: జవహర్

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.3వేలు ఇస్తామన్న తొలి హామీనే తుంగలో తొక్కి ప్రజల్లో ఛీ కొట్టించుకుంటున్నా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని మాజీ మంత్రి, టీడీపీ నేత కేఎస్ జవహర్ విమర్శించారు. బూతుశాఖ మంత్రిగా పేరు తెచ్చుకున్న కొడాలి నాని దాన్ని సమర్థించుకుంటూ మాట్లాడడం దారుణమన్నారు. 'సన్న బియ్యంపైనా మాట తప్పి, ప్రజల్లో చులకనైనా ఆయన తీరు మార్చుకోకపోవడం సిగ్గుచేటు. 8నెలలుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న జగరోనా వైరస్ గురించి మాట్లాడకుండా చంద్రబాబు లక్ష్యంగా కొడాలి నాని దిగజారుడు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం. టీవీల్లో కొడాలి నాని ప్రెస్‌మీట్ వస్తుందంటేనే చిన్న పిల్లలున్న ఇళ్లల్లో చానళ్లను మార్చేస్తున్నారు. ఆయన హావభావాలు మాయల పకీరును తలపించేలా ఉన్నాయి. అతను వాడుతున్న భాష, మాట్లాడుతున్న మాటలు చూసి యావత్ ప్రజానీకం చీదరించుకుంటోంది. చివరికి చట్టసభల్లోనూ బూతు పదాలతో చరిత్రకే చెదలు పట్టించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి రాష్ట్ర ప్రజలకు గానీ, ఎమ్మెల్యేగా గుడివాడకు కానీ కొడాలి నాని చేసిందేమీ లేదు. ప్రజలను బెదిరించి, బాధించి, వేధించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. రైతుల ఆందోళనలపై మతిభ్రమించి అర్థంకాని విధంగా మాట్లాడుతున్నారు. నోరు అదుపులో పెట్టుకుని, బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే, ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు' అని జవహర్ హెచ్చరించారు.

## మోదీజీ.. మీ యోగాను కొనసాగించండి!

- దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతుందేమో.. రాహుల్ ఎద్దేవా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆదివారం తన ట్విటర్ ఖాతాలో ప్రధాని మోదీ యోగా చేస్తున్న వీడియోను పోస్ట్ చేశారు. దానికింద 'మోదీజీ.. మీ 'మ్యాజికల్ ఎక్సర్‌సైజ్' కొనసాగిస్తూనే ఉండండి. ఎవరికితెలుసు.. దీనిద్వారా దేశ ఆర్థికవ్యవస్థ గాడిలో పడుతుందేమో' అన్న కామెంట్‌తో కేంద్ర బడ్జెట్‌పై ఎద్దేవా చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంలో మ్యాజిక్ చేసేందుకు ప్రయత్నించారని, అయినా ఎవరినీ సంతృప్తి పరచలేకపోయారని విమర్శించారు. నిరుద్యోగులను బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు.

## ఉగాది నాటికి జీ+త్రీ ఇళ్ల పంపిణీ: బోస్



మండపేటలో గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి బోస్

మండపేట, ఫిబ్రవరి 2: రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థలో గత ప్రభుత్వం నిర్మించిన 2.72 లక్షల జీ ప్లస్ త్రీ ఇళ్ల సముదాయాలను ఉగాదినాటికల్లా లబ్ధిదారులకు అందిస్తామని ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్ర బోస్ వెల్లడించారు. తూర్పుగోదావరిజిల్లా మండపేటలోని గొల్లపుంతలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని ఆదివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఫేజ్-1లో ఇళ్లకు సంబంధించి మౌలిక వసతులు, వాటర్ ట్యాంకులు పార్కులు, రహదారులు, సెప్టిక్ ట్యాంకులు నిర్మించాల్సి ఉందన్నారు. విదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఇళ్లలో వాటర్ ట్యాంకులు చాలవని, రెండేసి బ్లాకులకు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

## కేరళలో మరొకరికి కరోనా వైరస్

- మరో 324 మంది వూహాన్ నుంచి ఢిల్లీకి

న్యూఢిల్లీ, బీజింగ్, ఫిబ్రవరి 2: భారత్‌లో మరో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. అదీ మొదటి కేసు నమోదైన కేరళలోనే. జనవరి 24న చైనాలోని వూహాన్ వర్సిటీ నుంచి కేరళకు తిరిగి వచ్చిన విద్యార్థి.. దగ్గు, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతుండడంతో ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నారు. ఆ విద్యార్థి రక్తనమూనాలను సేకరించి పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపగా.. పాజిటివ్ వచ్చినట్టు తేలిందని కేరళ ఆరోగ్య మంత్రి కేకే శైలజ తెలిపారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని అలప్పుజ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స చేస్తున్నామని చెప్పారు. కేరళలోని త్రిసూర్‌కు చెందిన ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇద్దరి పరిస్థితీ నిలకడగా ఉందని మంత్రి వివరించారు. చైనా నుంచి కేరళకు వచ్చిన 1999 మందిని పరిశీలనలో ఉంచామని.. 75 మందిని మాత్రం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా.. వూహాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్లో 324 మందిని, మాల్దీవులకు చెందిన మరో ఏడుగురిని భారత ప్రభుత్వం ఆదివారం అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకొచ్చింది. వారిలో ఎవరికీ కరోనా వైరస్ పాజిటివ్ రాలేదని అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తచర్యగా 88 మంది మహిళలను, 10 మంది పురుషులను ఢిల్లీ చావ్లా ప్రాంతంలో ఐటీబీపీ ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు తరలించారు. మిగతావారిని మానేసర్‌లోని ఆర్మీ క్వారంటైన్‌కు పంపించారు. వైరస్ ముప్పు నేపథ్యంలో.. భారత్‌కు వచ్చే చైనీయులకు, చైనా నుంచి వచ్చే ఇతర దేశాలవారికి ఇచ్చే ఈ-వీసా సౌకర్యాన్ని మనదేశం తాత్కాలికంగా నిలిపివేసింది. కాగా.. ఇటీవలే చైనా నుంచి బెంగళూరు వచ్చిన ఓ కుటుంబానికి స్థానిక వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. వారు వూహాన్‌లో పర్యటించకపోయినా.. చైనా నుంచి రావడంతో వారి పొరుగువారు భయపడి వైద్యులకు సమాచారం అందించారు. దీంతో వైద్యులు వారిని ఆస్పత్రికి తరలించారు. వారికి వైరస్ సోకిన లక్షణాలేవీ లేవని, జర్వం, దగ్గు, జలుబు లేవని వైద్యులు తెలిపారు. ఆ కుటుంబంలోని ఐదుగురు సభ్యుల రక్తం, లాలాజల నమూనాలను సేకరించి పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపామని చెప్పారు.

### పెరుగుతున్న మృతుల సంఖ్య

కరోనా వైరస్ మృతుల సంఖ్య 305కు చేరింది. చైనాలో 304 మంది చనిపోగా.. చైనా బయట తొలి కరోనా మరణం ఫిలిప్పీన్స్‌లో నమోదైంది. ఆ దేశ రాజధాని మనీలాలో నివసిస్తున్న ఒక చైనీయుడు (44) వైరస్ బారిన పడి మరణించాడు. అతడితోపాటు ఉన్న మహిళకు కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. ఇక, చైనాలో ఈ వైరస్‌తో బాధపడుతున్న వారి సంఖ్య 14,380కి చేరుకుందని ఆ దేశ హెల్త్ కమిషన్ ఆదివారం వెల్లడించింది.

### కరోనా.. జర జల్సా

భారత ప్రభుత్వం వూహాన్ నుంచి ఢిల్లీకి తరలించిన మనవాళ్లంతా ఇప్పుడు క్వారంటైన్‌లో ఏం చేస్తున్నారో తెలుసా? ఎంచక్కా మాంచి బీటున్న పాటలకు స్టెప్పులేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. వారు డాన్స్ చేస్తున్న వీడియో ట్విటర్, వాట్సాప్ వంటివాటిల్లో విస్తృతంగా వ్యాపించడంతో.. చాలామంది నెటిజన్లు వారిని అభినందిస్తున్నారు. ఏదో క్వారంటైన్‌లో ఉన్నామని బాధపడకుండా ఇలా ఆనందంగా ఉండడం గొప్ప విషయమని మెచ్చుకుంటున్నారు.

### నేటి నుంచి గాంధీలో కరోనా పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి హైదరాబాద్ గాంధీ వైద్య విద్య కళాశాలలో కరోనా వైరస్ పరీక్షలు నిర్వహిస్తామని తెలంగాణ వైద్య, ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రోజూ 30 మందికి పరీక్షలు చేయడానికి అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆదివారం ఆయన ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 3 ఫిబ్రవరి 2020



# 5కు ఐదు

## సిరీస్ క్లీన్‌స్వీప్‌తో భారత్ చరిత్ర

### చివరి టీ20లోనూ కివీస్‌కు నిరాశే




ఐదు టీ20లు గెలిచారిలా..



బుమ్రా (3/12)

**న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా అద్భుతమే చేసింది. పొట్టి ఫార్మాట్‌లో ఇక్కడ పేలవ రికార్డున్న భారత్ ఈసారి ఏకంగా ఐదు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటి దాకా ఏ జట్టు కూడా ఇంత భారీ విజయాన్ని సొంతం చేసుకోలేదు. రోహిత్, రాహుల్‌ల దూకుడైన బ్యాటింగ్‌కు తోడు ఎప్పటిలాగే బౌలర్లు పంజా విసరడంతో ఈ ఘనత భారత్ సొంతమైంది. అయితే ఈ మ్యాచ్‌లోనూ కివీస్ గెలుపు అవకాశాలను చేజార్చుకుంది. ఒక్క ఓవర్‌లోనే 34 పరుగులతో విధ్వంసం సృష్టించిన ఆతిథ్య జట్టు విజయానికి చివరి 5 ఓవర్లలో 42 పరుగులు చాలు. చేతిలో ఆరు వికెట్లున్నాయి. కానీ పేసర్లు బుమ్రా, శార్దూల్ ఠాకూర్ పదునైన బంతులకు టపటపా నాలుగు వికెట్లు చేజార్చుకుని ఏడు పరుగుల తేడాతో ఓడింది. ఆఖరి ఓవర్‌లో సోధీ రెండు సిక్సర్లతో మళ్లీ సూపర్ ఓవర్‌ను గుర్తుకు తెచ్చినా ఠాకూర్ బుల్లెట్‌లాంటి బంతులతో చెక్ పెట్టాడు.**

**మౌంట్ మాంగనూ:** న్యూజిలాండ్ పర్యటనలో తొలి అంకాన్ని భారత జట్టు అజేయంగా ముగించింది. రోహిత్ శర్మ (60 రిటైర్డ్‌హర్ట్) అర్ధసెంచరీ సాధించగా బౌలింగ్‌లో బుమ్రా (4-1-12-3) అద్భుత గణాంకాలతో కివీస్‌ను బెదరగొట్టాడు. దీంతో ఆదివారం ఆఖరిదైన ఐదో టీ20లోనూ కోహ్లీ సేన ఏడు వికెట్లతో నెగ్గింది. అలాగే ఈ సిరీస్‌ను 5-0తో క్లీన్ స్వీప్ చేసింది. అటు సొంత దేశంలో కివీస్ చెత్త ఓటమిని మూటగట్టుకుంది. మూడు వన్డేల సిరీస్ బుధవారం నుంచి జరుగుతుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 163 పరుగులు చేసింది. రాహుల్ (45), శ్రేయాస్ (33 నాటౌట్) రాణించారు. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసి ఓడింది. టేలర్ (53), సీఫెర్ట్ (50) అర్ధసెంచరీలు సాధించారు. సైనీ, ఠాకూర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా రాహుల్ ఎంపికయ్యారు.

**సీఫెర్ట్, టేలర్ ఆదుకున్నా..:** భారీ స్కోర్లు నమోదయ్యే ఈ పిచ్‌పై 164 పరుగుల సాధారణ లక్ష్యం ఎదురైనా కివీస్ ఒత్తిడిలో పడి చిత్తయింది. 25 పరుగుల వ్యవధిలోనే చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. రెండో ఓవర్‌లోనే బుమ్రా బంతికి గప్టిల్ (2) ఎల్బీగా వెనుదిరిగాడు. ఇక ఈ మైదానంలో రెండు శతకాలున్న మన్రో (15)తో పాటు బ్రూస్ (0) కూడా త్వరగా అవుటవడంతో 17 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో సీఫెర్ట్, టేలర్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. దూబే ఓవర్‌లో 34 పరుగులు సాధించక ముందు కివీస్ లక్ష్యం 66 బంతుల్లో 100గా ఉంది. ఆ ఆరు బంతుల తర్వాత 10 ఓవర్లలో కేవలం 66కి వచ్చింది. దీంతో కివీస్ విజయం సులువే అనిపించింది. కానీ నాలుగో వికెట్‌కు 99 పరుగు లు జోడించాక ఈ ఇద్దరిని సైనీ దెబ్బతీశాడు. ఆతర్వాత వికెట్లన్నీ వేగంగా పడిపోయాయి. ఆఖరి ఓవర్‌లో 21 పరుగులు చేయాల్సి ఉండగా సోధీ (16 నాటౌట్) రెండు సిక్సర్లతో కలకలం రేపినా చివరి రెండు బంతుల్లో ఠాకూర్ ఒక్క పరుగే ఇచ్చి మ్యాచ్‌ను ముగించాడు.



రోహిత్ (60)

**రోహిత్, రాహుల్ దూకుడు:** కోహ్లీ విశ్రాంతి కారణం గా జట్టు పగ్గాలు చేపట్టిన రోహిత్ వన్‌డౌన్‌లో దిగాడు. అయితే శాంసన్ (2) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. దీం తో రాహుల్, రోహిత్ జోడీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. మూ డో ఓవర్‌లో రాహుల్ 6,4,4తో చెలరేగి 15 పరుగులు రాబట్టాడు. రెండో వికెట్‌కు 88 పరుగులు వచ్చాక 12వ ఓవర్ లో రాహుల్ అవుటయ్యాడు. ఆతర్వాత జోరు పెంచిన రోహిత్ భారీ సిక్సర్లతో 35 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. స్కోరు 200 ఖాయమే అనిపించినా 17వ ఓవర్‌లో గాయంతో రోహిత్ మైదానం వీడాడు. ఆఖరి ఓవర్‌లో మనీశ్ (11 నాటౌట్) 6,4తో చెలరేగాడు.

### స్కోరు బోర్డు

**భారత్:** రాహుల్ (సి) శాంట్నర్ (బి) బెన్నెట్ 45; శాంసన్ (సి) శాంట్నర్ (బి) కుగ్లెయిన్ 2; రోహిత్ (రిటైర్డ్‌హర్ట్) 60; శ్రేయాస్ (నాటౌట్) 33; దూబే (సి) బ్రూస్ (బి) కుగ్లెయిన్ 5; మనీశ్ పాండే (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 163/3. వికెట్ల పతనం:** 1-8, 2-96, 3-148. **బౌలింగ్:** సౌతీ 4-0-52-0; కుగ్లెయిన్ 4-0-25-2; బెన్నెట్ 4-0-21-1; సోధీ 4-0-28-0; శాంట్నర్ 4-0-36-0.

**న్యూజిలాండ్:** గప్టిల్ (ఎల్బీ) బుమ్రా 2; మన్రో (బి) సుందర్ 15; సీఫెర్ట్ (సి) శాంసన్ (బి) సైనీ 50; బ్రూస్ (రనౌట్) 0; టేలర్ (సి) రాహుల్ (బి) సైనీ 53; మిచెల్ (బి) బుమ్రా 2; శాంట్నర్ (సి) మనీశ్ (బి) ఠాకూర్ 6; కుగ్లెయిన్ (సి) సుందర్ (బి) ఠాకూర్ 0; సౌతీ (బి) బుమ్రా 6; సోధీ (నాటౌట్) 16; బెన్నెట్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 156/9. వికెట్ల పతనం:** 1-7, 2-17, 3-17, 4-116, 5-119, 6-131, 7-132, 8-133, 9-141. **బౌలింగ్:** వాషింగ్టన్ సుందర్ 3-0-20-1; బుమ్రా 4-1-12-3; సైనీ 4-0-23-2; శార్దూల్ 4-0-38-2; చాహల్ 4-0-28-0; దూబే 1-0-34-0.



దూబే

### 6 బంతులు.. 34 పరుగులు

**అ**ప్పుడెప్పుడో 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఆరు సిక్సర్ల ధాటికి ఇంగ్లండ్ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ ఓవర్‌లో 36 పరుగులు సమర్పించుకున్నాడు. ఆతర్వాత ఇప్పుడు కివీస్ చితక్కొట్టుడుకు భారత పేసర్ శివమ్ దూబే బలయ్యాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్‌లో 34 పరుగులిచ్చుకున్నాడు. సీఫెర్ట్, టేలర్ ఈ విధ్వంసానికి కారకులయ్యారు. ముందుగా సీఫెర్ట్ వరుసగా 6,6,4,1 బాదాడు. ఐదో బంతి నోబాల్ కాగా టేలర్ దాన్ని ఫోర్‌గా మలిచాడు. అలాగే ఫ్రీహిట్‌ను, చివరి బంతినీ అతడు సిక్సర్లుగా మలచడంతో పరుగుల వరద పారింది. దీంతో ఈ ఫార్మాట్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న రెండో బౌలర్‌గా నిలిచాడు. కానీ భారత్ నుంచి మాత్రం స్టువర్ట్ బిన్నీ (2016లో విండీస్‌పై 32)ని దాటేసి టాప్‌కు చేరాడు.

**1** — అంతర్జాతీయ టీ20ల్లో అత్యధికసార్లు 50+ పరుగులు సాధించిన తొలి బ్యాట్స్‌మన్‌గా రోహిత్ (25). ఈ జాబితాలో కోహ్లీ (24)ని అధిగమించాడు. అలాగే అన్ని ఫార్మాట్లలో కలిపి 14వేల పరుగులు పూర్తిచేసిన ఎనిమిదో భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్ నిలిచాడు.

### శాంసన్.. సూపర్ మ్యాన్

**వ**రుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ బ్యాటింగ్‌లో విఫలమైన సంజూ శాంసన్.. కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో అందరినీ ఔరా.. అనిపించాడు. ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో శార్దూల్ వేసిన చివరి బంతికి టేలర్ షార్ట్ మిడ్ వికెట్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించాడు. ఆ బంతి వెళుతున్న తీరు చూస్తే పక్కా సిక్సర్ అనే అంతా భావించారు. కానీ పరిగెత్తుకొంటూ వచ్చిన శాంసన్ బౌండరీ లైన్ ఆవలకు సమాంతరంగా డైవ్ చేస్తూ బంతిని అందుకున్నాడు. అయితే ఈక్రమంలో తను కింద పడడం ఖాయం కాబట్టి లిప్తపాటులో బంతిని గ్రౌండ్‌లోకి విసిరేశాడు. దీంతో కివీస్ రెండు పరుగులతోనే సరిపెట్టుకోగా అటు శాంసన్ ఫీల్డింగ్ ప్రతిభను చూసి అంతా ఆశ్చర్యపోయారు.






### క్యా సీన్ హై..

**వి**రాట్ కోహ్లీ.. కేన్ విలియమ్సన్.. ఇద్దరినీ ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్లుగా పరిగణిస్తుంటారు. భారత్-కివీస్ మధ్య జరిగిన ఆఖరి టీ20లో ఈ ఇద్దరూ కలిసి కూర్చున్న దృశ్యం అందరినీ అబ్బురపరిచింది. ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్న వీరు తమ డ్రెస్సింగ్ రూమ్స్‌లో కాకుండా బౌండరీ లైన్ దగ్గర డిజిటల్ బోర్డుకు ఆనుకుని సరదాగా కబుర్లు చెప్పుకొంటూ మ్యాచ్‌ను వీక్షించారు. పక్కన పంత్ ఆసక్తిగా వీరి సంభాషణ వింటూ కనిపించాడు. అటు సోషల్ మీడియాలో ఈ ఫొటో వైరల్ అయ్యింది. క్రీడాస్ఫూర్తి అంటే ఇదేగా.. అంటూ బీసీసీఐ కూడా ఈ ఫొటోను ట్వీట్ చేసింది.

**1** — అత్యధిక టీ20 ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచిన తొలి కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ (10) రికార్డు. డుప్లెసీ (9)ని అధిగమించాడు.

**0** — మనీశ్ పాండే తుది జట్టులో ఉన్న 19 టీ20ల్లోనూ భారత్ ఒక్కసారి కూడా ఓడకపోవడం విశేషం.

## జొకోవిచ్ మొత్తం గ్రాండ్‌స్లామ్‌లు 17

ఆస్ట్రేలియన్ ఓపెన్ - 8
వింబుల్డన్ - 5
యూఎస్ ఓపెన్ - 3
ఫ్రెంచ్ ఓపెన్ - 1

ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు కొట్టాడిలా..




**సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్ పోరాడాడు.. రెండు సెట్లు కోల్పోయినా బెదరలేదు.. ఏమాత్రం ఒత్తిడిని, ఆందోళనను దరిచేరనీయలేదు.. అయినా పోరాటాలు అతడికి కొత్త అయితే కదా!.. మోచేతి గాయానికి శస్త్రచికిత్స జరిగి ఇక కెరీర్ కొనసాగదేమో అన్న స్థితినుంచి ఉత్తుంగతరంగమై ఎగిశాడు.. వరుసగా గ్రాండ్‌స్లామ్‌లు గెలుస్తూ తనలో ఇంకా ఎంతో సత్తా ఉందని నిరూపిస్తున్నాడు..ఆ క్రమంలో ఆదివారం డొమినిక్ థీమ్‌తో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోనూ ఐదు సెట్లు పోరాడాడు.. నిస్సత్తువ ఆవహించినా వెనుకంజ వేయలేదు.. చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు.. చివరకు విజేతగా నిలిచి రికార్డుస్థాయిలో ఎనిమిదోసారి మెల్‌బోర్న్ పార్క్ టైటిల్‌తో చరిత్ర సృష్టించాడు.**

# అష్ట దిగ్గజం

- ఎనిమిదో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో జొకోవిచ్ రికార్డు
- హోరాహోరీ ఫైనల్లో థీమ్‌పై విజయం



ట్రోఫీతో జొకోవిచ్

**మెల్‌బోర్న్:** యువ కిశోరాలు ఎందరో ఉన్నా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తననే హాట్‌ఫేవరెట్‌గా ఎందుకు అంచనా వేశారో 32 ఏళ్ల నొవాక్ జొకోవిచ్ నిరూపించాడు. ఆస్ట్రియాకు చెందిన ఐదోసీడ్ డొమినిక్ థీమ్‌తో నాలుగు గంటలపాటు హోరాహోరీగా సాగిన టైటిల్ ఫైట్‌లో 6-4, 4-6, 2-6, 6-3, 6-4 స్కోరుతో రెండో ర్యాంకర్ జొకోవిచ్ విజయం సాధించాడు. తద్వారా వరుసగా రెండో ఏడాదీ టైటిల్ అందుకోవడంతోబాటు పలు రికార్డులను సాధించాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో ఫైనల్‌కు ప్రవేశించిన ఎనిమిదిసార్లూ అతడు విజేతగా నిలిచాడు. అలాగే 17వ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ 20 గ్రాండ్‌స్లామ్‌లతో ఆల్‌టైమ్ రికార్డును తన పేరిట కలిగి ఉండగా, నడాల్ (19) రెండో స్థానంలో నిలిచాడు.

**తొలి సెట్ జొకోదే అయినా..:** మొదటి సెట్‌ను జొకో సునాయాసంగా గెలుచుకోగా..రెండోసెట్లో 4-4తో స్కోరు సమమైన దశనుంచి విజృంభించిన 26 ఏళ్ల థీమ్ వరుసగా ఆరు పాయింట్లు కైవసం చేసుకొని సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇదే ఊపులో మూడో సెట్‌నూ గెలిచాడు. నాలుగో సెట్‌లోనూ 3-4 స్కోరు వరకు మ్యాచ్ థీమ్ నియంత్రణలోనే ఉంది. కానీ ఇక్కడనుంచి పరిస్థితి మారిపోయింది. తన అనుభవాన్ని రంగరించిన జొకో.. రెండు సెట్లను మ్యాచ్‌ను సొంతం చేసుకొని టైటిల్‌ను పట్టేశాడు. మ్యాచ్‌లో తొమ్మిది ఏస్‌లు వేసిన జొకో 46 విన్నర్లు కొట్టాడు. 57 అనవసర తప్పిదాలు చేశాడు. ఇక.ఏకంగా 13 ఏస్‌లు సంధించిన థీమ్ 55 విన్నర్లు కొట్టి 57 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు.

**అంపైర్‌పై ఆగ్రహం**

సాధారణంగా కోర్టులో ఎంతో ప్రశాంతంగా ఉండే జొకోవిచ్‌కు కోపం వచ్చింది. రెండుసార్లు అతడు నిర్ణీత సమయంలో సర్వీస్ చేయకపోవడంతో అంపైర్ జొకోను హెచ్చరించాడు. దాంతో సెట్ ముగిశాక తన సీటులో కూర్చునేందుకు వెళ్లే సమయంలో అంపైర్ డామిన్ బూటుపై చేతితో కొడుతూ 'నీ విధులు గొప్పగా నిర్వర్తించావు. బాగా ప్రఖ్యాతుడవయ్యావు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు.

**1** — ఓపెన్ ఎరాలో మూడు విభిన్న దశకాల్లో గ్రాండ్‌స్లామ్‌లు (2000, 2010, 2020) గెలిచిన తొలి ఆటగాడు జొకోవిచ్.

ఇప్పటిదాకా రెండో ర్యాంకులోనున్న జొకోవిచ్ తాజా విజయంతో నడాల్ నుంచి టాప్‌ర్యాంక్ అందుకోనున్నాడు.

**3** — గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో థీమ్ పరాజయాల సంఖ్య.




థీమ్

ఒకే గ్రాండ్‌స్లామ్‌ను 8 అంతకంటే ఎక్కువ సార్లు గెలిచిన మూడో ఆటగాడు జొకోవిచ్. నడాల్ (ఫ్రెంచ్ ఓపెన్ 12సార్లు), ఫెడరర్ (వింబల్డన్ 8సార్లు) తొలి రెండుస్థానాల్లో ఉన్నారు.

## ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

### మహిళల ముక్కోణపు సిరీస్

**కాన్‌బెర్రా:** ఎలీస్ పెర్రీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టడంతో.. ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. తొలుత బంతితో విజృంభించిన పెర్రీ (4/13).. ఛేదనలో 49 పరుగులతో ఆసీస్‌ను ఒంటిచేత్తో గెలిపించింది. మహిళల ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (35), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (28) ఫర్వాలేదనిపించారు. స్వల్ప లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 18.5 ఓవర్లలో 104/6తో విజయాన్ని అందుకొంది. రాజేశ్వరీ గైక్వాడ్ (2/18) రెండు వికెట్లు పడగొట్టింది.



ఈనెల 5 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ బాల బాలికల జట్ల క్రీడాకారులు

## జూ. మిస్టర్ ఇండియా.. ప్రీతేష్




ప్రీతేష్

**అమలాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి):** జాతీయ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో మహారాష్ట్రకు చెందిన ప్రీతేష్ సీతారామ్ గమారే జూనియర్ మిస్టర్ ఇండియా టైటిల్‌ను దక్కించుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం ఇందుపల్లి ఏ1-కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పోటీల్లో భాగంగా ఆదివారం రాత్రి చాంపియన్ ఆఫ్ ది చాంపియన్, జూనియర్ మిస్టర్ ఇండియా టైటిల్ పోరు హోరాహోరీగా సాగింది. ఇదే టోర్నీ సందర్భంగా మహిళల ఫిజిక్ పోటీలు, దివ్యాంగుల శరీర సౌష్టవ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ ఉమెన్స్ మోడల్ ఫిజిక్ పోటీల్లో యూన్సీదేవి (మణిపూర్), సీనియర్స్‌లో కెట్కీపాటిల్ (కర్ణాటక), దివ్యాంగుల కేటగిరిలో బీంట్‌సింగ్ (పంజాబ్) స్వర్ణాలు సాధించారు.




మహిళల విభాగంలో పోటీపడుతున్న బాడీ బిల్డర్లు

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com